జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 11 సెప్టెంబర్ 2026 | సంపుటి: 19 | సంచిక: 168 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: చతుర్దశి - 10:34:59 వరకు నక్షత్రంమాఘ - 14:05:10 వరకు కరణంశకుని - 10:34:59 వరకు, చతుష్పాద - 21:43:34 వరకు పక్షంకృష్ణ యోగంసిద్ధ - 19:17:38 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL    http://www.prajajyothinews.com    Mail: prajajyothidaily@gmail.com


## ట్రంప్ డివిడెండ్

**రిపబ్లికన్లు గెలిస్తే ప్రతి అమెరికన్‌కు 5 వేల డాలర్లు**

**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన హామీ**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర చర్చనీయాంశమైన ప్రకటన చేశారు. రాబోయే మధ్యంతర ఎన్నికల్లో తమ రిపబ్లికన్ పార్టీ విజయం సాధించి, కాంగ్రెస్‌లోని ఉభయ సభలపై నియంత్రణ

మిగతా 2లో..

## లడఖ్‌కు త్వరలోనే ప్రత్యేక హోదా..

**ఆర్టికల్ 371 సవరణకు కేంద్రం కసరత్తు**

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): గత నాలుగేళ్లుగా లడఖ్ ప్రజలు చేస్తున్న డిమాండ్ నెరవేరే సూచనలు కనిపిస్తున్నాయి. లడఖ్ ప్రాంతానికి ఆర్టికల్ 371 కింద రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. అలాగే హిమాలయ ప్రాంతమైన లడఖ్ పాలన కోసం భారతదేశంలోనే మొదటిసారిగా 'సూయి జెనెరిస్' నమూనాలో ఒక ఎన్నికైన పాలక మండలిని ఏర్పాటు చేయనున్నారు. ఎన్డీటీవీకి ఇచ్చిన

మిగతా 2లో..



# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి

- అసెంబ్లీ కార్యకలాపాలను అడ్డుకుంటోంది
- అధికారం పోయినా అహంకారం పోలేదు
- వారి కుట్రలను సమర్థంగా ఎదుర్కోవాలి
- ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- బీఆర్ఎస్‌పైనే ప్రజల్లో వ్యతిరేకత ఉంది
- కాంగ్రెస్‌కు నష్టం చేసేందుకు కుట్రలు
- బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం!
- సభ్యుల పనితీరే గెలుపునకు మూలం
- తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శం
- సర్‌పై అందరూ అప్రమత్తంగా ఉండండి
- సీఎల్పీ సమావేశంలో రేవంత్ వ్యాఖ్యలు
- ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం
- అసెంబ్లీ ఘటనపై సర్కార్ ఫ్లాష్ సర్వే..

**"గత మూడు రోజులుగా జరిగిన పరిణామాలపై ప్రభుత్వం ఫ్లాష్ సర్వే చేయించింది. బీఆర్ఎస్ నేతల తీరునే ప్రజలు తప్పుబట్టినట్లు సర్వేలో తేలింది. ప్రభుత్వంపై వ్యతిరేకత లేనట్లు తేలింది. ఎస్ఐఆర్ పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోంది. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా తేల్చారు. కానీ ఓటర్ల జాబితా మాత్రం 88 కోట్లుగా చూపుతున్నారు. దేశంలో 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయి"**

**- సీఎల్పీ సమావేశంలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు**



హైదరాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ వేదికగా అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య రాజకీయ వివాదం మరింత వేడెక్కింది. అసెంబ్లీ కమిటీ హాల్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ శాసనసభా పక్ష సమావేశంలో ఇటీవల అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, ప్రతిపక్షాల వ్యవహారశైలి, ప్రభుత్వ భవిష్యత్ వ్యూహంపై కీలకంగా చర్చించినట్లు సమాచారం. ఈ సందర్భంగా గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పరిణామాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించినట్లు చెబుతున్న ఓ ఫ్లాష్ సర్వే

మిగతా 2లో..

## ఉద్యోగుల పక్షాన ఉంటా..

- ఆరు డీఏలు త్వరలో ప్రకటిస్తాం
- పీఆర్సీ నివేదికను వెంటనే అందాలి
- డీఏలపై సీఎం రేవంత్ కీలక హామీ
- సమస్యలపై సీఎంతో జేఏసీ చర్చలు

హైదరాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వ ఆహ్వానం మేరకు సీఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. క్షేత్రస్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు, పెరుగుతున్న పని ఒత్తిడిని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆరు డీఏలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులకు జరుగుతున్న ఆర్థిక నష్టాన్ని వివరించారు.

మిగతా 12లో..

# సర్కారు భూములపై అనుముల గద్దలు

- కొండల్ రెడ్డికి అక్రమ కేటాయింపులు
- నిబంధనలకు విరుద్ధంగా భూముల కేటాయిపు
- 200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని ఇచ్చారు
- ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించాం
- ప్రశ్నించినందుకే ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారు
- బినామీ కంపెనీల లబ్ధికోసమే సిఎం పనిచేస్తున్నారు
- 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్'తో అక్రమ ఒప్పందాలు
- ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో అంత దోపిడీ
- సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి
- వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోన్న ప్రభుత్వం
- నిజాయతీ ఉంటే వెంటనే కేంద్రం స్పందించాలి
- సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలు వెలికితీయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు
- రేవంత్ రెడ్డికి సొంత ఊరి నుంచే కౌంట్‌డౌన్ షురూ
- ఫ్యూచర్ సిటీలో కొండల్ రెడ్డి భూముల పరిశీలన
- ఫ్యూచర్ సిటీ భూముల వద్ద తీవ్ర ఉద్రిక్తత..
- కేటీఆర్, హరీశ్ రావు ఆధ్వర్యంలో భారీ నిరసన!

హైదరాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోదరుడు కొండల్ రెడ్డికి చెందిన షెల్ కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమిని కట్టబెట్టారని, ఈ భూదోపిడీని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించినందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వరుసగా సస్పెండ్ చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. టెస్సరాక్ట్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు కేటాయించిన భూములను పరిశీలించేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సీనియర్ నేత హరీశ్ రావు నేతృత్వంలోని బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం క్షేత్రస్థాయికి చేరుకుంది. కొండల్ రెడ్డికి అనుకూలంగా ప్రభుత్వం ఈ భూములను కట్టబెట్టిందని ప్రధానంగా ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, వివాదాస్పద భూములను స్వయంగా పరిశీలించేందుకు తుక్కుగూడ పరిసర ప్రాంతాలకు భారీ కాన్వాయ్‌తో చేరుకోవడంతో ఒక్కసారిగా అక్కడ తీవ్ర ఉద్రిక్త

మిగతా 2లో..




## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

- మెట్రోతో మరో 50 బస్సులు అనుసంధానిస్తాం
- పీఎం ఈడ్రైవ్ కింద నగరానికి 2,200 బస్సులు
- తెలంగాణలో కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం
- రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో ఆర్టీసీ మూసివేసే పరిస్థితి ఉండగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతోందని రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శానససభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొన్నం సమాధానాలిచ్చారు. పీఎం ఈడ్రైవ్ కింద హైదరాబాద్ నగరానికి 2,200 బస్సులు రాబోతున్నాయని తెలిపారు. ఆర్టీసీలో కార్మిక సంఘాల ఎన్నికల)కు గత ప్రభుత్వం రద్దు చేసిందన్న మంత్రి, త్వరలో ఎన్నికల తేదీపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కొత్త ఈవీ పాలసీ తీసుకొచ్చాం. హైదరాబాద్ నగరానికి 100 మినీ బస్సులు

మిగతా 12లో..

## పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

**సెక్షన్ 70 లోని సబ్ సెక్షన్ 3ను సవరించేలా బిల్లు**

హైదరాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): పంచాయతీల సొంత వనరుల ద్వారా వచ్చే ఆదాయం, ప్రభుత్వ ట్రెజరీలో కాకుండా బ్యాంకు ఖాతాల్లో జమ చేసుకునేలా చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం-2018లోని సెక్షన్ 70 లోని సబ్ సెక్షన్ 3ను సవరించేలా

మిగతా 12లో..

## రూ.2 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుకు రూ.లక్ష లంచం

**తెలంగాణ సచివాలయంలో ఏసీబీ దాడులు..**

హైదరాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): తెలంగాణ సచివాలయంలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు చేపట్టిన ట్రాప్ కలకలం రేపింది. ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.2 లక్షల మెడికల్ రీయింబర్స్‌మెంట్ చెక్కును ఇప్పించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు అందిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు రంగంలోకి

మిగతా 12లో..

## కాంగ్రెస్ పార్టీ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తోంది

- ఫేక్ సోషల్ మీడియా ద్వారా మాపై దాడిచేస్తోంది
- ఫేక్ వార్తను అసెంబ్లీలో రేవంత్ ప్రస్తావిస్తున్నారు
- సభకు, ప్రజలకు సిఎం రేవంత్ క్షమాపణ చెప్పాలి
- సిఎంపై సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తాం
- నీళ్లు ఉండి మోటార్లు నడపడం చాతకాని సిఎం
- ఇలాంటి ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నా..
- రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు..
- మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు రేవంత్
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు వెల్లడి



హైదరాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా ఫేక్ అకౌంట్లను సృష్టించి ప్రతిపక్షాలపై అత్యంత దుర్మార్గమైన దాడికి పాల్పడుతోందని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులే స్వయంగా నిర్వహిస్తున్న ఒక ఫేక్ అకౌంట్‌లోని పోస్టులను పట్టుకుని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రస్తావించడం కన్నా దౌర్భాగ్య పరిస్థితి మరొకటి లేదని ఎద్దేవా చేశారు. తాజాగా సోషల్ మీడియాలో కలకలం రేపుతున్న 'సంధ్యా రావు' అనే ఫేక్ అకౌంట్ వెనుక కాంగ్రెస్ పార్టీ హ్యాండ్లర్లే ఉన్నారని హరీశ్‌రావు ఆరోపించారు. ఆ నకిలీ ఖాతాలో చేసిన వ్యాఖ్యల ఆధారంగా ముఖ్యమంత్రి శాసనసభను తప్పుదోవ పట్టించారని, దీనికి బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి వెంటనే సభకు, ప్రజలకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సదరు ఫేక్ అకౌంట్‌పై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి, దాని వెనుక ఉన్న ముఠాను అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన అంశంపై ముఖ్యమంత్రిపై సభా

మిగతా 2లో..




# నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్

- పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అడుగులు
- 2,000కు పైగా కంపెనీలతో ఎకోసిస్టమ్
- వ్యాక్సిన్ల తయారీలో గ్లోబల్ లీడర్‌గా హైదరాబాద్
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు
- లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల్లో నూతనాధ్యాయం
- ఎంఎస్‌డీ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గురువారం ఈ కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌డీ డిజిటల్ హ్యూమన్ హెల్త్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రితేష్ శ్రీవాస్తవ, తెలంగాణ ప్రభుత్వ ఐటీ సలహాదారు సాయికృష్ణ, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సీఈవో సర్వేశ్ సింగ్‌తో పాటు సంస్థ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ..

మిగతా 12లో..

# చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం..

**మరమ్మతుల కోసం ఆగిన కార్గో నౌక**

**20 మంది మృతి, ఐదుగురు గల్లంతు**




న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): చైనాలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్‌లో మరమ్మతుల నిమిత్తం నిలిపి ఉంచిన ఒక కార్గో నౌకలో భారీగా మంటలు చెలరేగాయి. ఈ విషాద ఘటనలో సుమారు 20 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ఐదుగురు గల్లంతయ్యారు. లైబీరియా జెండాతో ఉన్న 'ఓషన్ మెలోడీ' అనే కార్గో నౌకను మరమ్మతుల కోసం షిప్‌యార్డ్‌కు తీసుకువచ్చారు.

మిగతా 12లో..

## హైదరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ హబ్

**ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల**

**796.28 ఎకరాల భూమి కేటాయింపు**

హైదరాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): తెలంగాణ రవాణా రంగాన్ని సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రతిష్ఠాత్మక అడుగులు వేస్తున్నాయి. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న బుల్లెట్ ట్రైన్ హబ్‌కు మొదటి అడుగు పడింది. హైదరాబాద్ మహా నగరాన్ని దేశంలోనే మొట్టమొదటి హైస్పీడ్ బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో బుల్లెట్ ట్రైన్ హబ్‌ను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో భారీ ఇంటిగ్రేటెడ్ మొబిలిటీ హబ్ పేరిట

మిగతా 12లో..

# సంపాదకీయం

## ప్రైవేటీకరణకే మొగ్గు?

ఇస్రో అంటే నేటి ప్రపంచంలో తెలియని వారుండరు. ఇస్రో అంతరిక్షయానంలో కీలక అడుగులు వేస్తూ భారతదేశ అమ్ములపొదిలో తనదైన స్థానంతో ముందుకు దూసుకుపోతోంది. ఇప్పటికే ఎన్నో పరిశోధనలతో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని దక్కించుకుంది. అలంటి ఇస్రో నేడు ప్రైవేటుపరం కాబోతోందని పుకార్లు చికారై చెక్కర్లు కొడుతోంది. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రైవేటీకరణ అడ్డూఅదుపు అనేది లేకుండా సాగిపోతున్నది. అనేక ప్రభుత్వరంగ కంపెనీలను ఒక్కొక్కటిగా అస్మదీయులైన కార్పొరేట్లకు కట్టబెడుతుండటం తెలిసిందే. ముఖ్యంగా రేవులు, విమానాశ్రయాల ప్రైవేటీకరణ ఈ ధోరణికి అద్దం పడుతున్నది. తాజాగా భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రైవేట్ బాట పట్టిస్తున్నారనే వివాదం ముసురుకుంటున్నది. ప్రభుత్వం ఇస్రోను ప్రైవేటీకరించడం లేదని అంటున్నప్పటికీ, జరుగుతున్న పరిణామాలు మరోరకం సంకేతాలు వెలువరిస్తున్నాయి. రాకెట్ల తయారీ, ఉపగ్రహాల నిర్మాణం, లాంచ్ సేవలు వంటి కీలక రంగాలను క్రమంగా ప్రైవేట్ కంపెనీలకు అప్పగించే యత్నాలు జరుగుతున్న మాట వాస్తవం. ఒకప్పుడు పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అంతరిక్ష రంగంలో కార్పొరేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకుంటున్నాయిజరుగుతున్న పరిమాణాలపై ఇస్రో సిబ్బందిలో అసమ్మతి రాజుకుంటున్నది. తమ ప్రాముఖ్యం తగ్గిపోతుందని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. అనుభవజ్ఞులైన శాస్త్రవేత్త లు ప్రైవేట్ రంగానికి వెళ్లిపోతున్నారనే వార్తలు కూడా జోరుగా వినవస్తున్నాయి. అందుకు ఉద్యోగులు ఎంచుకుంటున్న స్వచ్ఛంద ఉద్యోగ విరమణపై సంస్థ ఆంక్షలు విధించాల్సి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తున్నది. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించడం తప్పు కాదు. ప్రపంచవ్యాప్తంగా అంతరిక్ష రంగంలో ప్రభుత్వప్రైవేట్ భాగస్వామ్యం పెరుగుతున్నది. కానీ అక్కడ ప్రభుత్వ సంస్థలు తమ కేంద్రీయ పాత్రను కోల్పోవడం లేదు. ఉదాహరణకు, అమెరికాలో నాసా ప్రైవేట్ కంపెనీలతో పనిచేస్తున్నప్పటికీ, దిశానిర్దేశం, నియంత్రణ, పరిశోధనలో కీలక స్థానాన్ని నిలుపుకొంటున్నది. కానీ భారతదేశంలో మాత్రం పరిస్థితి భిన్నంగా మారుతున్నదనే వాదన వినిపిస్తున్నది. ఇస్రోను బలహీనపరుస్తూ, కార్పొరేట్ సంస్థలను ముందుకు తెస్తున్నారనే విమర్శలు జోరందుకుంటున్నాయి. ఇస్రోలో ప్రైవేటీకరణ దిశగా జరుగుతున్న చర్యలపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఉద్యోగ సంఘాలు కేంద్ర ప్రభుత్వానికి గట్టిగా అల్టిమేటమ్ ఇచ్చాయి. ఇస్రో స్వరూప, స్వభావాలను దెబ్బతీసే విధంగా కీలక కార్యకలాపాలను ప్రైవేట్ సంస్థలకు బదిలీ చేస్తే తాము మౌనంగా ఉండబోమని తాఖీదు జారీ చేశాయి. పరిశోధన స్వాతంత్ర్యం, ఉద్యోగ భద్రత, సంస్థ భవిష్యత్తుపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ప్రభుత్వం తక్షణమే తన విధానాలపై పునరాలోచన జరుపాలని కోరుతున్నాయి. లేకపోతే ఆందోళనలకు దిగడమే కాకుండా, దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తల స్థాయిలో నిరసనలు ఉధృతం చేసే అవకాశమున్నదని తెలిపాయి. ఇది కేవలం ఉద్యోగుల అసంతృప్తి కాదు, ఇస్రో భవిష్యత్తుపై పెరుగుతున్న ఆందోళనకు ప్రతిబింబం. ఇన్-స్పేస్, ఎన్ఎస్ఐఎల్ వంటి కొత్త సంస్థలు కూడా ఈ చర్చలోకి వస్తున్నాయి. ఆదానీ, అంబానీ వంటి దేశంలోని అగ్ర కార్పొరేట్ సమూహాలు అంతరిక్ష రంగంలోకి అడుగుపెట్టడం మరో కీలక చర్చకు దారితీస్తున్నది. ప్రభుత్వ విధానాల మార్పులతో స్పేస్ రంగం ప్రైవేట్ పెట్టుబడులకు ద్వారాలు తెరుచుకోవడంతో, ఈ భారీ కంపెనీలు రాకెట్ తయారీ, ఉపగ్రహ సేవలు, స్పేస్ టెక్నాలజీ వ్యాపారాల్లో అవకాశాలను అన్వేషిస్తున్నాయి. ఒకవైపు ఇది పెట్టుబడులు, సాంకేతిక అభివృద్ధికి దోహదపడుతుందనే వాదన ఉన్నప్పటికీ, మరోవైపు ఇస్రో వంటి ప్రభుత్వరంగ సంస్థల సామర్థ్యాన్ని ఉపయోగించుకొని కార్పొరేట్లు అదే రంగంపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత లేకపోవడం, స్పష్టమైన హద్దులు లేకపోవడం వల్ల సందేహాలు మరింత బలపడుతున్నాయి. ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో అంతరిక్ష రంగం విస్తరిస్తుందని, పెట్టుబడులు వస్తాయని తద్వారా ఉద్యోగాలు పెరుగుతాయనేది ప్రభుత్వ వాదన. ఇది కొంతవరకు నిజమే కావచ్చు. ప్రైవేట్ రంగాన్ని ప్రోత్సహించాల్సిందే. అయితే అందుకు ఇస్రోను బలిపెట్టకుండా చూడాలి. పరిశోధన, ఆవిష్కరణ, వ్యూహాత్మక నియంత్రణ.. ఇవన్నీ ఇస్రో చేతుల్లోనే ఉండాలి. కార్పొరేట్ సంస్థలు సహాయక భాగస్వాములుగా మాత్రమే ఉండాలి. ఏదేమైనా ఇస్రోను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఒకవేళ ప్రైవేటు దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తే అలాంటి ఆలోచనలు విరమించుకోవాలి. ప్రైవేటు దిశగా ప్రయత్నాలు చేస్తే దేశ అడ్డుకొని ప్రైవేటు పరంగా కాకుండా చూడాల్సిన బాధ్యత దేశ్ ప్రజలపై ఎంతైనా ఉంది.



# బీఆర్ఎస్ కుట్రలను తిప్పికొట్టండి



మొదటిపేజీ తరువాయి..

ఫలితాలను సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యేల ముందు ప్రస్తావించినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనలపై ప్రభుత్వం.. ఫ్లాష్ సర్వే చేయించిందని సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో తెలిపారు. ఆ సర్వేలో రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా వ్యతిరేకత కనిపించలేదని.. బదులుగా బీఆర్ఎస్ నేతల వ్యవహారశైలినే ప్రజలు తప్పుబట్టినట్లు తేలిందని ఆయన పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీన అసెంబ్లీ గేటు వద్ద చోటుచేసుకున్న పరిణామాలు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వివాదం.. ఎర్రవల్లిలో చోటుచేసుకున్న శుద్ధీకరణ కార్యక్రమం వంటి అంశాలను సీఎం రేవంత్ రెడ్డి ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు సమాచారం. ఈ ఘటనలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను కూడా ఎమ్మెల్యేలకు వివరించినట్లు తెలుస్తోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ అసెంబ్లీ కార్యకలాపాలను సజావుగా సాగనివ్వకుండా కుట్ర చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఫామ్‌హౌస్‌లో సమావేశమై సభను అడ్డుకునే వ్యూహాన్ని రూపొందించారని ఆయన విమర్శించినట్లు తెలుస్తోంది. అధికారం కోల్పోయినప్పటికీ బీఆర్ఎస్ నేతలు తమ అహంకార వైఖరిని మార్చుకోలేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించినట్లు సమాచారం. పోలీసు అధికారులు, ప్రజాప్రతినిధుల పట్ల అనుచితంగా వ్యవహరించారని.. మహిళా పోలీసు అధికారుల ఎదుట టీషర్టులు విప్పడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించినట్లు తెలుస్తోంది. అలాగే శాసనసభాపతిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని సీఎం పేర్కొన్నట్లు సమాచారం. అసెంబ్లీ వద్ద జరిగిన పరిణామాలను ఎదుర్కొని ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రేవంత్‌రెడ్డి అభినందించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యేల పనితీరుపైనా సీఎం రేవంత్‌రెడ్డి సమావేశంలో దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ప్రజలు అప్పగించిన పదవిని బాధ్యతగా నిర్వహించాలని, అసెంబ్లీ జరిగే అన్ని రోజుల్లో సభ్యులు పూర్తి స్థాయిలో హాజరై చర్చల్లో పాల్గొనాలని సూచించినట్లు తెలుస్తోంది. తమ తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సభలో ప్రస్తావించాలని ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ఎమ్మెల్యేల వ్యక్తిగత పనితీరు, ప్రవర్తన భవిష్యత్ రాజకీయ విజయాలపై ప్రభావం చూపుతుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించినట్లు తెలుస్తోంది. మొదటిసారి ఎన్నికైన ఎమ్మెల్యేల ప్రవర్తన రెండోసారి గెలుపుపై ప్రభావం చూపుతుందని.. వ్యక్తిగత పనితీరే గెలుపు, ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి శాసన సభ్యులకు సూచించారు. కాంగ్రెస్ నుంచి రాజకీయంగా ఎదిగి ప్రస్తుతం ఆ పార్టీపై విమర్శలు చేస్తున్న కొందరు నేతల వ్యవహారశైలిని కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోతే సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి వంటి నేతలు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా అని ఆయన ప్రశ్నించినట్లు సమాచారం. పోలీసు సిబ్బందిపై జరిగిన ఘటనను ప్రస్తావిస్తూ.. కేటీఆర్‌కు పోలీసు అధికారుల్లో రేవంత్‌రెడ్డి కనిపించినట్లుగా ఉందని, అందుకే వారిపై అంత ఆగ్రహంతో వ్యవహరించారని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేసినట్లు తెలుస్తోంది. తెలంగాణలో నిర్వహించిన కులగణన దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నట్లు సమాచారం. తెలంగాణ నమూనాలో దేశవ్యాప్తంగా కులగణన చేపట్టేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కులగణన ద్వారా వచ్చిన అంశాలను జాతీయ స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని.. దీనిపై పార్టీ ప్రజాప్రతినిధులు విస్తృతంగా మాట్లాడాలని సీఎం సూచించినట్లు సమాచారం. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) పేరుతో ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించినట్లు సమాచారం. మరోసారి ఎమ్మెల్యేగా గెలవాలని భావించే ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పరిరక్షణ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది. దేశంలో వయోజనుల జనాభా, ఓటర్ల జాబితాలో నమోదైన ఓట్ల మధ్య వ్యత్యాసాన్ని ప్రస్తావిస్తూ సీఎం రేవంత్ రెడ్డి పలు ప్రశ్నలు లేవనెత్తినట్లు సమాచారం. అయితే ఈ అంశంపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ ఆరోపణలేనని.. ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన తుది నిర్ణయాలు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారమే జరుగుతాయని గమనించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న నేపథ్యంలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేలకు సూచించినట్లు సమాచారం. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలపై ప్రజలకు విస్తృతంగా వివరించాలని, వాటి ఫలితాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలుస్తోంది. వెయ్యి రోజుల పాలనలో ఎమ్మెల్యేలు అందించిన సహకారానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు.

# సర్కారు భూములపై అనుముల గద్దలు



మొదటిపేజీ తరువాయి..

వాతావరణం నెలకొంది. ఈ పరిశీలన పర్యటనలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు. చేతుల్లో ప్లకార్డులు, భారీ బ్యానర్లు పట్టుకుని నేతలు ఆందోళన నిర్వహించారు. ప్రజాధనంతో ముడిపడి ఉన్న విలువైన ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ సంఘటనా స్థలంలో నిరసన చేపట్టారు. ఈ భూముల అంశం అసెంబ్లీలోనూ తీవ్ర గందరగోళానికి దారితీసింది. సభలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నంలో భాగంగా పోడియం వద్దకు దూసుకెళ్లిన బీఆర్ఎస్ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్ణయాలను ఖండిస్తూ పోడియం వద్ద పేపర్లు చింపి పైకి ఎగురవేయడంతో సభలో గందరగోళం తలెత్తింది. సభ్యుల ఆందోళన అదుపు తప్పడంతో స్పీకర్/చైర్మన్ జోక్యం చేసుకుని, సభా మర్యాదలను కాపాడేందుకు మార్షల్స్‌ను రంగంలోకి దించాలని ఆదేశాలు జారీ చేశారు. అసెంబ్లీలో నిరసనల అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన కోసం కేటీఆర్, హరీశ్ రావు నేతృత్వంలోని ఎమ్మెల్యేలు తుక్కుగూడలోని టెస్సరాక్ట్ సైట్‌కు చేరుకోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు పేరుతో జరుగుతున్న భూకేటాయింపులపై పూర్తిస్థాయి వాస్తవాలను ప్రజల ముందుకు తెస్తామని, ఈ అంశంపై న్యాయపరమైన, ప్రజా పోరాటం కొనసాగిస్తామని బీఆర్ఎస్ నేతలు స్పష్టం చేశారు. నాయకుల రాకతో స్థానిక పరిసరాల్లో భారీగా మోహరించిన పోలీసులు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు. పర్యవేక్షించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రోజుకు 18 గంటలు పనిచేస్తున్నానని నిత్యం చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, ఆ సమయాన్నంతా తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం కాకుండా తన సొంత సోదరులు, బినామీ షెల్ కంపెనీల లబ్ధి కోసమే కేటాయిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేవలం రూ. లక్ష మూలధనంతో నడిచే కంపెనీకి ఐదెకరాల విలువైన భూమిని ఎలా కేటాయిస్తారని కేటీఆర్ నిలదీశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎవరైనా కేవలం లక్ష రూపాయలతో స్టార్టప్ పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే వందల కోట్ల విలువైన భూములు ఇస్తుందా..? అని సూటిగా ప్రశ్నించారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ ఇజ్రాయెల్ వ్యాపార భాగస్వామ్యాలపై ప్రధాని మోదీని ప్రశ్నిస్తుంటే, ఇక్కడ తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రేవంత్ రెడ్డి సోదరుడి కోసం 'ఇజ్రాయెల్ ఇన్నోవేషన్' సంస్థతో ఒప్పందాలు కుదుర్చుకుని ఏరోస్పేస్, డిఫెన్స్ వెంచర్ల పేరుతో భూములు కొల్లగొడుతోందని ఆరోపించారు. నెలకు రూ.4,000 పింఛన్, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిన కాంగ్రెస్, సీఎం సొంత తమ్ముళ్లకు మాత్రం అద్భుతమైన ఉపాధి, వందల కోట్ల ఆస్తులు కట్టబెడుతోందని దుయ్యబట్టారు. ఈ భారీ భూ కుంభకోణంపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే తక్షణమే ప్రవర్తన, పత్రాలపై ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలతో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామం కొండారెడ్డిపల్లి సమీపంలోనే రైతులు కరెంట్ కోసం రోడ్డెక్కడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిలువెత్తు నిదర్శనమనిమాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లి సమీపంలోని శ్రీశైలం--హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతులు మెరుపు ధర్నాకు దిగడం, ట్రాక్టర్లతో రాస్తారోకో చేయడం ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతూ రేవంత్ రెడ్డికి కౌంట్‌డౌన్ మొదలైందన్నారు. పంటలు ఎండిపోతుంటే రైతులు రోడ్డెక్కారు.. కానీ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపు లేకపోవడం దుర్మార్గమని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు 24 గంటల కరెంట్ హామీ ఇచ్చి, ఇప్పుడు రైతులకు 6--8 గంటల విద్యుత్ కూడా సరఫరా చేయకపోవడం శోచనీయమని అన్నారు. రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, వారి గోడును పట్టించుకోకుండా చోద్యం చూడడం విడ్డూరమని తెలిపారు. ముఖ్యమంత్రి సొంత గ్రామానికి కూతవేటు దూరంలోనే రైతులు కరెంట్ కోసం జాతీయ రహదారిపైకి రావాల్సి పరిస్థితిని వస్తే దాన్ని 'ప్రజా పాలన' అంటారా? అని నిలదీశారు. సొంత ఇలాకాలోని రైతుల సమస్యలే పరిష్కరించలేని సీఎం , తెలంగాణలోని లక్షలాది మంది రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారు? ఇదేనా కాంగ్రెస్ తెచ్చిన 'మార్పు' . రైతుల ఆక్రందన రేవంత్ రెడ్డికి వినిపించడం లేదా ? ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మొద్దునిద్ర వీడి రైతుల పొలాలకు 24 గంటల కరెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



# కాంగ్రెస్ పార్టీ ఫేక్ అకౌంట్లు సృష్టిస్తోంది

మొదటిపేజీ తరువాయి..

హక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తామని... అలాగే ఈ పరువు నష్టం, నకిలీ ఖాతాల వ్యవహారంపై పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేయనున్నట్లు స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి మార్షల్స్‌తో మమ్మల్ని ఎత్తడం కాదు.. మోటార్లు ఆన్ చేసి రైతులకు నీళ్లు ఎత్తు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సవాల్ విసిరారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అదే మహబూబ్ నగర్ జిల్లాలో భీమా ప్రాజెక్టులో 3 మోటార్లు ఉంటే ఒక్క మోటార్ మాత్రమే నడుపుతున్నారు. నికర జలాల కేటాయింపులున్న ప్రాజెక్ట్ భీమా. కానీ ఏ జలాల కేటాయింపులు లేని, బేసిన్ లేని వెలిగొండకి మాత్రం చంద్రబాబు నీళ్లు తీసుకుపోతడు.. బేసిన్లు ఉన్న నికర జలాల కేటాయింపులు ఉన్న అన్ని అనుమతులున్న భీమా మోటార్లు ఎందుకు నడపడం లేదు రేవంత్ రెడ్డి.. ఇదేనా నీకు పాలమూరు మీద ఉన్న ప్రేమ అని హరీశ్ రావు అడిగారు.కరువు పీడిత ప్రాంతం నడిగడ్డ, గద్వాల, అలంపూర్ ప్రాంతానికి నీళ్లిచ్చే నెట్టంపాడులో 4 మోటార్లు ఉంటే ఒకటే నడుపుతున్నారన్నారు హరీశ్ రావు . కోయిల్ సాగర్‌లో 3 మోటార్లు ఉంటే ఒక్కటే నడుపుతున్నారు. రెండు మోటార్లు నడిపితేనే కోయిల్ సాగర్ నిండడానికి 3 నెలలు పడుతుంది.. ఇప్పుడు నువ్వు ఒక్కటే మోటార్ నడిపితే అది నిండడానికి 6 నెలలు పడుతుంది. 6 నెలల వరకు జూరాల ప్రాజెక్టులో నీళ్లు ఉంటాయా..? కోయిల్ సాగర్ నిండుతదా అని ప్రశ్నించారు. నీళ్లు ఉండి మోటార్లు నడపలేని చాతకాని ముఖ్యమంత్రిని నిన్నే చూస్తున్నానన్నారు. బీఆర్ఎస్ ఉన్నప్పుడు 2014-15 నుండి 2023-24 వరకు ప్రతి సంవత్సరం వచ్చిన కృష్ణ నది నీళ్లలో 45 శాతం నుండి 30 శాతం ఎత్తామని.. కాంగ్రెస్ ప్రభుత్వం 2024-25లో 28.49 శాతం నీళ్లు ఎత్తారు, 2025-26లో 25 శాతం మాత్రమే ఎత్తారని హరీశ్ రావు తెలిపారు. దీన్ని బట్టి ఎవరు తెలంగాణ ప్రయోజనాలు కాపాడారో అర్థం కావడం లేదు. తెలంగాణ ఏర్పడిన తర్వాత కృష్ణ జలాల్లో అతి తక్కువ సాగు నీరు వాడుకున్నది ఈ మూడు సంవత్సరాలలోనేనన్నారు.

# టీవీకే పార్టీకి అధికారిక గుర్తింపు

న్యూఢిల్లీ,సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): ప్రముఖ నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీకి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) రాష్ట్ర పార్టీగా అధికారిక గుర్తింపునిచ్చింది. పార్టీకి శాశ్వత ఎన్నికల గుర్తుగా 'విజిల్'ను కేటాయిస్తూ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే కనబరిచిన అద్భుత పనితీరు ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన టీవీకే, మొత్తం 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 108 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. రాష్ట్రవ్యాప్తంగా పోలైన ఓట్లలో 34.92 శాతం సాధించి తన సత్తా చాటింది. ఎన్నికల నిబంధనల ప్రకారం, ఒక పార్టీకి రాష్ట్ర పార్టీ హోదా దక్కాలంటే కనీసం 6 శాతం ఓట్లతో పాటు రెండు అసెంబ్లీ స్థానాలు గెలవాలి లేదా మొత్తం ఓట్లలో 8 శాతం సాధించాలి. టీవీకే ఈ నిబంధనలను సునాయాసంగా అధిగమించి ఈ గుర్తింపును సొంతం చేసుకుంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు టీవీకేకు 'విజిల్'ను ఉమ్మడి గుర్తుగా ఈసీ కేటాయించగా, ఎన్నికల్లో సాధించిన ఘన విజయం నేపథ్యంలో ఇప్పుడు అదే గుర్తునే శాశ్వతంగా ఖరారు చేసింది. తాజా గుర్తింపుతో భవిష్యత్తులో జరిగే అన్ని ఎన్నికల్లోనూ టీవీకే ఇదే గుర్తుపై పోటీ చేసే అవకాశం లభించింది. తమిళనాడులో ఇప్పటికే గుర్తింపు పొందిన డీఎంకే, ఏఐఏడీఎంకే, సీపీఐ, వీసీకే, నామ్ తమిళర్ కట్చి, డీఎండీకే వంటి పార్టీల సరసన ఇప్పుడు టీవీకే కూడా చేరింది.

## లడఖ్‌కు త్వరలోనే ప్రత్యేక హోదా..


మొదటిపేజీ తరువాయి..

ప్రత్యేక ఇంటర్వ్యూలో లడఖ్ చీఫ్ సెక్రటరీ ఆశిష్ కుంద్రా మాట్లాడుతూ.. లడఖ్‌కు తగిన రాజ్యాంగ పరిరక్షణలు కల్పించేందుకు పార్లమెంట్ ఆర్టికల్ 371ని సవరిస్తుందని తెలిపారు.లడఖ్‌కు రాజ్యాంగ పరిరక్షణలు కల్పించడం, ఎన్నికైన మండలిని ఏర్పాటు చేసే ప్రక్రియను కేంద్ర హోం శాఖ ఇప్పటికే ప్రారంభించిందని ఆయన చెప్పారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371 నిర్దిష్ట రాష్ట్రాల ప్రత్యేక ప్రాంతీయ, సామాజిక అవసరాలను తీర్చడానికి తాత్కాలిక, పరివర్తన, ప్రత్యేక అధికారాలను అందిస్తుంది. "మేము ఒక ప్రత్యేకమైన పాలనా నమూనాపై పనిచేస్తున్నాం... ఇది 'సూయీ జెనెరిస్' మోడల్. లడఖ్‌లో ఎన్నికైన పాలక మండలి ఉంటుంది, కానీ ఇది శాసనసభ ఉన్న కేంద్రపాలిత ప్రాంతంగానీ లేదా రాష్ట్రంగానీ కాదు" అని కుంద్రా వివరించారు. 'సూయీ జెనెరిస్' అనేది ఒక ప్రత్యేక పరిస్థితిని నిర్వహించడానికి రూపొందించిన ఒక ప్రత్యేకమైన చట్టపరమైన వ్యవస్థ. ఈ లాటిన్ పదానికి 'తనదైన శైలి' లేదా 'ప్రత్యేకమైనది' అని అర్థం. లడఖ్ నాయకులతో చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వ బృందంలో ఆశిష్ కుంద్రా భాగస్వామిగా ఉన్నారు. మంగళవారం ఢిల్లీలో ఇరు వర్గాల మధ్య చర్చలు జరిగాయి. ఆర్టికల్ 370 రద్దుచేసిన కేంద్రం జమ్మూ కశ్మీర్, లడఖ్‌గా విభజించి ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రారంభంలో లడఖ్‌లోని ఒక వర్గం కేంద్ర నిర్ణయాన్ని స్వాగతించినప్పటికీ, కాలక్రమేణా అధికారుల పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు చేపట్టారు. వారు రాష్ట్ర హోదాతో పాటు రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కింద ప్రత్యేక హోదా కావాలని డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఆరో షెడ్యూల్ ప్రకారం భూమి, అడవులు, నీరు, వ్యవసాయంపై చట్టాలు చేసే అధికారంతో స్థానిక కౌన్సిళ్లను ఏర్పాటు చేయవచ్చు. ఇది ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో స్థానిక సమాజాలకు ప్రత్యక్ష భాగస్వామ్యాన్ని అందిస్తుంది. గతేడాది లేహ్‌లో భద్రతా బలగాలు, పౌరుల మధ్య జరిగిన ఘర్షణల్లో నలుగురు మరణించగా, పలువురు గాయపడ్డారు. ఈ హింస తర్వాత సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ సహా పదుల సంఖ్యలో ప్రజలను పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మెజారిటీ ప్రజలపై కేసులను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. చార్జ్‌షీట్ దాఖలైన కేసులపై లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ త్వరలోనే నిర్ణయం తీసుకుంటారని కుంద్రా తెలిపారు.

## ట్రంప్ డివిడెండ్

మొదటిపేజీ తరువాయి..

సాధిస్తే.. దేశంలోని ప్రతి వయోజన అమెరికా పౌరుడికి 5,000 డాలర్లు (సుమారు రూ.4.2 లక్షలు) ఇస్తామని డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ సంక్షేమాన్ని ఆయన "ట్రంప్ డివిడెండ్ గా పేర్కొన్నారు. టెక్సాస్‌లోని డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ పార్టీ మధ్యంతర ఎన్నికల సభలో డొనాల్డ్ ట్రంప్ ఈ ప్రతిపాదన చేశారు. డెమోక్రాట్‌లతో పోటీలో రిపబ్లికన్ పార్టీ ఓటింగ్ సర్వేల్లో వెనుకబడి ఉన్న నేపథ్యంలో, ఓటర్లను ఆకర్షించేందుకు ట్రంప్ ఈ అసాధారణ హామీ ఇచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సభలో ట్రంప్ మాట్లాడుతూ.. "అమెరికా అద్భుతమైన ఆర్థిక విజయం కారణంగా ఈ హామీ నేను మాత్రమే చేయగలను. నవంబర్ 3న జరగబోయే ఎన్నికల్లో రిపబ్లికన్లు గెలిస్తే, మీరు మాతో కలిసి గెలుస్తారు. మీకు 5,000 డాలర్లు లభిస్తాయి. నవంబర్ బ్యాలెట్‌లో నేను స్వయంగా పోటీలో ఉన్నట్లే భావించి ఓటు వేయండి" అని మద్దతుదారులను కోరారు.ట్రంప్ డెవిడెండ్ హామీ అమలుపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం అమెరికాలో దాదాపు 27 కోట్ల మంది వయోజనులు ఉన్నారు. ప్రతి ఒక్కరికీ 5,000 డాలర్ల చొప్పున పంపిణీ చేయాలంటే ప్రభుత్వానికి సుమారు



1.35 ట్రిలియన్ డాలర్లు ఖర్చవుతుందని విశ్లేషకులు తెలిపారు. అయితే, ఈ భారీ మొత్తం నిధులు ఎక్కడి నుంచి వస్తాయనే దానిపై ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు. "మన దేశం చాలా డబ్బు సంపాదిస్తోంది" అని మాత్రమే ట్రంప్ చెప్పారు. ఈ చెల్లింపుల ప్రక్రియ ఎలా పనిచేస్తుంది, అసలు ఇలా డబ్బులు పంచడం చట్టబద్ధమేనా అనే అంశాలపై ఇంకా స్పష్టత లేదు.మధ్యంతర ఎన్నికల్లో గెలవడం కోసం ట్రంప్ బహిరంగంగా ఓటర్లకు లంచం ఇస్తున్నారని విమర్శకులు, సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తున్నాయి. "రిపబ్లికన్లకు ఓటు వేస్తే వ5,000 ఇస్తాననడం డివిడెండ్ ఎంతమాత్రం కాదు.. అది పక్కా లంచం" అని ఎక్స్ వేదికగా నెటిజన్లు ఆరోపించారు. ప్రముఖ అమెరికన్ స్టాక్ బ్రోకర్ పీటర్ షిఫ్ స్పందిస్తూ.. "ఓటర్లను ఆకట్టుకోవడానికి ట్రంప్ ఈ రకమైన ప్రతిపాదన చేశారు. ఈ ఉచిత డబ్బు కోసం ఫెడరల్ రిజర్వ్ భారీగా కరెన్సీ నోట్లను ముద్రించాల్సి వస్తుంది. ఫలితంగా బైడెన్ హయాంలో చూసిన దానికంటే అతి తీవ్రమైన ద్రవ్యోల్బణం వచ్చే ప్రమాదం ఉంది" అని హెచ్చరించారు. ఓట్ల కోసం ట్రంప్ చేసిన ఈ 1 ట్రిలియన్ డాలర్ల వాగ్దానం ఇప్పుడు అమెరికా వ్యాప్తంగా తీవ్ర రాజకీయ, ఆర్థిక చర్చకు దారితీసింది.

## మట్టి గణపతులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

**జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు**





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, (ప్రజాజ్యోతి) :** మట్టి గణపతులు పూజించి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బి.వెంకటేశ్వర్లు అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులకు, సిబ్బందికి అదనపు కలెక్టర్ ఉచిత మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో మంచి మార్పు మన నుంచే ప్రారంభం కావాలని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు,



కృత్రిమ రంగుల వల్ల పర్యావరణానికి ఎంతో హాని కలుగుతుందని, ప్రతి ఒక్కరూ మట్టితో చేసిన విగ్రహాలనే పూజించాలని అన్నారు. పండుగలన్ని సాంప్రదాయ పద్ధతుల్లో పర్యావరణ హితంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం





**నిర్మల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10, (ప్రజాజ్యోతి) :** కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముందుగా అదనపు కలెక్టర్, అధికారులతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఐలమ్మ పోరాటాలను గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఐలమ్మ పాత్రను వివరించారు. నాటి కాలంలోనే దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసి తెలంగాణ పోరాటాల చరిత్రలో ఒక గొప్ప అధ్యాయాన్ని లిఖించిందని తెలిపారు. వెట్టి చాకిరి నిర్మూలనకు పాటుపడిన గొప్ప మహిళ అని వివరించారు. చాకలి ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తితో మనమంతా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. చాకలి ఐలమ్మ లాంటి వీర వనితల చరిత్రను నేటి తరం ప్రజలు తెలుసుకోవాలన్నారు.

ఈ వర్ధంతి కార్యక్రమంలో ఈడీ ఎస్సీ కార్పొరేషన్ శంకర్, సిపిఓ గంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్‌యూఐ నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా జంగం శశిధర్ నియామకం



**బాసర సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి) :** ఎన్ఎస్‌యూఐ నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా జంగం శశిధర్ నియమితులయ్యారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు యదవల్లి వెంకట స్వామి, జాతీయ లీగల్ సెల్ కన్వీనర్ ఎం.డి. అక్బర్, అరవింద్ కుమార్ యాదవ్ తదితర రాష్ట్ర కార్యవర్గ సభ్యుల సమక్షంలో జంగం శశిధర్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా జంగం శశిధర్‌ను నాయకులు ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నిర్మల్ జిల్లాలో ఎన్ఎస్‌యూఐని మరింత బలోపేతం చేసి, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జంగం శశిధర్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర మరియు జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ, జిల్లాలోని విద్యార్థుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని జంగం శశిధర్‌కు అభినందనలు తెలిపారు.

## ఉమ్రి గ్రామంలో ఘనంగా పొలాల అమావాస్య వేడుకలు



**అదిలాబాద్ టౌన్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి) :** ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని ఉమ్రి గ్రామంలో పొలాల అమావాస్య పండుగను గురువారం రైతులు, గ్రామస్తులు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శ్రావణ మాస ముగింపును సూచించే ఈ పండుగ, తమకు ఏడాది పొడవునా వ్యవసాయ పనుల్లో తోడుగా నిలిచే కాడెద్దుల పట్ల కృతజ్ఞతను చాటుకునే అద్భుతమైన సంప్రదాయం. పండుగ రోజున, రైతన్నలు ఉదయాన్నే ఎడ్లను వాగులు, చెరువుల వద్దకు తోసుకెళ్లి శుభ్రంగా స్నానం చేయించారు. అనంతరం, వాటికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కొమ్ములకు రంగులు వేసి, పూలమాలలు, జూళ్లు, రంగుల ముక్కుతాళ్లతో అందంగా ముస్తాబు చేశారు. అలంకరించిన ఎడ్లను డప్పు చప్పుళ్లు, మంగళవాయిద్యాలతో గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లి, ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, బసవన్నలకు నైవేద్యంగా పూర్ణం బూరెలను సమర్పించి, కుటుంబ సభ్యులతో కలిసి పండుగ భోజనాలను ఆస్వాదించారు. ఈ వేడుకలతో ఉమ్రి గ్రామం పండుగ వాతావరణంతో కన్నులపండువగా మారింది.

## NSUI రాష్ట్ర కార్యదర్శిగా బాసర వాసి సూద్దోళ్ల గంగప్రసాద్

**డీసీసీ ఉపాధ్యక్షులు మామ్మయి రమేష్ ఆధ్వర్యంలో ఘన సన్మానం**

**బాసర సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి) :** విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాడే బాసర గ్రామానికి చెందిన యువ నాయకుడు సూద్దోళ్ల గంగప్రసాద్‌కు రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు దక్కాయి. ప్రతిష్టాత్మక విద్యార్థి సంఘం అయిన చీూఖ× (నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా) ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా (స్టేట్ సెక్రటరీ) నియమించింది. ఈ సందర్భంగా డీసీసీ (ఐజజ) ఉపాధ్యక్షులు శ్రీ మామ్మయి రమేష్ ఆధ్వర్యంలో గంగప్రసాద్‌ను శాలువాతో సత్కరించి, ఘనంగా సన్మానించడం జరిగింది. ఒక సాధారణ కార్యకర్తగా, మండల స్థాయి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన గంగప్రసాద్.. విద్యార్థుల సమస్యలపై ఎల్లప్పుడూ గళం విప్పుతూ, రాజీలేని పోరాటాలు చేస్తూ అంచెలంచెలుగా ఎదిగారు. అతి చిన్న వయసులోనే రాష్ట్ర స్థాయి నాయకుడిగా గుర్తింపు పొందడం ఆయన నాయకత్వ





లక్షణాలకు, అంకితభావానికి నిదర్శనం.

**మామ్మయి రమేష్ :** సన్మాన అనంతరం గంగప్రసాద్ మాట్లాడుతూ.. తాను ఒక సాధారణ కార్యకర్త స్థాయి నుంచి ఈ రోజు రాష్ట్ర స్థాయికి ఎదగడంలో నిరంతరం వెన్నంటి ఉండి, తనను ఎంతగానో ప్రోత్సహించిన డీసీసీ ఉపాధ్యక్షులు శ్రీ మామ్మయి రమేష్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయన మార్గదర్శకత్వంలో, అడుగుజాడల్లో నడుస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో మరింత విశేషంగా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల హక్కుల సాధనలో ముందుండే గంగప్రసాద్‌కు ఈ ప్రతిష్టాత్మక పదవి దక్కడం మరియు ఆయనను ఘనంగా సన్మానించడం పట్ల బాసర గ్రామస్తులు, కాంగ్రెస్ శ్రేణులు, తోటి విద్యార్థి సంఘాల నాయకులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అగ్రిమెంట్లు చూసి బిత్తరపోయి ఏఐటీయూసీపై విమర్శలా..?

**- కార్మికుల కోసం సాధించిన అగ్రిమెంట్లను అమలు చేయించే బాధ్యత కూడా ఏఐటీయూసీదే**

**- ఇతర యూనియన్లకు ఏఐటీయూసీ సూటి ప్రశ్న**

**- మేము సాధించిన అగ్రిమెంట్లు ఇవి.. మీరు సాధించినవి ఏమిటో కార్మికుల ముందు చెపాలి**



**మంచిర్యాల, 10,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతూ, యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి సాధించిన అగ్రిమెంట్లను చూసి ఇతర యూనియన్లు బిత్తరపోయి ఏఐటీయూసీపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య అన్నారు. కార్మికుల సమస్యలపై పోరాడి అగ్రిమెంట్లు సాధించకుండా, ఇతరులు పోరాడి సాధించిన అగ్రిమెంట్లపై విమర్శలు చేయడం ద్వారా కార్మికులను తప్పుదోవ పట్టించలేరని స్పష్టం చేశారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్‌పీ-1 గనిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో నాయకులు మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ జూన్ 8న సమ్మె నోటీసు ఇచ్చి, కార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వాటి పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు నిర్వహించిందన్నారు. అనంతరం ఆర్ఎల్‌సీ సమక్షంలో యాజమాన్యంతో పలుమార్లు చర్చలు జరిపి కార్మికుల డిమాండ్లపై స్పష్టమైన వైఖరితో ముందుకు వెళ్లామని తెలిపారు. ఏఐటీయూసీ నిరంతర ఒత్తిడి, పోరాటాలు, చర్చల ఫలితంగానే పలు కీలక అంశాలపై యాజమాన్యంతో అగ్రిమెంట్లు సాధించామన్నారు. కార్మికులకు ఏం కావాలో తెలుసుకుని, వారి సమస్యలను అగ్రిమెంట్ల రూపంలో పరిష్కరించే దిశగా తీసుకెళ్లడం ఏఐటీయూసీ విధానమని అన్నారు. కార్మికుల ప్రయోజనాల కోసం సాధించిన అగ్రిమెంట్లలో పెర్క్స్‌పై విధించే ఇన్‌కమ్ ట్యాక్స్‌ను యాజమాన్యం భరించడం, సర్వీసులో సహజ మరణం పొందిన కార్మికుడి కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థిక సహాయం, ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహణ, 2025--26 వాస్తవ లాభాలను దసరాలోపు చెల్లించేందుకు అంగీకారం, ట్రాన్స్‌ఫర్ నిబంధనల్లో మార్పులు, అర్హులైన సీనియర్ మైనింగ్ స్టాఫ్‌కు ప్రమోషన్లు, డిపెండెంట్ ఉద్యోగాల పెండింగ్ కేసుల పరిష్కారం, 149 మంది మెడికల్ ఫిట్ డిపెండెంట్లకు ఆఫీస్ ఆర్డర్లు, ఖాళీ పోస్టుల భర్తీ, క్యాడర్ స్కీమ్, కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ, కార్మికులకు సేఫ్టీ మెటీరియల్, డిస్మిస్ కార్మికుల సమస్య, మారుపేర్ల సమస్య తదితర 24 అంశాలపై అగ్రిమెంట్లు ఉన్నాయని వివరించారు. ఇవి కేవలం మాటల్లో చెప్పుకున్న హామీలు కాదని, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీ పోరాడి, యాజమాన్యంతో చర్చల ద్వారా సాధించిన ఫలితాలని స్పష్టం చేశారు. "మేము అగ్రిమెంట్లు చేశాం.. వాటిని అమలు చేయించే బాధ్యత కూడా మాదే" అని పేర్కొన్నారు. ఏఐటీయూసీ సాధించిన ప్రతి అగ్రిమెంట్ కేవలం కాగితాలకే పరిమితం కాకుండా సింగరేణి కార్మికుడి జీవితంలో వాస్తవ ప్రయోజనంగా మారే వరకు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి అమలు చేయించే బాధ్యతను కూడా ఏఐటీయూసీ తీసుకుంటుందని తెలిపారు. సింగరేణి కార్మికుల దీర్ఘకాలిక డిమాండ్ అయిన సొంత ఇంటి పథకం విషయంలో కూడా ఏఐటీయూసీ ప్రత్యేకంగా చర్చలు జరిపి యాజమాన్యం నుంచి సానుకూల స్పందన సాధించిందన్నారు. వివిధ ప్రభుత్వ రంగ సంస్థల్లో అమలవుతున్న సొంత ఇంటి పథకాలను పరిశీలించి, అదే తరహాలో సింగరేణి కార్మికులకు ప్రయోజనం చేకూరే విధంగా పథకాన్ని అమలు చేసే దిశగా చర్యలు తీసుకోవడానికి యాజమాన్యం అంగీకరించిందని, ఈ అంశాన్ని అగ్రిమెంట్ రూపంలో చేశామని తెలిపారు. సొంత ఇంటి పథకం కేవలం చర్చలకే పరిమితం కాకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పథకం అమలయ్యే వరకు ఏఐటీయూసీ నిరంతరం పర్యవేక్షిస్తూ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కార్మికుల సమస్యలు కేవలం వేతనాలు, అలవెన్సులకు మాత్రమే పరిమితం కావని, వారి ఆరోగ్యం, కుటుంబాల భవిష్యత్తు, పిల్లల విద్య, ఉద్యోగ భద్రత, డిపెండెంట్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, సంక్షేమం వంటి ప్రతి అంశంపై ఏఐటీయూసీ పోరాడుతోందన్నారు. హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ అటెండెన్స్ నిబంధనల్లో మార్పులు, సీబీఎస్ఈ సిలబస్ అమలు, డిస్మిస్ కార్మికుల పెండింగ్ కేసుల పరిష్కారం, ఈవెనింగ్ కాలేజీలకు ఎన్‌ఓసీలు వంటి అంశాల్లో కూడా సాధించిన పురోగతిని కార్మికులు గమనిస్తున్నారని తెలిపారు. ఇతర యూనియన్లకు సూటి సవాల్... ఏఐటీయూసీ సాధించిన అగ్రిమెంట్లపై విమర్శలు చేస్తున్న ఇతర యూనియన్లకు నాయకులు సూటిగా సవాల్ విసిరారు. "కార్మికుల కోసం మీరు ఏ సమస్యపై పోరాడారు? ఎన్ని అగ్రిమెంట్లు సాధించారు? ఎన్ని డిమాండ్లను యాజమాన్యం ముందు పెట్టి పరిష్కరించారు? కార్మికులకు మీరు సాధించి ఇచ్చిన ఫలితాల జాబితా ఏమిటి?" అని ప్రశ్నించారు. "మేము చేసిన అగ్రిమెంట్లతో వస్తాం.. మీరు చేసిన అగ్రిమెంట్లు తీసుకొని రండి" అని సవాల్ చేశారు. విమర్శలు, ఆరోపణలు, వక్రీకరణలు కాకుండా ఎవరు కార్మికుల కోసం ఎంత పనిచేశారో అగ్రిమెంట్లు, ప్రభుత్వ ఉత్తర్వులు, అధికారిక పత్రాలు, పరిష్కరించిన సమస్యల ఆధారంగా కార్మికులు నిర్ణయించాలని సూచించారు. సింగరేణి కార్మికుల హక్కులు, ఉద్యోగ భద్రత, సంక్షేమం, వైద్య సదుపాయాలు, డిపెండెంట్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, కొత్త గనులు, ఉపాధి అవకాశాల కోసం ఏఐటీయూసీ పోరాటం నిరంతరం కొనసాగుతుందని నాయకులు తెలిపారు. సింగరేణి సంస్థ అభివృద్ధితో పాటు కార్మికుల హక్కులు, సంక్షేమం, భద్రత కూడా సమానంగా ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు. "మాటలు చెప్పడం కాదు.. అగ్రిమెంట్లు సాధించడం ముఖ్యం. అగ్రిమెంట్లు చేయడం మాత్రమే కాదు.. వాటిని అమలు చేయించడం కూడా మా బాధ్యత. కార్మికుల ప్రయోజనాల విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు. మా పనితీరుకు విమర్శలు కాదు.. కార్మికులకు అందే ఫలితాలే సాక్ష్యం" అని నాయకులు స్పష్టం చేశారు. ఈ గేట్ మీటింగ్‌లో ఫిట్ సెక్రటరీ దాడి రాజయ్య, వైస్ ప్రెసిడెంట్ అనంతరెడ్డి, నాయకులు ఓదెలు, దహిత ప్రసాద్, అఖిల్ భరత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో బీసీల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలి

**- బీసీ కుల సంఘాలు సమిష్టిగా ముందుకు రావాలి:**

**- బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్**



**మంచిర్యాల, 10, సెప్టెంబర్ (ప్రజా జ్యోతి) :** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో బీసీల హక్కుల సాధనకు అన్ని బీసీ కుల సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు నరెడ్ల శ్రీనివాస్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు సంగం లక్ష్మణ్ పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా బీసీ సమాజ్ మంచిర్యాల జిల్లా కమిటీ, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాల ఐబీ మున్సిపల్ కార్యాలయ రోడ్డు చౌరస్తా వద్ద సంయుక్తంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరెడ్ల శ్రీనివాస్, సంగం లక్ష్మణ్ మాట్లాడుతూ తెలంగాణలో అణగారిన వర్గాల ఆత్మగౌరవం, హక్కులు, సామాజిక న్యాయం కోసం చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడారని గుర్తుచేశారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. సామాజిక అన్యాయం, దోపిడీ, పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె చూపిన తెగువ, ఆత్మగౌరవం, పోరాట పటిమను నేటి బీసీ సమాజం స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. బీసీల హక్కుల సాధన కోసం అన్ని బీసీ కుల సంఘాలు ఐక్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి బీసీ కుల సంఘం తన పరిధిలో ప్రజలను చైతన్యపరచడంతో పాటు బీసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులు, డిమాండ్లపై సమిష్టిగా ఉద్యమించాల్సిన బాధ్యత ఉందన్నారు. బీసీ సమాజ్, వివిధ బీసీ కుల సంఘాలు, బీసీ హక్కుల కోసం పనిచేస్తున్న సంస్థలు పరస్పర సమన్వయంతో కలిసి పనిచేస్తే ఉద్యమానికి మరింత బలం చేకూరుతుందని పేర్కొన్నారు. కుల సంఘాల మధ్య ఐక్యత, ఉద్యమాల మధ్య సమన్వయం, హక్కుల సాధన కోసం నిరంతర పోరాటం అవసరమని తెలిపారు. బీసీ హక్కుల కోసం జరుగుతున్న ఉద్యమం ప్రస్తుత తరానికే పరిమితం కాకుండా భావితరాలకు మెరుగైన భవిష్యత్తును అందించే ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం బీసీ సమాజం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ వంటి మహనీయుల జయంతులు, వర్ధంతులను కేవలం స్మరణ కార్యక్రమాలుగా కాకుండా వారి ఆశయాలను ఆచరణలో పెట్టే చైతన్య కార్యక్రమాలుగా నిర్వహించాల్సిన అవసరం ఉందని నరెడ్ల శ్రీనివాస్, సంగం లక్ష్మణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ జిల్లా కార్యదర్శి బియ్యాల సత్తయ్య, బీసీ సమాజ్ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుతోట పద్మాదేవి, మంచిర్యాల పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఇనవంక నాగలక్ష్మి, బీసీ సమాజ్ నాయకులు ఎండి హుస్సేన్, ఎండి లతీఫ్, తాటిపాముల సమ్మయ్య, ఎనగందుల వెంకటేష్, పల్లపు శ్రీనివాస్, ముదిపల్లి రమేష్, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి నాయకులు సంగెపు ఎల్లయ్య, పసుపునూటి కుమార్, కంచర్ల కొమురయ్య, ఒరుగంటి ఎల్లయ్య, గంగిపెల్లి ఎల్లయ్య, తాడూరి శంకర్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## మున్నూరు కాపులు ఐక్యంగా రాజ్యాధికారం దిశగా సాగాలి

**మంచిర్యాల, 10, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** హైదరాబాద్‌లోని కోకాపేటలో గురువారం మున్నూరు కాపు సంఘం 6వ రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం రావు పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ముఖ్య నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిర్యాల పట్టణానికి చెందిన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తోట శ్రీనివాస్ పటేల్ కోకాపేటలో నిర్మిస్తున్న మున్నూరు కాపు సంఘ భవనానికి రూ.5 లక్షల విరాళాన్ని ప్రకటించి,



అందులో భాగంగా ప్రస్తుతం రూ.1 లక్ష చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా తోట శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ మున్నూరు కాపులంతా ఐక్యంగా ఉండి రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సంఘం అభివృద్ధికి, కోకాపేటలో నిర్మిస్తున్న మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమకు తోచిన మేరకు ఆర్థిక సహకారం అందించాలని కోరారు. సమాజ అభివృద్ధి కోసం సంఘటితంగా పనిచేస్తే మరింత బలోపేతం అవుతుదని తెలిపారు.

## వాంకిడిలో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన



**నేరడిగొండ, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)లో భాగంగా నేరడిగొండ మండలంలోని వాంకిడి గ్రామంలో గురువారం హియరింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాలో నమోదైన వివరాలను అధికారులు పరిశీలించి, అభ్యంతరాలు, సవరణలకు సంబంధించిన అంశాలను నమోదు చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటర్ల జాబితాలో సక్రమంగా నమోదయ్యేలా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వాంకిడి సర్పంచ్ జ్యోతి, నారాయణపూర్ సర్పంచ్ లక్ష్మీ, బంధంరెగడి సర్పంచ్ జీవన్, బీఎల్ఓ సూపర్‌వైజర్ శంకర్, గ్రామ పరిపాలన అధికారి సయ్యద్ షకీల్, జూనియర్ అసిస్టెంట్ ఆడెపు రాజారాం, స్రవంతి, రియాజ్, బీఎల్ఓ భోజన్న, జంగు బాపు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## తిర్యాణిలో ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి



**తిర్యాణి సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి :** మండల కేంద్రంలో కొమరం భీం భవనం వద్ద గురువారం వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక సంఘ మండల అధ్యక్షుడు బూసి సంతోష్ మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఆమె ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. రజక కులాన్ని ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని, ప్రతి మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు దురిశెట్టి సతీష్, నల్లూరి రాజు, నల్లూరి సాగర్, జగదీష్, బూసి రవి తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ

**- చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో బీసీల హక్కుల కోసం ఉద్యమించాలి**

**- బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వనం సత్యనారాయణ**



**మంచిర్యాల, 10,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం మంచిర్యాలలోని సీపీఐ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ అనుబంధ బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు వనం సత్యనారాయణ మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అన్యాయాలకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ ధైర్యంగా పోరాడి తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఉద్యమించిన గొప్ప యోధురాలని అన్నారు. మహిళగా, బీసీ వర్గానికి చెందిన వ్యక్తిగా అనేక అణచివేతలను ఎదుర్కొంటూనే ఆమె చూపిన ధైర్యం, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల సామాజిక, ఆర్థిక, రాజకీయ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, కులగణన ఆధారంగా బీసీలకు న్యాయమైన వాటా కల్పించాలని కోరారు. చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో సామాజిక న్యాయం కోసం నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌల్, మద్దెల శంకర్, మున్సిపల్ కౌన్సిలర్, బీసీ నాయకులు ఆంటోని దినేష్, వెల్ది ప్రభాకర్, దంతుల కొండయ్య, దొంతల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

**అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె పోరాటం చిరస్మరణీయం**



**ఆసిఫాబాద్, సెప్టెంబరు 10 ప్రజా జ్యోతి :** అణగారిన వర్గాల హక్కులు, సామాజిక సమానత్వం, బలహీన వర్గాల సంక్షేమం కోసం వీరనారి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ అనిల్ మర్మాట్, మార్కెట్ కమిటీ చైర్మన్ మంగలతతో కలిసి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ భూమి హక్కులు, సామాజిక న్యాయం, సమానత్వం, ఆత్మగౌరవం కోసం చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆమె పోరాట పటిమ, ధైర్యం నేటి తరానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి నదీం మజీద్, బీసీ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపై పోరాటంలో మరో విజయం

- బీసీ పొలిటికల్ జేఏసీ ఫిర్యాదుతో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్
- అవినీతి అధికారులపై నిరంతరం పోరాడతాం
- బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు

వనపర్తి, సెప్టెంబరు 10 (ప్రజాజ్యోతి): అవినీతికి పాల్పడే అధికారులపై నిరంతరం పోరాటం చేస్తామని బీసీ పొలిటికల్ జేఏసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మహేందర్ నాయుడు అన్నారు. బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో చేసిన ఫిర్యాదులపై అధికారులు స్పందించి ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేయడం తమ పోరాటానికి మరో విజయమని పేర్కొన్నారు. గురువారం వనపర్తి జిల్లా



కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వనపర్తి బీసీ వసతి గృహం వార్డెన్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ ఉద్యోగికి సంబంధించిన అవినీతి ఆరోపణలను సాక్ష్యాధారాలతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. ప్రజలు చెల్లించే పన్నులతో వేతనాలు పొందుతూ అక్రమాలకు పాల్పడే అధికారులపై తమ పోరాటం కొనసాగుతుందని మహేందర్ నాయుడు అన్నారు. గతంలోనూ పలువురు అవినీతి అధికారులపై చర్యలు తీసుకునేలా పోరాటం చేసినట్లు పేర్కొన్నారు. నిజాయితీగా పనిచేసే అధికారులకు జేఏసీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఫిర్యాదులపై స్పందించి విచారణ జరిపి చర్యలు తీసుకున్న జిల్లా ఉన్నతాధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వీవీ గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ గౌడ్, శ్రీరంగాపూర్ మండల అధ్యక్షుడు ధర్మేంద్ర సాగర్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీల్లోనే పాము కాటుకు చికిత్స

- ఏఎస్‌వీ నిల్వలు అందుబాటులో ఉంచాలి
- గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి మెరుగైన వైద్యం అందించాలి: కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి ప్రతినిధి, సెప్టెంబరు 10 (ప్రజాజ్యోతి): పాము కాటు బాధితులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే తక్షణ వైద్యం అందించేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యాధికారులను ఆదేశించారు. అవసరమైన మందులతో పాటు యాంటీ స్నేక్





వెనం (ఏఎస్‌వీ) ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. గురువారం వనపర్తి మండలం కడుకుంట్ల పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాము కాటు కేసులు వచ్చినప్పుడు అనుసరిస్తున్న వైద్య విధానం, ఏఎస్‌వీ నిల్వలు, వినియోగంపై వివరాలు తెలుసుకున్నారు. ఎలాంటి జాప్యం లేకుండా ప్రాథమిక చికిత్స అందించి, అవసరమైతే ఉన్నతస్థాయి వైద్యం కోసం తరలించేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు.

పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని కలెక్టర్ సమీక్షించారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులను గుర్తించి అవసరమైన పరీక్షలు నిర్వహించడంతో పాటు మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. వైద్యుల సూచన మేరకు మందులు, పోషకాహారంపై అవగాహన కల్పించాలని, గర్భిణుల ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

కడుకుంట్ల జడ్పీ ఉన్నత పాఠశాలను కూడా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ ఏడాది పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఫిజిక్స్, గణితం, ఇంగ్లిష్‌లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక మెటీరియల్‌తో బోధించాలని సూచించారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులకు పాఠ్యాంశాలు పూర్తిస్థాయిలో అర్థమయ్యేలా బోధించాలని తెలిపారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు విద్యార్థుల క్రీడల కోసం మైదానాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్, వైద్యాధికారి డాక్టర్ రాకేష్‌రెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రైతులను పట్టించుకోని చేతగాని ప్రభుత్వం గద్దె దిగాలి

కరెంటు కోతలపై సబ్ స్టేషన్ ను ముట్టడించిన బిజెపి నేతలు, రైతులు

## రెండు గంటల పాటు జాతీయ రహదారిపై రాస్తారోకో

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి): కరెంటు కోతలతో ఎండిపోతున్న పంటలను కాపాడండి రైతులు మొరపెట్టుకుంటున్న వివరణ ఇచ్చేవరకు ఇక్కడి నుండి కదలమంటూ ధర్నా చేపట్టారు. గంటలు గడిచినా కూడా విద్యుత్ అధికారులు స్పందించకపోవడంతో 167 జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇస్తానన్న 24 గంటల కరెంటు ఏమైందని రైతులకు నాణ్యమైన కరెంటు ఇవ్వడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. చేస్తున్నామని, ఇకపై రైతులకు ఎలాంటి విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో బిజెపి కిసాన్ మోర్చా నాయకులు కార్యకర్తలు రైతులు రాస్తారోకోను విరమించారు.





పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని జిల్లా కిషన్ మోర్చా అధ్యక్షుడు వెంకట రాములు అన్నారు. గురువారం రాష్ట్ర భారతీయ జనతా పార్టీ పిలుపుమేరకు నారాయణపేట జిల్లా మక్తల్ మండలం జక్లేర్ గ్రామంలో కరెంటు సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకటరాములు ఆధ్వర్యంలో రైతులు,బిజెపి కిషన్ మోర్చా నాయకుల కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి జక్లేర్ 33 /11 కేవీ సబ్ స్టేషన్ ను ముట్టడించారు. అనంతరం కరెంటు కోతలపై విద్యుత్ ఎస్సీ వచ్చి దీంతో జాతీయ రహదారిపై ఇరువైపుల భారీ వాహనాలను నిలిచిపోయాయి. ఈ సందర్భంగా బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు వెంకట రాములు,బిజెపి నేతలు మాట్లాడుతూ ఈ సంవత్సరం సరైన వర్షాలు లేక పత్తి, కంది పంటలతో పాటు వరి పంటలు కూడా ఎండిపోతున్న తరుణంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా కరెంటు కోతల వల్ల బోరు నీటిని పంట పొలాలకు పెట్టుకోలేని దుస్థితి ఏర్పడిందని, దీంతో ఎక్కడికక్కడే పంటలు ఎండిపో తున్నాయని ఎండిపోతున్న పంటలను కాపాడలేని ఇప్పటికే కరువు జిల్లాగా పేరుగాంచిన నారాయణ పేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని, రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పంట నష్టం చెల్లించాలని, పది రోజుల్లో లో వోల్టేజ్ కరెంటు కోతల తగ్గించి రైతులకు నాణ్యమైన కరెంటు అందించకపోతే బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని వారు డిమాండ్ చేశారు. ధర్నా స్థలానికి చేరుకున్న జిల్లా విద్యుత్ అధికారి ఎస్సీ విజయ్ కుమార్ లో వోల్టే సమస్యను పరిష్కరించేందుకు అన్ని విధాల కృషి ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ నాయకుడు బంగ్లా లక్ష్మి కాంత్ రెడ్డి,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నాయకులు బలరాం రెడ్డి,కర్నె స్వామి, జిల్లా కిషన్ మోర్చా ప్రధాన కార్యదర్శి దొబ్బలి హనుమంతు,కృష్ణ మండల అధ్యక్షుడు నల్ల నరసప్ప,కిషన్ మోర్చ అధ్యక్షుడు నర్సింహారెడ్డి,మాగనురు మండల అధ్యక్షుడు ప్రతాపరెడ్డి,అధ్యక్షుడు అనంద్ శేఖర్,నర్వ మండల్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి,వావిలాల నరేందర్ రెడ్డి,బీజేవైఎం అధ్యక్షులు భరత్ కుమార్ పాల్గొన్నారు.

## భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఆమె పోరాటం స్ఫూర్తిదాయకం:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

★ ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించడమే నిజమైన నివాళి

గద్వాల సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి ప్రతినిధి): భూమి కోసం,భుక్తి కోసం భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ స్ఫూర్తిని కొనసాగించడమే ఆమెకు అందించే నిజమైన నివాళి అని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్‌లో బీసీ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆమె



చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు,రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,1940వ దశకంలో తెలంగాణలో జరిగిన సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ ధైర్యసాహసాలు ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. భూస్వామ్య ,దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఐలమ్మ వంటి కొద్దిమంది మహిళలు సైతం ధైర్యంగా పాల్గొన్నారని తెలిపారు.ప్రజలను సమీకరించి పోరాటానికి నాయకత్వం వహించిన ఆమె సాహసం,తెగువ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు.ఐలమ్మ జీవిత చరిత్ర, ఆమె పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఆమె జయంతి,వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తోందని కలెక్టర్ తెలిపారు.తెలంగాణ సమాజానికి ఆమె చేసిన సేవలకు గుర్తుగా హైదరాబాద్‌లోని కోఠి ఉమెన్స్ కాలేజీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు.అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ, సామాజిక న్యాయం,ఆత్మగౌరవం,హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం నేటి తరానికి ఆదర్శమన్నారు.ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు ఘనమైన నివాళి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి,బీసీ అభివృద్ధి శాఖ అధికారి అక్బర్ పాషా,బీసీ,రజక సంఘాల నాయకులు,పలువురు జిల్లా అధికారులు,కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యలో వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

గద్వాల సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి ప్రతినిధి): విద్యార్థులు విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, ప్రణాళికాబద్ధంగా చదివి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.గురువారం కేటీ దొడ్డి మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కూడా వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు అత్యధిక సంఖ్యలో విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించేలా కృషి చేయాలని అన్నారు.త్వరలో నిర్వహించనున్న ఎస్ఏ-1 పరీక్షల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థుల దినచర్య, విద్యాలయంలో కల్పించిన మౌలిక వసతులపై కలెక్టర్ ఆరా తీశారు.విద్యార్థులకు





పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి చదువు,అభ్యసన సామర్థ్యాలను తెలుసుకున్నారు.విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని,గత ప్రశ్నపత్రాలను పునఃపరిశీలించేలా చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.ఖాన్ అకాడమీ ఆన్‌లైన్ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా బోధన చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు.గతేడాది ఫలితాలను పరిశీలించిన కలెక్టర్,ఈసారి అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి,ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన,పోషక విలువలతో కూడిన భోజనం అందించాలని ఆదేశించారు. వంటశాల,స్టోర్ గదులను పరిశీలించి పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.కేజీబీవీకి సంబంధించిన హాజరు,ఇతర రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్ సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ పర్యటనలో తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీవో రమణారెడ్డి,కేజీబీవీ ప్రత్యేక అధికారి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

## లాడ్జిపై టాస్కోర్స్,మక్తల్ పోలీసులు మెరుపు దాడి

-పోలీసుల అదుపులో ఏడుగురు మహిళలు, ముగ్గురు పురుషులు

మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి): నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలోని ఎస్ వి ఎన్ డీలక్స్ లాడ్జిలో మక్తల్ ఎస్ ఐ రాజు యాదవ్ ఆధ్వర్యంలో టాస్కోర్స్, మక్తల్ పోలీసులు అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించారు. లాడ్జి అసాంఘిక కార్యకలాపాలకు





కేంద్రంగా ఉపయోగించబడుతోందన్న సమాచారం మేరకు తనిఖీ చేసిన పోలీసులు వ్యభిచారం జరుగుతుందని గుర్తించారు. ఈ ఘటనలో ఏడు మంది మహిళలు ముగ్గురు పురుషులతోపాటు లాడ్జి ఓనర్ ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ ఐ రాజు యాదవ్ తెలిపారు. పట్టుబడిన వారి నుండి 10 మొబైల్ ఫోన్లు,రూ.7,800 నగదు,2 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై మక్తల్ ఎస్సై రాజు కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతోపాటు అదుపులోకి తీసుకున్న వారికి అవసరమైన కౌన్సెలింగ్ కూడా నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు, ముఖ్యంగా వ్యభిచారం, మాదకద్రవ్యాలు మరియు ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని అధికారులు తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాల్లో అనుమానాస్పద లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

## ఇందిరమ్మ పథకం.. పేదల సొంతింటి కల సాకారం..

మాగనూరు,సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ప్రభుత్వం అందించిన గృహ నిర్మాణ ప్రయోజనంతో మాగనూరు మండల కేంద్రానికి చెందిన బ్యాగరి చిన్న అంజప్ప తన సొంతింటి కలను సాకారం చేసుకున్నారు. ప్రభుత్వం అందించిన పథకం అందతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకున్న ఆయన నూతన గృహంలోకి ప్రవేశించారు.

కాంగ్రెస్ మాగనూరు మండల అధ్యక్షుడు శివరాం రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో లబ్ధిదారుడిని అభినందించారు. పేద కుటుంబాలకు సొంతింటి భరోసా కల్పించడంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కీలకంగా నిలుస్తోందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్, సీనియర్ నాయకులు ముష్టి లక్ష్మయ్య, వాకిటి శ్రీనివాసులు, ఉజ్జలి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు కోతలపై రైతుల ధర్నా

- 12 గంటల హామీ.. ఆరు గంటలూ సక్రమంగా సరఫరా లేదని ఆగ్రహం
- పంటలు ఎండిపోతున్నాయంటూ కడుకుంట్లలో రైతుల ఆందోళన

వనపర్తి, సెప్టెంబరు 10 (ప్రజాజ్యోతి): వ్యవసాయానికి 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా.. కనీసం ఆరు గంటలు కూడా సక్రమంగా, నాణ్యమైన విద్యుత్ అందడం లేదని ఆరోపిస్తూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వనపర్తి మండలం కడుకుంట్ల గ్రామం పెద్దగూడెం రైతులు ఆందోళనకు దిగారు. కడుకుంట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట కడుకుంట్ల–వనపర్తి ప్రధాన రహదారిపై గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ విద్యుత్ కోతలతో బోర్లు, మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదని, ఫలితంగా



పంటలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేసి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. గతంలో విద్యుత్ అందుబాటు తక్కువగా ఉన్న సమయంలోనూ అప్పటి ప్రభుత్వం రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేసిందని గుర్తుచేశారు. ప్రస్తుతం విద్యుత్ అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు ఇబ్బందులు ఎందుకు కలుగుతున్నాయని ప్రశ్నించారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న అధికారులు అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఎల్‌నినో ప్రభావంతో విద్యుత్ డిమాండ్ పెరగడం వల్ల సరిపడా సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎలక్ట్రికల్ డీఈ శ్రీనివాసులు రైతులకు వివరించినట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఈ శ్రీనివాసులు రైతులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. ధర్నాలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కేమాణిక్యం, రఘువర్ధన్‌రెడ్డి, మాధవరెడ్డి, ధర్మనాయక్, డేగ మహేశ్వర్‌రెడ్డి, చిట్యాల రాము, లక్ష్మీకాంత్‌రెడ్డి, సర్పంచ్ తిరుపతయ్య, మాజీ సర్పంచులు హరిత బాలకృష్ణ, కొండయ్య, కృష్ణనాయక్, మనీష్, గ్రామ అధ్యక్షుడు వెంకటేష్, అశోక్ తదితర నాయకులు, రైతులు పాల్గొన్నారు.



# చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం..

**- అన్యాయంపై తిరుగుబాటు.. ఐలమ్మ పోరాటం..**



**పరకాల సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి :** చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా బీజేపీ పరకాల పట్టణ శాఖ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో గురువారం అమరధామంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో చాకలి ఐలమ్మ పోరాటం ఒక చారి త్రాత్మక అధ్యాయమని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యసాహసాలు, త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.

అన్యాయాన్ని ఎదిరించి అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన ఐలమ్మ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆమె త్యాగాలను జయంతి, వర్ధంతి కార్యక్రమాలకే పరిమితం చేయకుండా సమానత్వం, సామాజిక న్యాయం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పరకాల పట్టణ కౌన్సిలర్లు కుక్కల విజయ్ కుమార్, ఆకుల లావణ్య శ్రీధర్, జిల్లా కోశాధికారి ఎర్రం రామన్న, పట్టణ ఉపాధ్యక్షులు మిడిదొడ్డి నరేష్, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి తిరుపతి, కిసాన్ మోర్చా రాష్ట్ర లీగల్ సెల్ నాయకురాలు వేముల సదా రాణి ఆంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి ఉడుత చిరంజీవి, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు దుబాసి కృష్ణ ప్రసాద్, బాసాని సోమరాజు, సోషల్ మీడియా కన్వీనర్ మెంతుల సురేష్, కార్యకర్తలు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# రాయపర్తి పోలీస్ స్టేషన్‌ను అకస్మికంగా సందర్శించిన వర్ధన్నపేట నూతన సీఐ సంజీవరావు







**రాయపర్తి సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట కు ఇటీవల బదిలీపై వచ్చిన నూతన సిఐ.సంజీవ రావు రాయపర్తి పోలీస్ స్టేషను గురువారం ఆకస్మికంగా సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు, ఇచ్చినారు, మరియు డీజే సౌండ్ ఓనర్ల్కు కౌన్సిల్ లింగ్ ఇచ్చి స్థానిక తాసిల్దార్ ముందు బౌండోవర్ చేయడం జరిగింది, వినాయక చవితి నవరాత్రోత్సవాలకు ముందస్తుగా చెరువులు, కుంటలు, మైలారం రిజర్వాయర్‌ను విజిటింగ్ చేయడం జరిగింది, ఈ కార్యాక్రమలో రాయపర్తి ఎస్ఐ ముత్యం రాజేందర్, పొన్నం భాస్కర్, హెడ్ కాన్స్టేబుల్, సంపత్, అనిల్ కుమార్, నవ్య, సునీత, గణపతి రెడ్డి పీసీలు పాలుగోన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించాలి

**- ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**







**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ములుగు మండలం బండారుపల్లిలోని బాలుర తెలంగాణ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలోని తరగతి గదులు,వంటగది,భోజనశాల, వసతి గృహం,పరిసరాలను పరిశీలించారు.విద్యార్థుల హాజరు,బోధన,భోజన పట్టిక, సరుకుల నిల్వలకు సంబంధించిన నమోదు లను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..విద్యార్థుల ఆరోగ్యం,విద్య, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని,వంటశాల,భోజన శాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన మౌలిక వసతులను అందుబాటులో ఉంచాలని తెలిపారు.అనంతరం తరగతి గదులను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో కాసేపు మాట్లాడారు.పాఠ్యాంశాల బోధన, భోజనం,వసతి గృహ సౌకర్యాలు, త్రాగునీరు,మరుగు దొడ్లనిర్వహణ తదితర వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని క్రమశిక్షణతో చదివిఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను ఉపాధ్యాయులు నిరంతరం పరిశీలిస్తూ,చదువులో వెనుక బడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.సిద్ధార్థ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# భావితరాలకు పోరాట స్ఫూర్తి చాకలి ఐలమ్మ..





**- కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి..**

**హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి :** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకొని న్యూ శాయంపేట జంక్షన్‌లోని ఐలమ్మ విగ్రహానికి గుండు సుధారాణి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయి, డాక్టర్ సత్య శారదతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ..

చాకలి ఐలమ్మ కేవలం ఒక వర్గం కోసం కాకుండా రైతులు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం ధైర్యంగా పోరాడిన వీరవనితగా చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ అన్యాయానికి వ్యతిరేకంగా ఆమె సాగించిన పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు. మహిళా సాధికారత, ఆత్మగౌరవం, సామాజిక న్యాయానికి ఐలమ్మ పోరాటం ప్రతీకగా నిలిచిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారత, సామాజిక న్యాయం, సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి వారిని కోటీశ్వరులుగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. పోరాట యోధుల త్యాగాలు, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాశ్, అదనపు కలెక్టర్లు ఎన్. రవి, వై.వి. గణేష్, ఎల్. కిషోర్ కుమార్, వరంగల్ ఆర్డీవో సుమ, కుడా సీపీఓ అజిత్‌రెడ్డి, హనుమకొండ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పుష్పలత, లక్ష్మణ్, మత్స్యశాఖ అధికారి శ్రీపతి, డాక్టర్ మధుచందర్, మాజీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, మాజీ కార్పొరేటర్ చీకటి ఆనంద్, వివిధ శాఖల అధికారులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలు

**- చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**- మహిళలు తమ హక్కుల కోసం నిర్భయంగా ముందుకు రావాలి : చిట్యాల శ్వేత**



**జనగామ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 10 ( ప్రజాజ్యోతి) :** చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలు, చాకలి ఐలమ్మ మనుమరాలు చిట్యాల శ్వేత హాజరై, చాకలి ఐలమ్మ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన గావించి, పూలమాలలు సమర్పించి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చెరగని ముద్ర వేసిన గొప్ప మహిళా యోధురాలని అన్నారు. సామాజిక అన్యాయం, జమీందారీ వ్యవస్థ, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడి అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు. 1895లో జన్మించిన చాకలి ఐలమ్మ నిరుపేద కుటుంబంలో పుట్టి ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొంటూ, ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాటం చేశారని తెలిపారు. విస్నూర్ దేశ్‌ముఖ్ దోపిడీకి వ్యతిరేకంగా ఆమె చేసిన సాహసోపేతమైన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం, రైతాంగ ఉద్యమాల్లో ఆమె పోషించిన పాత్ర మహిళల ధైర్యసాహసాలకు నిదర్శనమని కొనియాడారు. సమాజంలో అసమానతలను తొలగించేందుకు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో తెలంగాణ మహిళా కమిషన్ సభ్యురాలు, చాకలి ఐలమ్మ మనుమరాలు చిట్యాల శ్వేత మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ఆత్మగౌరవానికి రాష్ట్ర ప్రభుత్వం విశేష గుర్తింపు ఇవ్వడం సంతోషకరమన్నారు. తనను మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమించిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. చాకలి ఐలమ్మ పోరాట చరిత్రను నేటి తరం తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆమె పేరు భారతదేశంలోనే కాకుండా విదేశాల్లోనూ గౌరవంగా నిలిచిందని, రష్యా, జపాన్, చైనా, సోవియట్ దేశాల్లో కూడా ఆమె పేరుతో గ్రంథాలయాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రతి ఆడపిల్ల చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకుని అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సమస్యలను బయటకు చెప్పినప్పుడే న్యాయం జరుగుతుందని, మహిళలు తమ హక్కుల కోసం నిర్భయంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్హాలోమ్, జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి, ఆర్టీఏ సభ్యులు చిలువేరు అభి గౌడ్, జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులులి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహరావు, తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షులు మైలారం వెంకటేశ్వరులు, అధ్యక్షులు కొలిపాక నరసింహులు, తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు ఎదునూరి మదార్, ఏఎంసీ ఛైర్మన్ శివరాజ్ యాదవ్, సీనియర్ పాత్రికేయులు కన్నా పరశురాములు, దిశ మెంబర్ జనగామ బక్క శ్రీనివాస్, బీసీ కుల సంఘాల నాయకులు, సభ్యులు, ఐడీఓసీ సిబ్బంది, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకుడితో పర్యావరణ పరిరక్షణ






**హసన్‌పర్తి,సెప్టెంబరు10(ప్రజాజ్యోతి) :** మట్టి వినాయక విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని సుజాత విద్యానికేతన్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆకుతోట శాంతారాం కర్ణ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాల ఆవశ్యకతను వివరిస్తూ వెయ్యి కరపత్రాల ఆవిష్కరణ, పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా శాంతారాం కర్ణ మాట్లాడుతూ.. వినాయక చవితి వేడుకలను ప్రకృతి సహజంగా లభించే ఆకులు, మొక్కలు, వనమూలికలతో నిర్వహించాలని సూచించారు. రసాయనాలతో తయారు చేసిన ప్లాస్టర్ విగ్రహాలను చెరువుల్లో నిమజ్జనం చేయడం వల్ల నీరు కలుషితమై చేపలు, క్రిమికీటకాలు, పశుపక్ష్యాదులకు హాని కలుగుతోందన్నారు.గత 30 ఏళ్లుగా పాఠశాల పర్యావరణ మిత్ర విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఏడాది విద్యార్థులతో సుమారు 1,500 మట్టి వినాయక విగ్రహాలను తయారు చేయించి ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఆరుసార్లు పర్యావరణ మిత్ర పురస్కారాలు లభించాయని తెలిపారు.విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు భూమి దినోత్సవం, వనమహోత్సవం, కాలుష్యరహిత దీపావళి, హోలీ, ప్రపంచ పర్యావరణ దినోత్సవం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ కాలుష్యం వల్ల మానవులతో పాటు భూమిపై ఉన్న సమస్త జీవరాశులకు ముప్పు ఏర్పడుతోందన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో మట్టి వినాయక విగ్రహాల ఆవశ్యకతను వివరిస్తూ వెయ్యి కరపత్రాలను పంపిణీ చేశారు. పాఠశాల ఉప ప్రధానోపాధ్యాయుడు గూడూరు లక్ష్మీనారాయణతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# మట్టి వినాయకుడితో పర్యావరణ పరిరక్షణ

**కిట్స్ వరంగల్‌తో సెంట్రల్ ఇండియా అవగాహన ఒప్పందం**



**హసన్‌పర్తి, సెప్టెంబరు 10 (ప్రజాజ్యోతి) :** విద్యార్థుల్లో కృత్రిమ మేధస్సు సాంకేతికతపై అవగాహన, ఆవిష్కరణ, అనుభవపూర్వక అభ్యాసం, నైపుణ్యా భివృద్ధిని పెంపొందించేం దుకు కిట్స్ వరంగల్, హైదరాబాద్‌కు చెందిన సెంట్రల్ ఇండియా సంస్థ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ మేరకు బుధవారం కిట్స్ వరంగల్ సమావేశ మందిరంలో ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నారు.కిట్స్ అదనపు కార్యదర్శి, హుస్నాబాద్ మాజీ శాసనసభ్యుడు వి.సతీష్‌కుమార్ మాట్లా డుతూ.. విద్యార్థులకు భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలను అందించడం, పరిశ్రమలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించడం, ఆవిష్కరణలు, వ్యాపార సృజనాత్మకతను ప్రోత్సహించడం ఒప్పందం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. కృత్రిమ మేధస్సు ఆధారిత విద్యా విధానం, సమగ్ర విద్యార్థి అభివృద్ధి కార్యక్రమాలను సంయుక్తంగా రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. కిట్స్ వరంగల్ చైర్మన్, మాజీ రాజ్యసభ సభ్యుడు కెప్టెన్ వి. లక్ష్మీకాంతరావు, కోశాధికారి పి.నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్‌రెడ్డి తదితరులు కంప్యూటర్ శాస్త్ర విభాగం అధ్యాపకులను అభినందించారు.

సెంట్రల్ ఇండియా సంస్థ సహ వ్యవస్థాపకుడు జి. సాయి కృష్ణ మాట్లాడుతూ.. ఆచరణాత్మక అభ్యాసం, మార్గదర్శకత్వం, పరిశ్రమ ఆధారిత అనుభవాల ద్వారా విద్యార్థులకు అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలపై అవగాహన కల్పించడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. విద్యార్థుల్లో వినూత్న ఆలోచనలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యాపార సృజనాత్మకతను పెంపొందించేందుకు భారతీయ సాంకేతిక విద్యాసంస్థ, భారతీయ నిర్వహణ విద్యాసంస్థల పూర్వ విద్యార్థులైన గుగులోత్తు వంశీ, గుగులోత్తు సాయి కలిసి ఈ సంస్థను స్థాపించినట్లు తెలిపారు. అక్టోబరులో త్రినగర కృత్రిమ మేధస్సు సవాలు కిట్స్ వరంగల్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. ఒప్పందంలో భాగంగా అక్టోబరు 10, 11 తేదీల్లో వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలకు చెందిన వెయ్యి మందికి పైగా విద్యార్థులతో రెండు రోజుల త్రినగర కృత్రిమ మేధస్సు సాంకేతిక పోటీ నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు కృత్రిమ మేధస్సు, సృజనాత్మక కృత్రిమ మేధస్సు, స్వయంచాలక కృత్రిమ మేధస్సు వంటి ఆధునిక సాంకేతికతలను అన్వేషిస్తూ వాస్తవ సమస్యలకు పరిష్కారాలు రూపొందించే అవకాశం ఉంటుందన్నారు. పరిశ్రమ నిపుణులు, మార్గదర్శకులతో విద్యార్థులు నేరుగా సంభాషిం చడంతోపాటు తమ నమూనాలు, వినూత్న ఆలోచనలను ప్రదర్శించే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. పరిశ్రమలు--విద్యాసంస్థల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేసి, కృత్రిమ మేధస్సు ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి, విద్యార్థుల్లో వ్యాపార సృజనాత్మకతకు వేదికగా ఈ కార్యక్రమాన్నితీర్చిదిద్దనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కిట్స్ వరంగల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్‌రెడ్డి, కృత్రిమ మేధస్సు--యంత్ర అభ్యసన విభాగాధిపతి డాక్టర్ ఎ. జ్యోతి ప్రభ, ఇంటర్న్‌షిప్‌ల ఇన్‌చార్జి డాక్టర్ ఎం. వీరారెడ్డి, ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ డి.ప్రభాకరాచారి, డాక్టర్ జి.సునీల్‌కుమార్, అధ్యాపకులు డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ బి.హనుమంతు, డాక్టర్ ఎం.రాజేష్‌తోపాటు వివిధ విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# చాకలి ఐలమ్మ పోరాటం యువతకు స్ఫూర్తిదాయకం

**డా. బండి రజనీకుమార్**



**హసన్‌పర్తి, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):** పోరాటాల పురిటిగడ్డ వరంగల్‌లో జన్మించి, భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ ఆశయాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకమని పలువురు నాయకులు పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం హసన్‌పర్తి మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. విసునూరు రామచంద్రారెడ్డి దొరను ఎదిరించి ధైర్యంగా పోరాడి విజయం సాధించిన ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమన్నారు. తెలంగాణలో రజాకార్ల దురాగతాలను ఎదురించి నిలబడిన ఆమె ధైర్యసాహసాలు భావితరాలకు మార్గదర్శకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన పోరాటాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో హసన్‌పర్తి మండల భారత రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్, మాజీ జెడ్పీటీసీ కొత్తకొండ సుభాష్‌గౌడ్, మాజీ వైస్ ఎంపిపి బండ రత్నాకర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, నరేష్, రాజు, రాజేందర్, బిక్షపతి, కలువచెర్ల సుదర్శన్, సంపత్ తదితర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకం..

**టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను**



**పరకాల సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి :** తెలంగాణ సాయుధ పోరాట వీరనారి చాకలి ఐలమ్మ జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ మడికొండ శ్రీను అన్నారు. గురువారం పరకాల పట్టణంలోని అమరధామంలో స్థానిక రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ విముక్తి ఉద్యమంలో చాకలి ఐలమ్మ కీలక పాత్ర పోషించారని అన్నారు. భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. ఐలమ్మ వర్ధంతి వేడుకలకే పరిమితం కాకుండా, ఆమె ఆశయాల సాధనకు నేటి యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో రజక సంఘం నాయకులు నేరెళ్ల పరశురామ్, నడిగొట్టి శంకర్, మీడిదొడ్డి నరేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మంద నాగరాజు, నాయకులు అల్లం రఘునారాయణ, బొచ్చు రవి, మంద వెంకటేష్, బొజ్జం సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేట బస్ స్టేషన్ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్..

**– రైల్వే భూమి సమకూర్పు, భూమి మార్పిడిపై అధికారులతో చర్చ..**



**హనుమకొండ జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 10 ప్రజాజ్యోతి :** ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో కాజీపేటలో శాశ్వత ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదించిన రైల్వే స్థలాలను హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి గురువారం పరిశీలించారు. కాజీపేట రైల్వే స్టేషన్ ముందు ప్రస్తుతం సిటీ బస్సుల రాకపోకలు కొనసాగుతున్న ప్రాంతంతో పాటు రైల్వే పాఠశాల స్థలం, రైల్వే స్టేడియం ప్రాంతం, స్టేడియానికి ఎదురుగా ఉన్న సుమారు ఎకరం రైల్వే భూమిని అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే కాజీపేట ప్రధాన రహదారి పక్కన హైదరాబాద్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు నిలిచే ప్రస్తుత బస్టాండ్‌ను కూడా పరిశీలించారు. శాశ్వత బస్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూమిని రైల్వే శాఖ ద్వారా సమకూర్చుకోవడం, రైల్వే శాఖతో భూమి మార్పిడి ప్రక్రియను పూర్తి చేయడం తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ పరిశీలనలో ఆర్టీసీ ఆర్ఎం భవానీ ప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం కిషన్‌రావు, డీఎం ధరమ్‌సింగ్, కాజీపేట తహసీల్దార్ రాజు, రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ వర్క్స్ శ్రీనివాస్, కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ రవీందర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



# ఇండియా స్కిల్స్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

• 16 నుంచి 25 ఏళ్ల యువతకు అవకాశం • ఐటీఐ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు



**హుజూర్ నగర్ సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి)** కేంద్ర ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి మరియు పారిశ్రామిక శిక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇండియా స్కిల్స్ 2026--27 సాంకేతిక నైపుణ్య పోటీలకు అర్హులైన యువత నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హుజూర్‌నగర్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎన్. వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండియా స్కిల్స్ పోటీలను 63 రకాల నైపుణ్య విభాగాల్లో జిల్లా, రీజినల్, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. 16 నుంచి 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన యువత ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 15, 2026లోగా www.skillindi-adigital.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఐటీఐ, ఏటీఎస్, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు సంబంధిత నైపుణ్యాలు కలిగిన యువత కూడా పోటీల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ అందించడంతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందేందుకు మంచి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు కోరారు. మరిన్ని వివరాల కోసం 8247506920, 9160284139, 8499084414 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## ప్రతిష్టాత్మక కాళోజి నంది అవార్డు అందుకున్న అడ్వకేట్ యరగాని సోనీ

**హుజూర్ నగర్ సెప్టెంబర్ 10:(ప్రజా జ్యోతి)** కాళోజీ తెలంగాణ జూనియర్ లేడీ అడ్వకేట్ అసోసియేషన్ మరియు కాళోజి తెలంగాణ జేఏసీ సంయుక్త ఆధ్వర్యంలో ప్రదానం చేసే ప్రతిష్టాత్మక నంది అవార్డుకు నాంపల్లి క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ యరగాని సోనీ ఎంపికయ్యారు. ప్రజాకవి కాళోజీ నారాయణరావు






జయంతి సందర్భంగా ప్రతి ఏటా రాష్ట్రవ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో ప్రాక్టీస్ చేస్తున్న జూనియర్ న్యాయవాదుల ప్రతిభను,వృత్తి పట్ల వారి అంకితభావాన్ని గుర్తించి జిల్లాకు ఒకరిని ఎంపిక చేసి ఈ పురస్కారాన్ని అందజేస్తారు. ఇందులో భాగంగా ఈ ఏడాది నాంపల్లి క్రిమినల్ కోర్టులో జూనియర్ న్యాయవాదిగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన హుజూర్ నగర్ పట్టణానికి చెందిన యరగాని సోనీ ని కమిటీ ఏకగ్రీవంగా ఎంపిక చేసి హనుమకొండలో జరిగిన కార్యక్రమంలో అవార్డును ప్రధానం చేశారు. యరగాని సోనీ ఈ పురస్కారానికి ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు యరగాని సత్యనారాయణ గౌడ్, ఉమా ,కుటుంబ సభ్యులు, పలువురు సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. న్యాయవాద వృత్తిలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ కుమార్ , యరగాని శ్రీనివాస్, బెల్లంకొండ రమేష్ , తుమ్మ వెంకటేశ్వర్లు ,భరద్వాజ్, పరాషర్, వట్టికూటి వెంకటేశ్వర్లు, వట్టికూటి గురవయ్య , మధు, శ్యాంప్రసాద్ , నవీన్ ,హరీష్, ప్రశాంత్,శ్రీజ, శాన్వి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## తరాలు మారిన చెరిగిపోని చరిత్ర చాకలి ఐలమ్మ

• వెంపటిలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు



**తుంగతుర్తి, సెప్టెంబర్ 10,(ప్రజా జ్యోతి):** భూస్వాముల దోపిడికి వ్యతిరేకంగా పోరాడిన అసమాన్య ధైర్యవంతురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని గ్రామ సర్పంచ్ తప్పట్ల ఎల్లయ్య అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని వెంపటి గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ధైర్యసహసాలను కొనియాడారు. ఐలమ్మ పోరాట పటిమ, ఆమే తెగువ యావత్ మహిళా లోకానికి ఆదర్శమని అన్నారు. ఆమె భూమి కోసం, దొరల పెత్తనాన్ని ధిక్కరించి, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత అని అన్నారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడు ఐతరాజు అంజయ్య, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, దాయం ఝాన్సీ రాజిరెడ్డి, అబ్బగాని సత్యనారాయణ గౌడ్, తప్పట్ల శంకర్, భాష బోయిన వెంకన్న, మడిపెద్ది సోమ నరసయ్య, రజక సంఘం నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మకు ఘన నివాళి



**గరిడేపల్లి సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి) :** గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రజక సంఘం అధ్యక్షుడు పాల్లేలి అంజయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామ ప్రథమ పౌరుడు బొల్లెపల్లి రామనాధం పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ పోషించిన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. అనంతరం రజక సంఘం సభ్యులు,గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐలమ్మకు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రజక సంఘం సభ్యులు, గ్రామ ప్రజలకు సంఘం నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## సేంద్రియ సాగు వైపు అడుగులేయాలి




**గరిడేపల్లి, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):** రైతులు రసాయన ఎరువులు, వ్ర ు ర ు గ ు మ ు ం ద ు ల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ సాగు వైపు అడుగులు వేయాలని చైతన్య విశ్వవిద్యాలయ వ్యవసాయ విద్యార్థులు సూచించారు. మండల రైతులకు సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థులు గీతాంజలి, వెన్నెల, అభివర్ష, శరణ్య, షిజాజబీన్, లహరి అవగాహన కల్పించారు. కంపోస్ట్, పశువుల పేడ, వర్మీకంపోస్ట్, జీవ ఎరువుల వినియోగంతో నేల సారాన్ని కాపాడుకోవచ్చన్నారు. పంట మార్పిడి, పచ్చిరొట్ట ఎరువులు, సహజ పద్ధతుల్లో చీడపీడల నియంత్రణపై వివరించారు. సేంద్రియ సాగుతో నాణ్యమైన దిగుబడులతో పాటు నేల ఆరోగ్యం, పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

• కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్నే అవమానించడమే
• ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తారనే భయంతోనే సస్పెన్షన్: తాటికొండ సీతయ్య



**తుంగతుర్తి, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):** గత మూడు రోజులుగా జరుగుతున్న శాసనసభ సమావేశాల్లో ప్రజా సమస్యలను చర్చించకుండా ప్రజాధనాన్ని వృథా చేస్తున్న ప్రభుత్వం.. అకారణంగా బీఆర్ఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ...కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయడం అంటే తెలంగాణ ఆత్మగౌరవాన్నే అవమానించడమేనని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేసి శాసనసభ సమావేశాలకు అనుమతించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉంటే ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీస్తారనే భయంతోనే వారిని సభకు దూరంగా ఉంచే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు, నిషేధిత జాబితా 22-ఏలో అక్రమంగా చేర్చిన భూముల వంటి అంశాలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తారనే కారణంతోనే సస్పెన్షన్ వేటు వేశారని విమర్శించారు. కేసీఆర్ చావు కోరుకుంటున్నామని బహిరంగంగా ప్రకటించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ప్రభుత్వం, శాసనసభ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సీతయ్య డిమాండ్ చేశారు. ఆయన సభ్యత్వం పై అనర్హత వేటు వేయాలని కోరారు. ఎర్రవల్లి కేసీఆర్ ఫామ్ హౌస్ వద్దకు అక్రమంగా చొచ్చు కెళ్లిన కాంగ్రెస్ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసిన వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. పోలీసులు పక్షపాత వైఖరిని వీడి అందరికీ సమానంగా చట్టాన్ని అమలు చేయాలని కోరారు. అధికార పార్టీకి ఒక చట్టం, ప్రతిపక్షానికి మరో చట్టం ఉ ండకూడదని సీతయ్య అన్నారు. బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అనుచితంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై కూడా తగిన విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేసీఆర్ చేసిన పోరాటాన్ని ప్రజలు మరువరని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కోరుకునే పరిస్థితి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములు గౌడ్, పట్టణ అధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్, మండల నాయకులు గుడిపాటి వీరయ్య, గోపగాని వెంకన్న, తాళ్లపల్లి యాకయ్య, మల్లెపాక రాములు, గడ్డం సోమేశ్, పాలడుగు జలంధర్, బొజ్జ సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిఎన్ తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి జన్మదిన వేడుకలు





**భువనగిరి,సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి)** భువనగిరి మండలం బిఎన్ తిమ్మాపురం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి జన్మదిన సందర్భంగా వారి అభిమా నులు బి,ఎన్ తిమ్మాపురం గ్రామస్తులు యువకులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా రాయగిరిలోని సహృ దయ అనాధా శ్రమంలో కేక్ కట్ చేసిన అనంతరం వృద్ధులకు అన్నదానం మరియు పండ్లు పంపిణీ చేశారు ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మా బి ఎన్ తిమ్మాపూర్ సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి గారు ప్రజల కొరకు నిరంతరం ప్రజాసేవలో తరిస్తూ ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పట్టు వదలని విక్రమా ర్కుడిలా ముందుకు సాగుతూ యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆశీర్వా దాల తో సమాజ ప్రగతి కోసం మీ సంకల్పం ఇలాగే కొనసాగాలని మును ముందు మీరు ఇంకా మరింత ఉన్నత పదవులు పొందాలని,బి ఎన్ తిమ్మాపురం పునరావాస నూతన గ్రామాన్ని సకలహంగులతో అభివృద్ధి చేసే శక్తిని మీకు ఆ భగవంతుడు ప్రసాదిం చాలని,నిండు నూరేళ్లు ఆయురా రోగ్యాలతో జీవించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ తహేరా బబ్లు,మోర రామ్ రెడ్డి, డొంకెన అశోక్ వల్లందాస్ పరమేష్ నకిరేకంటి సుధాకర్,ఎండి బాబా,డొంకెన మహేష్ పవన్ ముదిరాజ్,నకిరే కంటి రాము,కుచ్చుల మహేష్,రచ్చ మార్కం డేయ,జిన్న సత్య నారాయణ,తుమ్మల బిక్షపతి,రాసాల కరుణా కర్,అబ్బు ఏవిఆర్ అభిమానులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణ

• మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసన్నకుమారి



**గరిడేపల్లి సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):** మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని ప్రిన్సిపాల్ డా,జె.ప్రసన్నకుమారి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి పీఎం శ్రీ గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు విద్యార్థులు మట్టితో గణపతి విగ్రహాలను తయారు చేశారు. అనంతరం మట్టి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె. ప్రసన్నకుమారి మాట్లాడుతూ ఆది పూజలు అందుకునే గణపతిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకల శుభాలు కలుగుతాయని అన్నారు. విద్యార్థులకు సంకల్పసిద్ధి,మంచి బుద్ధి కలగాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాల తయారీని ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సతీష్‌కుమార్, శైలజ, వెంకటేశ్వర్లు, వీరభద్రం, విష్ణువర్ధన్, డా,కందుల శివకృష్ణ, డా,శ్రవణ్‌కుమార్, దామ్లా, శాంతిప్రియ, శేఖర్, భూలక్ష్మి, నవాబ్ ప్రమీల, పార్వతి తదితర ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ వెంకటరెడ్డిని పరామర్శించిన ఐజేయు అధ్యక్షుడు కృష్ణారెడ్డి



**నల్లగొండ, సెప్టెంబర్ 10,( ప్రజాజ్యోతి ప్రతినిధి ):** ఇటీవల రోడ్డు ప్రమాదంలో ప్రమాదవశాత్తు గాయపడ్డ నిడుమనూర్ ప్రజాజ్యోతి రిపోర్టర్ ఉమ్మడి వెంకట్ రెడ్డి ని గురువారం ఐ జె యు జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి పరామర్శించారు. ఆ ప్రమాదంలో ఎడమ చెయ్యి విరిగిపోయి నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శస్త్ర చికిత్స జరుపుకొని విశ్రాంతి తీసుకుంటున్నట్లు సమాచారం అందుకున్న కృష్ణారెడ్డి ఐజేయూ సెక్రెటరీ మహేందర్ రెడ్డి తో కలిసి ఆస్పత్రికి వెళ్లి వెంకట్ రెడ్డి పరామర్శించారు. గాయాల నుండి త్వరగా కోలుకుని, తిరిగి విధుల్లో చేరాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రజాజ్యోతి జిల్లా స్టాపర్ భూమిరెడ్డి నాగార్జున్ రెడ్డి ఉన్నారు.

## గణేష్ ఉత్సవాలలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

• ఎస్‌హెచ్ఓ జె జగన్



**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):** గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని పోచంపల్లి ఎస్‌హెచ్ఓ జె. జగన్ సూచించారు. గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వాహకులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవడంతోపాటు, ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా డీజేలు, లౌడ్‌స్పీకర్లను పోలీసుల సూచనలు, నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, బైక్ స్టంట్లు, రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సోషల్ మీడియాలో వదంతులు, విద్వేషపూరిత సమాచారాన్ని ప్రచారం చేయకుండా ప్రజలు, ఉత్సవ కమిటీలు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినాయక మండపాల నిర్వహకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామస్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు: సర్పంచి




**చింతపల్లి సెప్టెంబర్ 05(ప్రజాజ్యోతి)** చింతపల్లి మండలం గొడుకోండ్ల గ్రామంలో నేడు జరగబోయే బోనాల పండుగ సందర్భంగా గ్రామానికి వచ్చినటువంటి ఆడపడుచులకు,కుటుంబ సభ్యులకు మరియు బంధుమిత్రులకు,గ్రామస్తులకు సర్పంచి కేసగోని వెంకటయ్య గ్రామస్తులక బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతికి ప్రతీకగా బోనాల పండుగ అన్నారు. గ్రామ దేవతల ఆశీస్సులు ప్రతి ఒక్కరిమీద ఉండాలని ఆయన కోరారు.

## మధుయాష్కీ గౌడ్‌కి శుభాకాంక్షలు తెలిపిన సర్పంచి



**చింతపల్లి సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి)** తెలంగాణకు కాంగ్రెస్ సెంట్రల్ పార్టీ కమిటీలో మరో కిల పదవి దక్కింది. తెలంగాణకు చెందిన మధుయాష్కీకి చైర్ పర్సన్ గా కాంగ్రెస్ హైకమాండ్ నియమించింది. తెలంగాణ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏఐసిసిలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రాతినిధ్యం పెరుగుతుంది. తెలంగాణలోని నిజామాబాద్ లోకసబ్ నియోజకవర్గం నుండి రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడుగా ఎన్నికయ్యాడు. గతంలో ఆయన అధికార ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించారు. తాజాగా తెలంగాణలోని మధుయాష్కీ గౌడ్ కి ఏఐసిసి చైర్ పర్సన్ గా నియమిచిన సందర్భంగా చింతపల్లి మండలంలోని మోదుగులమల్లెపల్లి సర్పంచి ముద్దం మల్లేష్ గౌడ్ కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

● రవి మోహన్ బట్ పిలుపు



**ఇందల్వాయి (ప్రజా జ్యోతి) సెప్టెంబర్. 10** ఇందల్వాయి: మండల కేంద్రంలోని చంద్రాయన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సౌమ్య నాయక్ తండాలో అడవుల సంరక్షణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో అనంతరావు, సర్పంచ్ పురం అధ్యక్షులు సుదర్శన్ నాయక్‌తో పాటు అటవీ శాఖ అధికారులు, ఇతర అధికారులు



పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ ఆఫీసర్ రవి మోహన్ మాట్లాడుతూ అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అడవి భూములను అక్రమంగా దున్నడం, ఆక్రమణలకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. అడవుల్లో వన్యప్రాణులను వేటాడటం, వాటికి హాని కలిగించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. అడవుల సంరక్షణకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వన్యప్రాణులను వేటాడి చంపినట్లయితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి, చట్ట ప్రకారం జైలు శిక్షతో పాటు ఇతర చర్యలు తీసుకుంటామని తెలిపారు. అటవీ సంపదను, వన్యప్రాణులను కాపాడేందుకు ప్రజలు అటవీ శాఖకు సహకరించాలని ఆయన కోరారు. అడవుల పరిరక్షణతోనే పర్యావరణ సమతుల్యతను కాపాడగలమని పేర్కొన్నారు.

# మాజీ సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటాం

**ఇందల్వాయి: ప్రజా జ్యోతి) సెప్టెంబర్. 10** మండలంలోని చంద్రాయన్‌పల్లి మాజీ సర్పంచ్ అరటి బాలవ గత వారం రోజుల క్రితం మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు పరామర్శించారు. బాలవ కుటుంబ సభ్యులను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, బాలయ్య కుమారుడు, ప్రస్తుత సర్పంచ్ అరటి రఘుతో మాట్లాడారు. బాలవ సర్పంచ్‌గా పనిచేసిన సమయంలో గ్రామ అభివృద్ధి కోసం ఎంతో శ్రమించారని గుర్తు చేసుకున్నారు. గ్రామ ప్రజల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం సర్పంచ్ అరటి రఘును ఓదార్చి, కుటుంబానికి తాము అండగా ఉ



ంటామని భరోసా ఇచ్చారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా తమ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డైరెక్టర్‌తో పాటు సర్పంచ్ అరటి రఘు తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు

● ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి వెల్లడి

● కందకుర్తి, యంచ పుష్కర ఘాట్ల వద్ద అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ● పాల్గొన్న కలెక్టర్, ప్రజాప్రతినిధులు

**బోధన్ (ప్రజా జ్యోతి) సెప్టెంబర్ 10 :** గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపడుతున్నట్లు ప్రభుత్వ సలహాదారు పి.సుదర్శన్ రెడ్డి తెలిపారు. వచ్చే ఏడాది జూన్, జూలై మాసాలలో జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా పుణ్య స్నానాల కోసం జిల్లాలోని వివిధ పుష్కర క్షేత్రాలకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ల వద్ద సదుపాయాల కల్పన కోసం అవసరమైన అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. త్రివేణి సంగమ ప్రాంతం



అయిన రెంజల్ మండలం కందకుర్తి వద్ద, నవీపేట మండలం యంచ వద్ద గోదావరి పుష్కర ఘాట్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా శంకుస్థాపనలు చేశారు. కందకుర్తి వద్ద నీటిపారుదల శాఖ



ఆధ్వర్యంలో రూ. 6.05 కోట్ల అంచనా వ్యయంతో పుష్కర ఘాట్ నిర్మాణానికి, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.3.90 కోట్ల నిధులతో రోడ్ల నిర్మాణాలకు, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ. 5.00 కోట్లతో ఆలయ అభివృద్ధి పనులకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా యంచ వద్ద రూ. 2.15 కోట్ల నిధులతో పుష్కర ఘాట్, రూ. 70 లక్షలతో రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో అట్టహాసంగా నిర్వహించాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. ఒక్క కందకుర్తి పుష్కర క్షేత్రం వద్దనే అన్ని శాఖల పనులను కలుపుకుని సుమారు 30 కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నామని వివరించారు. భక్తుల రాకపోకలు, పార్కింగ్, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సేవలు, దుస్తులు మార్చుకునే గదులు తదితర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా, సురక్షితమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా, పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. పుష్కర ఘాట్ల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పుణ్య స్నానాల కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన అన్ని



చర్యలు చేపట్టాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకెళ్లాలని అన్నారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, తహసీల్దార్లు శ్రవణ్, వెంకట రమణ, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

# కొనసాగుతున్న డిజిటల్ క్రాప్ సర్వే

**నవీపేట్ (ప్రజా జ్యోతి):** మండలంలోని నాగేశ్వర్ గ్రామంలో గురువారం వ్యవసాయ అధికారులు పంట నమాజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పంట క్షేత్రాలను సందర్శించి నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారి దుంప విజయ్, గ్రామ సర్పంచ్ ఆర్మూర్ లావణ్య శ్రీనివాస్, బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హనుమాన్లు, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





# రేషన్ దుకాణాల తూకం యంత్రాలపై విస్తృత తనిఖీలు

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:** రేషన్ దుకాణాల్లో వినియోగించే తూకం యంత్రాలను ప్రతి సంవత్సరం తప్పనిసరిగా పరిశీలించాల్సి ఉంటుందని జహీరాబాద్ లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సాయన్న తెలిపారు. అందులో భాగంగానే నారాయణఖేడ్ డివిజన్‌కు వచ్చి రేషన్ దుకాణాల్లోని తూకం యంత్రాలను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తనిఖీల్లో భాగంగా పరిశీలించిన తూకం యంత్రాలను నిబంధనల ప్రకారం సీల్ చేసేందుకు వచ్చామని, అయితే కొన్ని యంత్రాలు సక్రమంగా పనిచేయడం లేదని గుర్తించినట్లు తెలిపారు. తూకం యంత్రాలు సరిగా పనిచేయకపోవడంతో డీలర్లు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. తూకం యంత్రాల మరమ్మతులు, నిర్వహణ కోసం కాంట్రాక్టు తీసుకున్న సంస్థ సక్రమంగా సేవలు అందించలేదని డీలర్లు తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. యంత్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా మరమ్మతులు పూర్తయిన అనంతరం మళ్లీ తనిఖీలు నిర్వహించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న వాటికి సీల్ వేస్తామని స్పష్టం చేశారు. రేషన్ సరుకుల పంపిణీలో తూనికలు,



కొలతల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. లబ్ధిదారులకు సరైన తూకంతో సరుకులు అందేలా చూడటమే తనిఖీల ప్రధాన ఉద్దేశమన్నారు. గతంలో ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ ఉండటంతో తనిఖీలు ఆశించిన స్థాయిలో జరగలేదని, ప్రస్తుతం రెగ్యులర్ పర్యవేక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నారాయణఖేడ్ డివిజన్ పరిధిలో రేషన్ దుకాణాలతో పాటు తూనికలు, కొలతలకు సంబంధించిన ఇతర దుకాణాలు, వ్యాపార సంస్థల్లోనూ విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామని వెల్లడించారు.

# డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

● తూకం యంత్రాల మరమ్మతులకు టెక్నీషియన్లను అందుబాటులో ఉంచాలి

● డీలర్ తహేర్ అలీ

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:** రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని డీలర్ తాహేర్ అలీ డిమాండ్ చేశారు. గురువారం నారాయణఖేడ్ సివిల్ సప్లై గోదాంలో తూకం యంత్రాలకు సీల్ వేసేందుకు వచ్చిన అధికారుల ఎదుట డీలర్లు తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా తాహేర్ అలీ మాట్లాడుతూ.. నారాయణఖేడ్ నియోజకవర్గంలో సుమారు 180 మంది రేషన్ డీలర్లు ఉన్నారని తెలిపారు. గత ఐదేళ్ల క్రితం డీలర్లకు తూకం యంత్రాలను అందించారని, అప్పటి నుంచి ఇప్పటివరకు చెడిపోయిన యంత్రాలను మరమ్మతు చేసేందుకు సంబంధిత టెక్నీషియన్లు అందుబాటులోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో డీలర్లే సొంత ఖర్చులతో ఒక్కో తూకం యంత్రానికి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వెచ్చించి మరమ్మతులు చేయించుకోవాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం తూకం యంత్రాలకు సీల్ వేస్తున్న నేపథ్యంలో భవిష్యత్తులో యంత్రాలు చెడిపోతే వాటిని ఎలా మరమ్మతు చేయించుకోవాలని ఆయన ప్రశ్నించారు. ఈ సమస్యను డీఎస్ఓ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. కాంట్రాక్ట్ తీసుకున్న సంస్థలు సమయానికి తూకం యంత్రాలను మరమ్మతు చేయకపోవడంతో డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అలాగే పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల కారణంగా తూకం యంత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డీలర్ల సమస్యల పరిష్కారానికి అవసరమైన చోట్ల టెక్నీషియన్లను అందుబాటులో ఉంచి, చెడిపోయిన తూకం యంత్రాలకు వెంటనే మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు.





# పౌష్టికాహారమే ఆరోగ్యానికి పునాది

● కన్సాన్‌పల్లిలో ఘనంగా పోషణ మాసం

● గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన

**అందోల్, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):** ఆరోగ్యకరమైన తరానికి పునాది బాల్యంలోనే పడుతుందని, పిల్లలు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించడంలో కుటుంబంతో పాటు సమాజం కూడా బాధ్యత తీసుకోవాలని జోగిపేట సీడీపీఓ మధులిక, కన్సాన్‌పల్లి సర్పంచ్ సునీత మహిపాల్ అన్నారు. రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా అందోల్ మండలం కన్సాన్‌పల్లి గ్రామంలో అంగన్‌వాడీ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మధులిక మాట్లాడుతూ "పోషకాహారం ప్రతి ఇంటి అలవాటుగా మారినప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమవుతుంది" అన్నారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల ఆహారం ఎంతో అవసరమన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారం, ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ సునీత మహిపాల్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కుటుంబం పిల్లల ఆరోగ్యం, పోషణపై బాధ్యతగా



వ్యవహరించాలన్నారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పప్పులు, చిరుధాన్యాలు, పండ్లను ఆహారంలో భాగం చేయాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు అందిస్తున్న అవగాహన కార్యక్రమాలతో తల్లుల్లో పోషకాహారంపై మరింత చైతన్యం తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు. సీనియర్ అసిస్టెంట్ సంగీత, అంగన్‌వాడీ టీచర్లు రామకళ, సాయమ్మ, రమాదేవి, ఆరోగ్య సిబ్బంది, పాఠశాల హెచ్‌ఎం నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తితో హక్కుల సాధనకు ఉద్యమించాలి

● సీఐటీయూ మండల కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్



**వట్టిపల్లి, సెప్టెంబర్10, (ప్రజాజ్యోతి):** వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో పేదలు, రైతులు, కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ వట్టిపల్లి మండల కార్యదర్శి ఎర్రోళ్ల మహేష్ పిలుపునిచ్చారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ.. భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. పేదల ఆత్మగౌరవం, హక్కుల కోసం ఆమె చూపిన తెగువ నేటి తరానికి ఆదర్శమన్నారు. ఆమె ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వట్టిపల్లి సర్పంచ్‌తో పాటు సీఐటీయూ నాయకులు జనార్ధన్, దాసు, భీమయ్య, గమ్య నాయక్, వెంకటేష్, లక్ష్మణ్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

### వినాయక మండపాలకు

# ముందస్తు అనుమతులు తప్పనిసరి

● ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

● నారాయణఖేడ్ ఎస్సై రాసుల శ్రీశైలం

**నారాయణఖేడ్, సెప్టెంబర్ 10, ప్రజాజ్యోతి:** వినాయక చవితి సందర్భంగా పట్టణం, గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాలకు నిర్వాహకులు ముందస్తుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని నారాయణఖేడ్



ఎస్సై రాసుల శ్రీశైలం సూచించారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ.. వినాయక మండపాల ఏర్పాటుకు తెలంగాణ పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఆన్‌లైన్ అనుమతి విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నారు. నిర్వాహకులు తెలంగాణ పోలీస్ అధికారిక పోర్టల్ ద్వారా మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, నిర్వాహకుల వివరాలు తదితర సమాచారాన్ని నమోదు చేసి అనుమతి కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

# అందోలు మండల వ్యాప్తంగా ఐలమ్మకు ఘన నివాళులు

వీరనారి పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తామన్న నాయకులు



**అందోలు, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని అందోలు మండల వ్యాప్తంగా గురువారం వివిధ కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. పలుచోట్ల ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆమె సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. పేదలు, రైతులు, మహిళల హక్కుల కోసం ఆమె చూపిన తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### శ్రీవారి సన్నిధిలో మాజీ సర్పంచ్
## స్వర్ణలత భాగ్యరాజ్ దంపతులు



తూప్రాన్ (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 10: గ్రామ ప్రజల ఆశీర్వాదంతో చందాయిపేట మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ టుంబసమేతంగా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కలియుగ ప్రత్యక్ష దైవమైన శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చందాయిపేట గ్రామ ప్రజలతో పాటు చేగుంట మండలంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో వర్ధిల్లాలని శ్రీవేంకటేశ్వర స్వామివారిని మనస్ఫూర్తిగా ప్రార్థించినట్లు తెలిపారు. ప్రజల శ్రేయస్సు, గ్రామాభివృద్ధి కోసం ఎల్లప్పుడూ తన వంతు కృషి చేస్తానని మాజీ సర్పంచ్ బుడ్డ స్వర్ణలత భాగ్యరాజ్ పేర్కొన్నారు.

### దోపిడీకి ఎదురొడ్డి నిలిచిన
## ధీరవనిత చాకలి ఐలమ్మ

- తలవంచని తెగువ.. వెనక్కి తగ్గని పోరాటం.. వీరనారి ఐలమ్మకు ఘన నివాళి






వెల్దుర్తి (ప్రజాజ్యోతి) సెప్టెంబర్ 10: తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలకు, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తిలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, అన్యాయానికి తలవంచకుండా పేదలు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ సాగించిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఆమె ధైర్యం, తెగువ, ఆత్మగౌరవం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య మాట్లాడుతూ, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యం, హక్కుల కోసం పోరాడే తత్వం ప్రతి ఒక్కరిలో ఉండాలని సూచించారు. చాకలి ఐలమ్మ జీవితం నుంచి నేటి యువత స్ఫూర్తి పొందాలని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, నరసింహారెడ్డి, అర్చన, అమూల్య, జయసుధ, సునీత, వాణిశ్రీ, విజయ మోహన్ రాజ్, ఖదీర్ పాషా, రేణుక, ప్రశాంతి, రాము, బోధనేతర సిబ్బంది యాదగిరి, మహేష్, రాజు, సీఆర్‌పీలు రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొని వీరనారి చాకలి ఐలమ్మకు ఘన నివాళులు అర్పించారు.

### రామాయంపేటలో
## ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి

మెదక్ (ప్రజాజ్యోతి) మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలో తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలను రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లక్ష్మీనారాజు, బీసీ నాయకులు, రజక సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం రామాయంపేట బస్‌స్టాండ్ సమీపంలో రజక సంఘం పట్టణ అధ్యక్షులు మద్వరి కిషన్ ఆధ్వర్యంలో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం సభ్యులు, నాయకులు, పలువురు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మెదక్ (ప్రజాజ్యోతి) మిల్లింగ్ చార్జీలు పెంచి, ఓటీఆర్‌ను సవరించాలి: మెదక్ జిల్లా రైస్ మిల్లర్లు జిల్లాలోని రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, రైస్ మిల్లింగ్ పరిశ్రమను రక్షించాలని మెదక్ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. మిల్లర్లపై జరుగుతున్న ఒత్తిడి, వేధింపులు, దాడులను నిలిపివేయాలని కోరారు. ప్రస్తుతం పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు, విద్యుత్ చార్జీలు, కార్మికుల వ్యయాలు, రవాణా ఖర్చుల కారణంగా రైస్ మిల్లింగ్ పరిశ్రమ తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోందని తెలిపారు. ఈ నేపథ్యంలో మిల్లింగ్ చార్జీలను తక్షణమే పెంచి మిల్లర్లకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా లిఒ టి ఆర్ (అవుట్ -టర్న్ రేషియో )లిను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా వెంటనే పెంచాలని డిమాండ్ చేశారు. ధాన్యం మిల్లింగ్‌లో సోర్టెక్స్ వినియోగం వల్ల ఏర్పడే 15 నుంచి 20 శాతం వరకు స్టోరేజీని అనుమతించాలని కోరారు. నిబంధనలను సడలించి మిల్లర్లపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైస్ మిల్లింగ్ పరిశ్రమపై వేలాది మంది కార్మికులు, రవాణా రంగం, అనుబంధ వ్యాపారాలు ఆధారపడి ఉన్నాయని, మిల్లుల మనుగడకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మిల్లర్లు తెలిపారు. గురువారం మెదక్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రపాల్, రా రైస్ మిల్



జిల్లా అధ్యక్షుడు వీరేశం మాట్లాడుతూ, కొందరు మిల్లర్లు చేసిన తప్పులను ఆసరాగా చేసుకుని మొత్తం రైస్ మిల్ వ్యవస్థను అనుమానాస్పదంగా చూడటం, మిల్లర్లందరినీ తప్పుగా చిత్రీకరించడం సముచితం కాదన్నారు. ఏళ్ల తరబడి నిజాయితీగా సేవలందిస్తున్న వేలాది మంది మిల్లర్ల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయవద్దని కోరారు.

**ప్రభుత్వానికి మిల్లర్ల ప్రధాన విజ్ఞప్తులు:**ధాన్యం దుర్వినియోగం చేసిన వ్యక్తిగత మిల్లర్లపై చట్టపరమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి. క్రిమినల్ కేసులు, వేధింపుల కంటే బకాయిలు లేదా ధాన్యం రికవరీకి ప్రాధాన్యత ఇవ్వాలి. తరుగు, డ్రైయేజ్, మిల్లింగ్ చార్జీల ఆలస్యం వంటి సాంకేతిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి సివిల్ సప్లైస్ శాఖ ప్రత్యేక



కమిటీ ఏర్పాటు చేయాలి. మిల్లింగ్ చార్జీలను పెంచాలి. ఓటీఆర్‌ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించాలి. సోర్టెక్స్ కారణంగా ఏర్పడే 15--20 శాతం స్టోరేజీని అనుమతించాలి. రైస్ మిల్లింగ్ రంగంపై లక్షలాది మంది ఆధారపడి ఉన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించి పరిశ్రమను ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు శివకుమార్, రమేష్, జగదీష్, రాములు, నర్సింలు, వేణు, వీరేశం, అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ పరిష్కారం

- జిల్లా కలెక్టర్ హైమావతీ

చిన్నకోడూరు, సెప్టెంబర్10, (ప్రజాజ్యోతి):- రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న భూ సర్వే తో భూమి సమస్యల పరిష్కారం దొరుకుతుందని జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. గురువారం నాడు చర్ల అంకిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన భూభారతీ భూసర్వే రీసర్వే అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్ తో కలిసి మాట్లాడుతూ.. భూముల కొనుగోలు,అమ్మకాల ప్రక్రియలో భాగంగా సర్వే నంబర్లలో సబ్ నెంబర్లు మారడం అదేవిధంగా పట్టా ఒకరిపై ఉండి కబ్జా ఒకరు ఉండటం వంటి సమస్యలకు భూ రీ-సర్వేలో ఖచ్చితమైన పరిష్కారాన్ని సూచిస్తున్నట్లు తెలిపారు. అందుకు సంబంధించి రైతులు, అధికారులకు సహకారం అందించాలన్నారు. ప్రభుత్వం ఈ రి-సర్వే కోసం ఆరు ఏడు లక్షల రూపాయల వ్యయంతో అధునాతన పద్ధతులతో సర్వే చేయడానికి రోవర్స్ లను కొనుగోలు చేసిందని,దీనివల్ల అత్యంత ఖచ్చితత్వంతో





భూములను కొలిచి పగడ్బందీగా హద్దులను పెట్టడం జరుగుతుందని తెలిపారు. భూముల సర్వే 1935 సంవత్సరంలో జరిగిందని తిరిగి ఈ సంవత్సరంలో భూ రీ సర్వే చేస్తున్నట్లు తెలిపారు. వాస్తవానికి ప్రతి 25 సంవత్సరాలకు ఒకసారి భూముల సర్వే నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. రీ సర్వే చేపట్టే ముందు రైతులకు ముందుగానే సమాచారం అందించాలని, రైతుల సమక్షంలోనే భూముల సర్వే ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నందున భూముల హద్దులు, కోఆర్డినేట్ల నమోదులో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రీ సర్వే పూర్తయిన అనంతరం ప్రతి ఒక్క రైతుకు భూమికి సంబంధించిన మ్యాప్‌ను కోఆర్డినేటర్లు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా రీ సర్వే ప్రక్రియను నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ల్యాండ్ సర్వే అధికారి సుదర్శన్, సర్పంచ్ గాలిపల్లి అనిల్, తహసిల్దార్ సలీం, ఉపసర్పంచ్ రాగినగరాజు, సర్వే అధికారులు,ప్రజా ప్రతినిధులు, తదితరులున్నారు.

## అర్హులందరికి ఓటు హక్కే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ హైమావతి



చిన్నకోడూరు, సెప్టెంబర్10 (ప్రజాజ్యోతి):- అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా ఎస్ఐఆర్ నోటీసులపై విచారణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి కె. హైమావతి అధికారులను ఆదేశించారు. మండల పరిధి చర్లఅంకిరెడ్డిపల్లి గ్రామంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ నోటీసుల ప్రక్రియను గురువారం నాడు ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా నోటీసుల జారీ, విచారణ విధానం, ఓటర్ల నుంచి సేకరిస్తున్న ఆధారాలు, వాటి ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు సంబంధించిన నోటీసులను సంబంధిత ఓటర్లకు వ్యక్తిగతంగా అందజేయాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్కరు కూడా ఓటుహక్కును కోల్పోకుండా సర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సలీం మియా, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

## కుల వివక్షకు పాల్పడితే పదవిలో కొనసాగే హక్కు లేదు

- కేసీఆర్ వెంటనే రాజీనామా చేయాలి
- కొండపాక మండల కాంగ్రెస్ డిమాండ్

కొండపాక, సెప్టెంబర్ 10:( ప్రజా జ్యోతి):- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కులం పేరుతో దూషించడమే కాకుండా ఆయన తల్లిని అవమానించేలా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై ప్రతిపక్ష నేత కేసీఆర్ క్షమాపణ చెప్పాలని, తన పదవికి రాజీనామా చేయాలని కొండపాక మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. వెలికట్ట ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం నిర్వహించిన పత్రికా సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల కనకరాములు, ఏఎంసీ చైర్మన్ విరూపక శ్రీనివాస్‌రెడ్డి ఈ మేరకు డిమాండ్ చేశారు.

**దళితుల నిరసన ప్రాంతాన్ని శుద్ధి చేయడం దారుణం**

కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితులు నిరసన




తెలిపిన అనంతరం ఆ ప్రాంతాన్ని పసుపు నీళ్లు, పాలతో శుద్ధి చేశారన్న ఆరోపణలు దళిత, బహుజన సమాజాన్ని అవమానించడమేనని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. దళితులు, గిరిజనుల పట్ల కుల వివక్ష, అంటరానితనాన్ని ప్రదర్శించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. దళిత, గిరిజనుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కేసీఆర్ కుల వివక్షకు తావిచ్చేలా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉంటూ ఇలాంటి వివక్షకు పాల్పడితే ఒక్క క్షణం కూడా పదవిలో కొనసాగడానికి అర్హత లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వాసరి లింగారావు, వర్కింగ్ ప్రెసిడెంట్ సర్పంచ్ కొయ్యడ వెంకటేశం, మండల ఉపాధ్యక్షుడు చెంది కర్ణాకర్, యూత్ ప్రెసిడెంట్ వేముల బాబు, మండల కార్యదర్శి సిద్దులు, సీనియర్ నాయకులు ఆరెపల్లి శ్రీనివాస్, పంజా చిరంజీవి, పంజా అఖిల్, సర్పంచులు కొలుపుల గంగాధర్, బొమ్మ మల్లయ్య, పావని శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నేటి తరానికి చాకలి
## ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

- బిజెపి జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్



సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి):-చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని బిజెపి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ ముదిరాజ్ అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం పార్టీ నాయకులతో కలిసి సిద్దిపేటలో ఐలమ్మ విగ్రహానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం ఐలమ్మ చేసిన పోరాటం అందరికీ స్ఫూర్తిదాయకం అన్నారు. బడుగు బలహీన వర్గాల విముక్తి కోసం ఆమె చూపిన ప్రతిఘటన ఎప్పటికీ గుర్తుంటుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్,తొడుపునూరి వెంకటేశం,గుండ్ల జనార్ధన్ ,కనకరాజ్ కెమ్మసారం సంతోష్ ,బొడ్డు సునీల్,కొంగర పవన్ ,అరిగే యాదగిరి,మహేందర్ రావు,గంధం కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు

సిద్దిపేట, సెప్టెంబర్ 10 ,(ప్రజాజ్యోతి):పేదల ఆకలి తీర్చడంతో పాటు ప్రతి అర్హ కుటుంబానికి ఆహార భద్రత కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు నేరుగా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని 43వ వార్డులో మాజీ కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి పూజల హరికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో భాగంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు పూర్తి స్థాయి ఆహార భద్రత కల్పించేందుకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసిందన్నారు. గత



బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన పేదలను పట్టించుకోలేదని విమర్శించారు. పదేళ్లలో కొత్త రేషన్ కార్డుల విషయంలో జీరో పాలన సాగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా పారదర్శకంగా చర్యలు చేపడుతోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఆధునిక సాంకేతికతతో రూపొందించిన స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా రేషన్ సరుకులు పొందడంతో పాటు భవిష్యత్‌లో వివిధ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు మరింత సులభతరం అవుతుందని తెలిపారు. పేదలకు నాణ్యమైన సన్న బియ్యం అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఏ ఒక్క అర్హుడూ సంక్షేమ పథకాలకు దూరం కాకుండా చూడటమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం యాదవ్, బొమ్మల యాదగిరి, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, వాహబ్, ఏరాబోలు రాజిరెడ్డి, అంబటి మహేష్, వార్డు కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

చిన్నకోడూరు, సెప్టెంబర్10, ప్రజాజ్యోతి):- చాకలి ఐలమ్మ పోరాటంతో స్ఫూర్తి పొందిన తెలంగాణ రైతాంగ ఉద్యమం వీర తెలంగాణ సాయుధ పోరాటంగా రూపుదిద్దుకుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి రెడ్డి తెలిపారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా చంద్లపూర్ లో రైతులతో కలిసి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అనంతరం మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమంటే కులాలు,మతాల మధ్య జరిగిన పోరాటం కాదని దోపిడీకి వ్యతిరేకంగా జరిగిన వర్గ పోరాటమన్నారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం ఆనాటి ఆంధ్ర మహాసభలో చేరి ఉద్యమించారని తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య, భీంరెడ్డి నర్సింహారెడ్డి, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం తదితరుల సహకారంతో తాను సాగు చేస్తున్న కౌలు భూమిలో పండిన పంటను ఇంటికి చేర్చుకునేందుకు ఆమె చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల స్మరణ సభను ఈ నెల17న బైరాన్‌పల్లిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకునేందుకు రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతులు బిక్షపతి, రంగదాసు,సీహెచ్ సంజీవరెడ్డి, కనకయ్య, వెంకట్, విజయ్‌కుమార్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, తిరుపతి,మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదలకు మేలు

- సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్
- పెంజర్లలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ జగన్





**కొత్తూరు సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వం లోనే పేదలకు మేలు జరుగుతుందని సర్పంచ్ల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ అన్నారు. గురువారం కొత్తూరు మండలంలోని పెంజర్ల గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పథకాలు మరియు సేవలు ప్రజలకు మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు ఈ స్మార్ట్ రేషన్ కార్డులు ఎంతో దోహదపడతాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.తమకు ఎంతో ఉపయోగపడే స్మార్ట్ రేషన్ కార్డులు అందుకున్న లబ్ధిదారులు ఈ సేవ పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ గౌస్, జిపిఓ దామోదర్, డీలర్ రాజేందర్ రెడ్డి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జిడబ్ల్యూఎసి 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**హైదరాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి) :** గల్ఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ (జిడబ్ల్యూఎసి) 10వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు అల్ కుజ్‌లోని డల్స్కో అరేనా ఇండోర్ హాల్‌లోఘనంగా జరిగాయని జిడబ్ల్యూఎసి వ్యవస్థాపక అధ్యక్షులు ధోనికిని కృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత కాన్సులేట్ కాన్సుల్ జనరల్ ఇమ్మడి విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొని గల్ఫ్ కార్మికుల సమస్యలు, సంక్షేమం, భవిష్యత్ అవకాశాలపై సుమారు 45 నిమిషాలు ప్రసంగించారని తెలిపారు. ఇండియా నుంచి ప్రత్యేకంగా వచ్చిన రేలా రేలా సింగర్ గంగా సిస్టర్ కార్యక్రమంలో పాల్గొని ఆకర్షణగా నిలిచినట్లు చెప్పారు. తెలంగాణ గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం సహాయనిధి ఫౌండేషన్ సభ్యుల తోపాటు ఫౌండేషన్ తరపున అధ్యక్షులు తోకల శంకర్, ఉపాధ్యక్షులు బింగి రాజు, ప్రధాన కార్యదర్శి పల్లికొండ గంగనర్సయ్య, కార్యదర్శి బింగి నరసయ్య, కోశాధికారి బింగి పోశన్న, బహ్రెయిన్ ఉపాధ్యక్షులు దేశబోయిన గంగాధర్, గౌరవ సలహాదారులు పుట్టి రాజు, ఊట్నూరి రాజనర్సయ్య, మాజీ అధ్యక్షులు సముద్రాల తిరుపతి, పోశెట్టి, పల్లికొండ రాములు, ఇంటెప్పు నరేష్, జుంబర్తి నరేష్, కల్లెడ మహేష్, పల్లికొండ అనిల్, బింగి పవన్, పందిరి తిరుపతి, కల్లెడ రాకేష్, పందిరి రాజు, పల్లికొండ హరీష్, బోనగిరి అఖిల్, బోరే సురేష్, దండెం కొండయ్య, కల్లెడ భూమన్న, గడ్డం నవీన్ హాజరైనట్లు తెలిపారు.

## గురునానక్ క్యాంపస్‌లో జాతీయ స్థాయి క్రీడా పోటీలు!



**ఇబ్రహీంపట్నం సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి:** గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్ (జీఎన్ఐటీసీ), ఇబ్రహీంపట్నం, సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా, సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ దివంగత సర్దార్ తవీందర్ సింగ్ కోహ్లీ స్మారకార్థం నిర్వహిస్తున్న, సర్దార్ తవీందర్ సింగ్ కోహ్లీ జాతీయ స్థాయి క్రీడా పోటీలు--2026 గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సెప్టెంబర్ 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ క్రీడా పోటీలను గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ వైస్ ఛైర్మన్, యూనివర్సిటీ, హైదరాబాద్ ఛాన్సలర్ సర్దార్ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ ప్రారంభించారు. ఇన్‌స్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. హెచ్. ఎస్. సైనీ, ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, న్యాయబద్ధంగా, సురక్షితంగా ఆడి, క్రీడాస్ఫూర్తిని కాపాడాలని డా. సైనీ సూచించారు. క్రీడలు, క్రీడా పోటీలంటే ఎంతో ఆసక్తి కలిగిన దివంగత సర్దార్ తవీందర్ సింగ్ కోహ్లీ స్మృతికి గుర్తుగా ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే నైపుణ్యం, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి మొత్తం 91 జట్లు పాల్గొంటున్నాయి. వాలీబాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్ బాలుర సింగిల్స్, బ్యాడ్మింటన్ బాలికల సింగిల్స్ మరియు టేబుల్ టెన్నిస్ బాలుర సింగిల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. జీఎన్ఐటీసీ డైరెక్టర్ డా. ఎస్. శ్రీనాథ రెడ్డి స్వాగత ప్రసంగం చేయగా, అసోసియేట్ డైరెక్టర్ డా. రిషి సయల్ కృతజ్ఞతలు తెలిపారు. వేదికపై డా. బి. కేదార్‌నాథ్, అసిస్టెంట్ డైరెక్టర్ -- ఫస్ట్ ఇయర్ బీ.టెక్., డా. సందీప్ పాటిల్, డీన్-- ఐక్యూఏసీ పాల్గొన్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణలో కన్వీనర్ మరియు ఫిజికల్ డైరెక్టర్ పి. ప్రభాకర్ కీలక పాత్ర పోషించారు. ప్రారంభ కార్యక్రమానికి వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, కోచ్‌లు, రిఫరీలు, ఫిజికల్ డైరెక్టర్లు మరియు అధ్యాపకులు హాజరయ్యారు. గురునానక్ ఇన్‌స్టిట్యూషన్స్ టెక్నికల్ క్యాంపస్ సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహిస్తున్న ఈ క్రీడా పోటీలు, విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు వేదిక కల్పించడంతో పాటు క్రీడాస్ఫూర్తి, జట్టుగా పనిచేసే తత్వం, ఆరోగ్యకరమైన పోటీ భావనను పెంపొందించడం లక్ష్యంగా నిర్వహిస్తున్నారు.




### దాతల సహకారంతో మిట్టకోడూరు

# పాఠశాలకు విద్యా వనరులు

- ఎస్ఆర్‌టీఈ సంస్థ స్థాపకులు రమ్య, తన్వి కొడాలి చేతుల మీదుగా పుస్తకాలు, లైబ్రరీ ర్యాక్‌లు, బోధన సామగ్రి పంపిణీ



**పరిగి, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి) :** పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రగతికి దాతల సహకారం ఎంతో అవసరమని పరిగి మండల విద్యాధికారి ఎం. అంజయ్య అన్నారు. గురువారం పరిగి మండలంలోని మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎండి ఉస్మాన్ అలీ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో 'రీడింగ్ అండ్ అకాడమిక్ ఇంప్రూవ్మెంట్ త్రూ స్కూల్ లైబ్రరీ ఎడ్యుకేషన్ (ఎస్ఆర్‌టీఈ)' సంస్థ స్థాపకులు రమ్య, తన్వి కొడాలి పాఠశాలకు లైబ్రరీ పుస్తకాలు, పుస్తకాల ర్యాక్‌లు, బోధన-అభ్యాస సామగ్రి, విద్యార్థులకు కథల పుస్తకాలను ఉచితంగా అందజేశారు.

ఈ సందర్భంగా ఎం. అంజయ్య మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠనాభిరుచిని పెంపొందించడంలో లైబ్రరీల పాత్ర కీలకమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. దాతలు అందిస్తున్న విద్యా వనరులు విద్యార్థుల మేధో వికాసానికి, ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.

గ్రామ సర్పంచ్ పి.మాణిక్యం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కథల పుస్తకాలు, లైబ్రరీ వనరులు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడమే కాకుండా మంచి విలువలను అలవర్చేందుకు దోహదపడతాయని తెలిపారు. సమాజం కోసం పనిచేసే దాతల సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని కొనియాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అనితారాణి మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు విద్యార్థుల సమగ్రాభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా పాఠశాలలో చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు.

కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి సంస్థ ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయుడు కలిసి బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాలకు విద్యా వనరులు అందించిన దాతలను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మల్లేశం, ఉపాధ్యాయులు ఎ. కృష్ణయ్య, ఎన్. నర్సింలు, రాజు, కవిత, ఎంఆర్సీ సిబ్బంది శ్రీశైలం, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

# మోమిన్‌పేట్ విలేకరుల ఐక్యతకు కొత్త బాట!

- అధ్యక్షుడిగా డి.అశోక్..
- ప్రధాన కార్యదర్శిగా గుజ్జరి మహేందర్ ఏకగ్రీవ ఎన్నిక



**మోమిన్‌పేట్. సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి) :** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండలంలో జర్నలిస్టుల ఐక్యతకు మరో ముందడుగు పడింది. మండలంలోని విలేకరులు సమావేశమై విలేకరుల కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడిగా డి .అశోక్, ప్రధాన కార్యదర్శిగా గుజ్జరి మహేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ నిజాన్ని నిర్భయంగా, నిష్పక్షపాతంగా ప్రజల ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా నూతన కమిటీ పనిచేయాలని నిర్ణయించింది.

మండలంలోని జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వృత్తిపరమైన హక్కుల పరిరక్షణకు, జర్నలిస్టుల ఐక్యతను మరింత బలోపేతం చేయడానికి సమష్టిగా కృషి చేయనున్నట్లు నూతన కమిటీ నాయకులు తెలిపారు. ప్రజా సమస్యలే ఎజెండాగా.. ప్రజల పక్షమే లక్ష్యంగా మోమిన్‌పేట్ మండలంలో జర్నలిజాన్ని మరింత బలోపేతం చేస్తామని వారు పేర్కొన్నారు.

నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షుడు దాసరి అశోక్, ప్రధాన కార్యదర్శి గుజ్జరి మహేందర్‌లకు పలువురు జర్నలిస్టులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# పసుపు నీళ్లతో కడగటం దేశానికే సిగ్గుచేటు

- దొర నడిచిన నేలపై దళితులు నడిచేసరికి మైల పడిందా..? - ఏంటీ ఈ వివక్ష..?
- పసుపు నీళ్లతో ఆ నేలను శుద్ధి చేయాల్సిన పరిస్థితి ఇంకా ఉందా..
- బిఆర్ఎస్ నాయకులకు ఇంత కుల వివక్షకు ఎందుకు ? - ఇలా అవమానిస్తే ఇంకా చూస్తూ ఊరుకోం
- దళితులను అవమానించే నాయకులకు బిఆర్ఎస్ పార్టీ కేంద్రంగా మారింది
- బిఆర్ఎస్ దళిత నాయకులు ఈ ఘటనపై స్పందించాలి అని కోరుతున్న... - ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు ఎక్కడ ఉన్నారూ..?
- బిఆర్ఎస్ పార్టీ దళిత నాయకులు ఆ పార్టీ నీ బహిష్కరించాలని మనవి
- ఈ ఘటనకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి - కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోల్ల సురేందర్



**కొత్తూరు సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి) :** స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు కావస్తున్న భారత దేశంలో ఇలాంటి సంఘటనలు దేశానికి సిగ్గుచేటు అని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కర్రోళ్ల సురేందర్ అన్నారు.మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఫామ్ హౌస్ చుట్టుపక్కల దళితులు నడిచారని ఆ నేలను పసుపు నీళ్లతో బిఆర్ఎస్ నాయకులు శుద్ధి చేయడం అనేది ఇంక దేశంలో దళితులను అంటరానివారగానే చూస్తున్నారు అని ఆయన అన్నారు.దళితులను అవమానించే వారికి బిఆర్ఎస్ పార్టీ కేంద్రంగా మారిందని ఆయన అన్నారు.దొర నడిచిన నేలపై దళితులు నడిస్తే ఆ నేల మలినం అయ్యిందా అని ఆయన బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు.దళితులు అన్ని రంగాల్లో సమానంగా అభివృద్ధి చెంది ఉన్న స్థాయికి చేరుకున్న ఇంక ఇలాంటి వివక్షతో చూడటం బిఆర్ఎస్ నాయకులకు తగదు అని ఆవేదన వ్యక్తం చేశారు.బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ మరియు ఆ పార్టీ నాయకులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడనుంచి దళితులను అవమాన పరుస్తూనే ఉన్నారు. ఇలా అవమానపరిస్తే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరించారు.తొలి దశ మరియు మలిదశ ఉద్యమకారుడు మహాకవి గద్దర్ గారిని మరియు తెలంగాణ గీతం రచయిత అంద శ్రీ గారిని దళితులని అవమానించారు.దళితులు సీఎం చేస్తానని దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని, దళిత మంత్రులను బర్తరఫ్ చేయడం దళిత ఎమ్మెల్యేలను వాళ్ళ పక్కన కూర్చొని ఇవ్వకుండా అవమాన పరచడం గతంలో చూసామని అన్నారు.ఈ సంఘటనపై బిఆర్ఎస్ పార్టీలో ఉన్న దళిత నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మరియు దళిత నాయకులు స్పందించాలని డిమాండ్ చేస్తున్నామని అదేవిధంగా బిఆర్ఎస్ పార్టీలో ఉన్న దళిత నాయకులు ఆ పార్టీని బహిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నానాని ప్రభుత్వం స్పందించి ఈ ఘటనకు పాల్పడ్డ వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# అసెంబ్లీ సమావేశాల వేళ కాంగ్రెస్ అరాచకపర్వం









- మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్
- పోలీస్ స్టేషన్ ముందు నిరసన తెలుపుతున్న మాజీ ఎంపిటిసి రాజేందర్ గౌడ్,యువ నాయకుడు శివచారి
- బిఆర్ఎస్ నాయకులు ముందస్తు అరెస్ట్

**కొత్తూరు సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి) :** అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో చలో అసెంబ్లీ, రైతు దీక్షలు, నిరసన కార్యక్రమాలకు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్ అన్నారు. చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో మాజీ కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్,మాజీ ఎంపిటిసి రాజేందర్ గౌడ్,బిఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు శివచారి లను ఈరోజు ఉదయం పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి స్టేషన్కు తరలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వం 1000 రోజుల పాలనలో చేసిన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా అరాచకపర్వానికి తెరలేపింది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు,ప్రజా సమస్యలపై నిరసనలు చేపట్టేందుకు సిద్ధమైన వారిని ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేస్తున్నారని వారు అన్నారు.ప్రజలకు మధ్యకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం..నిరసనలకు వెళ్లకుండా పోలీసులను ప్రయోగించి గొంతులు నొక్కే చర్యలకు దిగుతుందని వారు అన్నారు.

# ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

- బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్
- బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘన నివాళులు





**చేవెళ్ల సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి):** తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి చిరస్మరణీయ మని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ అన్నారు. ఐలమ్మ 41వ వర్ధంతి సందర్భంగా చేవెళ్లలో రజక సంఘం ఆధ్వర్యంలో వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో నాయకులు ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఐలమ్మ చేసిన పోరా టం, ధైర్యసాహసాలను నాయకులు స్మరించుకున్నారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నత్తి కృష్ణారెడ్డి, బ్యాగరి నరసింహులు, కనకమామిడి మల్ రెడ్డి, శివకుమార్, తలారి యాదయ్య, మాణిక్యం, అనంత్ రెడ్డి, ఊరడి రాంప్రసాద్, అత్తెలి భాస్కర్ రెడ్డి, మంగలి రాజు, కుమార్, జంగారెడ్డి, ఎదిరే రాములు, శ్రీశైలం, శంకరయ్య, మల్లేష్, బాలు, టిఆర్ఎస్ నాయకులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు..

- పోరాట యోధురాలి స్ఫూర్తిని స్మరించుకున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రజక సంఘం నాయకులు




**పరిగి, సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి) :** తెలంగాణ ప్రజల తెగువను, పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా గురువారం పరిగి పట్టణంలో ఆమె విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు, కౌన్సిలర్లు, సర్పంచులు, పట్టణ ప్రజలు, రజక సంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ఆమె ఆశయాలను నేటి తరాలకు చేరవేయాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ అరవింద్ రావు పంతులు, కౌన్సిలర్లు మీర్ తాహేర్ అలీ, వారాల రవీందర్, శివనోళ్ళ భాస్కర్, మీదిగడ్డ శ్రీనివాస్, రవికుమార్ అలాగే చాకలి సంఘం నాయకులు ఆంజనేయులు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలా? తాతా మధుపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించి రాజకీయాలకు జీవితకాల నిషేధం విధించాలి

: మోమిన్ పెట్ మాజీసొసైటీ మెంబర్. దుర్గం చెరువు పల్లె ఆనందం ఖండించారు



**మోమిన్‌పేట్. సెప్టెంబర్ 10 (ప్రజాజ్యోతి) :** శాసనసభ ప్రాంగణంలో రాజ్యాంగబద్ధ హోదాలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్పై, ఆయన తల్లిపై ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ మోమిన్ పెట్ మాజీ సొసైటీ నెంబర్. దుర్గం చెరువు పల్లె ఆనందం తీవ్రంగా ఖండించారు. రాజ్యాంగ పదవిలో ఉన్న స్పీకర్‌ను అవమానించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన మండిపడ్డారు. తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి, ఎమ్మెల్సీ పదవి నుంచి తొలగించాలని, భవిష్యత్తులో రాజకీయాల్లో పాల్గొనకుండా జీవితకాల నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. కుల వివక్షకు తావులేకుండా రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సొసైటీ మాజీ మెంబర్ పల్లె ఆనందం అన్నారు. కుల వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు.

## మహిళలు అర్థిక అభివృద్ధి సాధించాలి





**మోమిన్ పెట్ సెప్టెంబర్ 10 ప్రజా జ్యోతి :** పొదుపు సంఘాల్లోని మహిళలు అర్థికాభివృద్ధి సాధిస్తే ఆ కుటుంబంతో పాటు ఆ గ్రామంలో కూడా అభివృద్ధి చెందుతుందని డిపిఎం కొమరయ్య అన్నారు గురువారం మోమిన్ పే ట్ మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల సమైక్య 20వ వార్షికోత్సవ మహా సభను మహిళా సమాఖ్య గౌరవ అధ్యక్షులు భాగ్యలక్ష్మి అధ్యక్షతన జరుపుకున్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ2025-26 సంవత్సరంలో మహిళా సమాఖ్య ఎన్నో విజయాలు సాధించింది అన్నారు మహిళలు ప్రతినెల సమావేశాలు ఏర్పాటు చేసుకొని సంఘం దిన దిన అభివృద్ధిపై సమీక్షలు చేసుకుంటూ చిన్న చిన్న వ్యాపారలతో ఆర్థికంగా ఎదగాలన్నారు మహిళా సమాఖ్య అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో ఏపీఎం మధుకర్ మండల సమైక్య పాలకవర్గం గ్రామ సంఘాల సభ్యులు సీసీలు పాల్గొన్నారు.

## ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఆదర్శం

- బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి



**చేవెళ్ల సెప్టెంబర్ 10(ప్రజా జ్యోతి) :** అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం వీరోచితంగా పోరాడిన చాకలి ఐలమ్మ స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని బీజేపీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి అన్నారు. ఐలమ్మ వర్ధంతి సందర్భంగా చేవెళ్ల--శంకర్‌పల్లి చౌరస్తాలోని ఆమె విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అనంత్ రెడ్డి మాట్లాడుతూ.. పోరాటమే ఊపిరిగా, ధైర్యమే ఆయుధంగా ఐలమ్మ సాగించిన ఉద్యమం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అణచివేతకు తలొగ్గకుండా హక్కుల కోసం ఆమె చూపిన తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం, ఆత్మగౌరవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రజక సంఘం మండల అధ్యక్షుడు శివకుమార్, శ్రీశైలం, బీజేపీ నాయకులు పిసరి శ్రీనివాస్ రెడ్డి, గాజులగూడెం శ్రీనివాస్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి గణేష్, జై సింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేతనాలు ఇవ్వండి.. విధులకు వస్తాం

### ఎంపీడీఓకు కంప్యూటర్ ఆపరేటర్ల వినతి

కొడిమ్యాల,సెప్టెంబర్ 10,(ప్రజాజ్యోతి):
ఐదు నెలలుగా జీతాలు అందడం లేదని, జీతాలు విడుదలయ్యే వరకు సెలవు మంజూరు చేయాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు గురువారం ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. ఇంతకాలం అప్పులు చేస్తూ విధులకు హాజరయ్యామని, ప్రస్తుతం అప్పులు చేసే పరిస్థితి కూడా లేకపోవడంతో



కార్యాలయానికి రావడం కష్టంగా మారిందని తెలిపారు. తమ ఆర్థిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని సెప్టెంబరు 10 నుంచి జీతాలు వచ్చేవరకు సెలవు మంజూరు చేయాలని కోరారు.వెంటనే జీతాలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. పర్శరాములు,జాస్మిని, సుమలత ఉన్నారు.

## మాట్లాడితే.. జీవితాన్ని కాపాడొచ్చు

కొడిమ్యాల,సెప్టెంబర్ 10,(ప్రజాజ్యోతి):
మానసిక ఒత్తిడితో బాధపడుతున్న వారితో మాట్లాడటం ద్వారా వారి జీవితాలను కాపాడవచ్చని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్టూడెంట్ కౌన్సిలర్ డాక్టర్ పి.తిరుపతి అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.గోపాల్ అధ్యక్షతన




నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువతలో మానసిక సమస్యలను గుర్తించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురయ్యేవారు టెలి-మానస్ 14416కు ఫోన్ చేసి నిపుణుల సలహా పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యం

కొడిమ్యాల,సెప్టెంబర్ 10,(ప్రజాజ్యోతి):
మండలంలోని నమిలికొండ గ్రామంలో పోషణ మాసం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంధ్యారాణి హాజరై మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. 'మన అంగన్‌వాడీ–మన బాధ్యత'పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి



ఉండాలని సూచించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

## చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు



ముస్తాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):
తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళా శక్తికి, బహుజన ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ముస్తాబాద్ మండల కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, రజక సంఘం నాయకులు, ప్రజలు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. భూస్వామ్య, దొరల పెత్తనానికి వ్యతిరేకంగా చాకలి ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, తెగువ నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.
మహిళలు సామాజిక అన్యాయాలను ఎదుర్కొని తమ హక్కుల కోసం పోరాడేందుకు ఐలమ్మ జీవితం మార్గదర్శకమని తెలిపారు. ఆమె ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక సమానత్వం, బహుజనుల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రజక సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ చికిత్సలో మరో ముందడుగు

### యశోద హైటెక్ సిటీలో ఇన్‌హౌస్ ఎన్‌జీఎస్ సదుపాయం ప్రారంభం

### ప్రముఖ అంకాలజిస్ట్ డాక్టర్ శీ ఖర్ కుమార్

కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 10( ప్రజాజ్యోతి )
క్యాన్సర్ నిర్ధారణ, చికిత్సలో ప్రెసిషన్ ఆంకాలజీకి ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో యశోద హాస్పిటల్స్ హైటెక్ సిటీలో ఇన్‌హౌస్ నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ (ఎన్‌జీఎస్) సదుపాయాన్ని ప్రారంభించింది. దీనివల్ల క్యాన్సర్ కణాల్లోని జన్యుపరమైన మార్పులను వేగంగా, ఖచ్చితంగా గుర్తించి.. రోగికి సరైన, వ్యక్తిగతీకరించిన చికిత్సను ఎంపిక చేసేందుకు వైద్యులకు మరింత సహకారం లభించనుంది.గురువారం నగరంలోని యశోద హాస్పిటల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ శీ ఖర్ కుమార్ మాట్లాడుతూ.. క్యాన్సర్ చికిత్సలో గతంలో ఉన్న 'అందరికీ ఒకే విధమైన చికిత్స' విధానం క్రమంగా మారుతోందన్నారు. రోగి క్యాన్సర్ జన్యు స్వభావాన్ని గుర్తించి, అందుకు అనుగుణంగా లక్ష్యిత చికిత్స అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందని తెలిపారు. టార్గెటెడ్ థెరపీలు, ఇమ్యూన్ చెక్‌పాయింట్ ఇన్హిబిటర్స్ వంటి ఆధునిక చికిత్సలు అనేక క్యాన్సర్లలో రోగుల జీవనకాలం, జీవన నాణ్యతను మెరుగుపరుస్తున్నాయని వివరించారు.ఆస్పత్రిలోనే ఎన్‌జీఎస్ సదుపాయం అందుబాటులోకి రావడంతో జన్యుపరమైన మార్పులను త్వరగా గుర్తించే అవకాశం ఏర్పడిందన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము, జీర్ణాశయ సంబంధిత క్యాన్సర్లతో పాటు




ఇతర క్యాన్సర్లలోనూ చికిత్స నిర్ణయాలకు ఎన్‌జీఎస్ కీలకంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రోగి అవసరాలకు అనుగుణంగా చికిత్సను ఎంపిక చేయడం ద్వారా ప్రెసిషన్ ఆంకాలజీ మరింత సమర్థవంతంగా అందించవచ్చని తెలిపారు.యశోద హైటెక్ సిటీలో మల్టీడిసిప్లినరీ క్యాన్సర్ నిపుణుల బృందంతోపాటు రోబోటిక్ ఆంకోసర్జరీ, ఆధునిక రేడియేషన్ థెరపీ తదితర సమగ్ర క్యాన్సర్ చికిత్స సేవలు అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి ప్రతినిధులు తెలిపారు. ఇన్‌హౌస్ ఎన్‌జీఎస్ సదుపాయం ప్రారంభంతో ప్రెసిషన్ ఆంకాలజీ సేవల్లో మరో కీలక ముందడుగు పడిందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రోగి కేంద్రంగా క్యాన్సర్ చికిత్స అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

## కరీంనగర్‌ను 'గ్రీన్ సిటీ'గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- పార్టీలకతీతంగా నగర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 10( ప్రజాజ్యోతి )
పార్టీలకతీతంగా నగర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, కరీంనగర్‌ను సుందర, స్వచ్ఛ, హరిత నగరంగా (గ్రీన్ సిటీ) తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని నగర



మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. గురువారం నగరంలోని 34వ డివిజన్‌లో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.12 లక్షల వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులకు మేయర్ శ్రీకారం చుట్టారు. స్థానిక కార్పొరేటర్ సమీనా పర్వీన్, జమ్ము తదితరులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా 34వ డివిజన్ ప్రజలు మేయర్‌కు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అనంతరం మేయర్ కొబ్బరికాయ కొట్టి, అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మేయర్ మాట్లాడుతూ, గతంలో గ్రామ పంచాయతీగా ఉన్న ఈ ప్రాంతం నగరంలో భాగమైన నేపథ్యంలో డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. ప్రజలకు మౌలిక వసతులు, మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మంచినీటి పైపులైన్లు ఏర్పాటు చేస్తున్నామని మేయర్ పేర్కొన్నారు. 34వ డివిజన్ అభివృద్ధికి ఇప్పటికే 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.40 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. అదేవిధంగా యూఐడీఎఫ్ (UIDF) నిధుల నుంచి మరో రూ.50 లక్షలు వెచ్చించి డివిజన్‌లో మరిన్ని మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రహదారులు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి ప్రజల ప్రాథమిక అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేస్తామని తెలిపారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా మరుగుదొడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని మేయర్ హామీ ఇచ్చారు.నగరంలోని ప్రతి డివిజన్ సమగ్ర అభివృద్ధే మా లక్ష్యం. రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నాం. కరీంనగర్‌ను స్వచ్ఛ, సుందర, హరిత నగరంగా తీర్చిదిద్దే దిశగా నిరంతరం కృషి చేస్తాం" అని మేయర్ కొలగాని శ్రీనివాస్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ నెంబర్ నందకుమార్, మున్సిపల్ అధికారులు, స్థానిక డివిజన్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

### బీజేపీ ముస్తాబాద్ మండల శాఖ ప్రధాన డిమాండ్లు

ముస్తాబాద్, సెప్టెంబర్ 10: ( ప్రజా జ్యోతి ):
సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ ముస్తాబాద్ మండల శాఖ డిమాండ్ చేసింది.
బీజేపీ ప్రధాన డిమాండ్లు ఇవే..
1. మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సెప్టెంబర్ 17న జాతీయ జెండాను అధికారికంగా ఆవిష్కరించాలి.
2. తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలి.
3. పాఠశాలలు, కళాశాలల్లో తెలంగాణ విమోచన చరిత్రపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించాలి.
4. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించాలి.
ఈ డిమాండ్లతో బీజేపీ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు సౌల్ల క్రాంతికుమార్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ నిజాం, రజాకార్ల నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిన చారిత్రక రోజుగా సెప్టెంబర్ 17కు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. విమోచన పోరాటంలో



అమరులైన వారి త్యాగాలను స్మరించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. చరిత్రను భావితరాలకు తెలియజేసే విధంగా ప్రభుత్వం అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఎదునూరి గోపికృష్ణ, జిల్లా కార్యదర్శి మీసా సంజీవ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మెరుగు అంజాగౌడ్, ఆవునూర్ సర్పంచ్ నక్కదాసరి రవీందర్, ఉప సర్పంచులు కోలా కృష్ణ, దగ్గు నవీన్, ఉపాధ్యక్షులు తిరుపతి, చికోటి మహేష్, కాసోడి రమేష్, చిట్టినేని శ్రీనివాస్ రావు, కుడుకల జనార్దన్, మహేష్, శక్తి కేంద్ర ఇన్‌చార్జీలు గూడ బాల్‌రెడ్డి, కట్కం మహేష్, మీస స్వామి, కాసరపు రవి, మామిండ్ల బిక్షపతి, హర్షవర్ధన్, యాదగిరి, శ్యామ్, ప్రణవ్, సాయి తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు దుద్దెడ భానుకు ఘన సన్మానం

ముస్తాబాద్, సెప్టెంబర్ 10 ( ప్రజా జ్యోతి ):
రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన దుద్దెడ భానును ముస్తాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. గురువారం ఆయనను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కాంపల్లి శ్రీనివాస్, కొండాపూర్ మాజీ సర్పంచ్ కర్ణాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డీటీ నరసింహులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ నాయకుడు బాబు, ఏఎంసీ డైరెక్టర్ మామిళ్ల శ్రీకాంత్, మంద కిషన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన దుద్దెడ భానుకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఎన్‌ఎస్‌యూఐ బలోపేతానికి కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు.



## చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా అన్నపూర్ణ ఫౌండేషన్‌కు విరాళం

ముస్తాబాద్, సెప్టెంబర్ 10 ( ప్రజా జ్యోతి ):
చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని గూడెం గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో అన్నపూర్ణ ఫౌండేషన్‌కు 15 లీటర్ల వంట నూనెను విరాళంగా అందజేశారు.
సమాజ సేవలో భాగంగా నిరుపేదలు, వృద్ధులు, దివ్యాంగులకు



అన్నపూర్ణ ఫౌండేషన్ అందిస్తున్న సేవలకు తమ వంతు సహకారంగా ఈ విరాళాన్ని అందించినట్లు రజక సంఘం సభ్యులు తెలిపారు.
ఈ సందర్భంగా అన్నపూర్ణ ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ, చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సేవా కార్యక్రమానికి సహకరించిన గూడెం రజక సంఘం సభ్యులకు ఫౌండేషన్ తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## గూడెం గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ముస్తాబాద్ సెప్టెంబర్ 10: ( ప్రజా జ్యోతి ):
గూడెం గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ



సందర్భంగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాటిపల్లి శంకర్, ఉప సర్పంచ్ దగ్గు నవీన్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు సడిమెల బాలయ్య, జిల్లా కార్యదర్శి లింగంపల్లి ఎల్లా గౌడ్, కొప్పు భాగ్య, పులి విజయ్, వార్డు సభ్యులు కస్తూరి అంజయ్య, మాజీ ఎంపీటీసీ బోప్ప శ్రీధర్, మాజీ సర్పంచ్ చిట్నేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## దళితులు నడిచిన ప్రజా రహదారిని "అపవిత్రమైంది" అంటూ శుద్ధి చేసిన ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి

### బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకుల డిమాండ్

ముస్తాబాద్, సెప్టెంబర్ 10 (ప్రజా జ్యోతి):
దళితులు నడిచిన ప్రజా రహదారిని "మైలైంది/అపవిత్రమైంది" అంటూ పసుపు నీటితో శుద్ధి చేసినట్లు వచ్చిన ఆరోపణలపై సమగ్ర, నిష్పక్షపాత దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. 2026 సెప్టెంబర్ 7న ఎర్రవెల్లిలోని మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఫామ్‌హౌస్ వైపు షెడ్యూల్డ్ కాస్ట్ సమాజానికి చెందిన పలువురు శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించిన అనంతరం, దళితులు నడిచినట్లు పేర్కొంటున్న ప్రజా రహదారి/ప్రాంతాన్ని కొంతమంది వ్యక్తులు "మైలైంది/అపవిత్రమైంది" అనే భావనతో పసుపు నీటిని చల్లి శుద్ధి చేసినట్లు వీడియోలు, ఫొటోలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న సమాచారంతో తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ ఆరోపణలు వాస్తవమైతే, కుల ప్రాతిపదికన దళితులు నడిచిన ప్రాంతాన్ని అపవిత్రంగా పరిగణించి శుద్ధి చేయడం తీవ్రమైన కుల వివక్షకు సంబంధించిన చర్యగా పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలు దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడంతో పాటు, రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులు, అంటరానితనం నిర్మూలన స్ఫూర్తికి విరుద్ధంగా ఉంటాయని అన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు జరిపి పసుపు నీటిని చల్లి శుద్ధి చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను గుర్తించాలని, ప్రత్యక్షంగా పాల్గొన్న ప్రతి ఒక్కరి పాత్రను విచారించాలని కోరారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన, నిర్వహించిన, ప్రోత్సహించిన లేదా సహకరించిన వ్యక్తులను కూడా గుర్తించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలు, సామాజిక మాధ్యమ పోస్టులు, సందేశాలు, ఇతర ఎలక్ట్రానిక్ ఆధారాలను సేకరించి భద్రపరచాలని, అందుబాటులో ఉన్న సీసీటీవీ దృశ్యాలను పరిశీలించాలని కోరారు. ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేసి, శుద్ధీకరణ కార్యక్రమానికి ఎవరైనా




ఆదేశాలు ఇచ్చారా, సహకరించారా లేదా ప్రోత్సహించారా అనే అంశాలపై కూడా సమగ్రంగా దర్యాప్తు చేయాలని తెలిపారు.
దర్యాప్తులో లభించే ఆధారాలు, ప్రతి వ్యక్తి పాత్ర, ఘటనకు వర్తించే చట్టపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎస్సీ, ఎస్టీ (అత్యాచారాల నిరోధక) చట్టం, 1989, పౌర హక్కుల పరిరక్షణ చట్టం, 1955, భారతీయ న్యాయ సంహిత, 2023తో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిషేధిస్తుందని గుర్తుచేస్తూ, దళితులు నడిచిన ప్రజా రహదారిని కుల ప్రాతిపదికన అపవిత్రంగా భావించి పసుపు నీటితో శుద్ధి చేసినట్లు వచ్చిన ఆరోపణలు దర్యాప్తులో వాస్తవమని తేలితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనకు సంబంధించిన అన్ని ఆధారాలను భద్రపరచడంతో పాటు బాధితులు, సాక్షులకు ఎలాంటి ఇబ్బందులు లేదా ఒత్తిళ్లు కలగకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు యారటి కరుణాకర్, రాజన్న సిరిసిల్ల జిల్లా ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షులు దుద్దెడ భాను, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నల్ల బుచ్చయ్య, కాంగ్రెస్ నాయకులు మామిళ్ల శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చాకలి బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం (వెంకటాపురం) హైస్కూల్‌లో

## విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ



ఎర్రుపాలెం ప్రజాజ్యోతి మండల పరిధిలోని రాజుపాలెం(వెంకటాపురం )హైస్కూల్‌లో విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. విద్యార్థుల క్రమశిక్షణ, పాఠశాలలో వారి గుర్తింపు మరియు భద్రతను దృష్టిలో ఉంచుకుని ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వెంకటాపురం గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి గారు తన సొంత ఖర్చులతో సుమారు రూ.10,000/- రూపాయలు విలువైన ఐడీ కార్డులను తయారు చేయించి, రాజుపాలెం హైస్కూల్‌లోని విద్యార్థినీ, విద్యార్థులకు అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందించడం సంతోషంగా ఉందని సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డి తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు.రూ.10,000/- రూపాయలు విలువైన ఐడీ కార్డులను విద్యార్థులకు అందజేసిన సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్ రెడ్డిలిగారికి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి గారు,ఎర్రుపాలెం మండల కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ మండల అధ్యక్షులు కర్నాటి సుధాకర్ రెడ్డి గారు,కుడుముల గోపాల్ రెడ్డి గారు, పాఠశాల హెచ్‌ఎం రత్న మేడం గారు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చీఫ్ మెడికల్ ఆఫీసర్‌ను కలిసిన

## ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు



సత్తుపల్లి సెప్టెంబర్10(ప్రజా జ్యోతి) కొత్తగూడెంలోని మెయిన్ హాస్పిటల్‌లో చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్‌ను సత్తుపల్లి ఏరియా ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా సత్తుపల్లి ఏరియా నుంచి దాదాపు 20 శాతం బొగ్గు ఉత్పత్తి జరుగుతోందని తెలిపారు. సత్తుపల్లి ఏరియా 12వ ఏరియాగా ఆవిర్భవించిన నేపథ్యంలో కార్మికులు, అధికారులు, వారి కుటుంబాల వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని సత్తుపల్లిలో ఏరియా హాస్పిటల్ నిర్మించాలని,చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్‌ను విజ్ఞప్తి చేశారు.అలాగే ప్రస్తుతం సత్తుపల్లిలో ఉన్న డిస్పెన్సరీలో కేవలం రెండు పడకలు మాత్రమే ఉన్నాయని, పెరుగుతున్న వైద్య అవసరాలకు అనుగుణంగా అదనపు పడకలను ఏర్పాటు చేయాలని కోరారు. డిస్పెన్సరీలో సిబ్బంది కొరత, అవసరమైన వైద్య పరికరాల సమస్యలను కూడా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ కుమార్ సానుకూలంగా స్పందిస్తూ ఐఎన్‌టీయూసీ నాయకులు ప్రస్తావించిన సమస్యలను పరిశీలించి వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, ఫిట్ సెక్రటరీ షణ్ముఖ చారి, ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాట

## స్ఫూర్తి సమాజానికి అవసరం

రజక సేవా సంఘం
మండల అధ్యక్షులు మల్లారపు బాలాజీ



ఎర్రుపాలెం ఎప్టెంబర్10(ప్రజా జ్యోతి) ఎర్రుపాలెం మండలం తెలంగాణ రజక సేవా సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి కార్యక్రమాన్నిగురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ రజక సేవా సంఘం మండల అధ్యక్షులు మల్లారపు బాలాజీ మాట్లాడుతూ.. సమాజానికి ఐలమ్మ పోరాట స్ఫూర్తి ఎంతో అవసరమని అన్నారు. అణిచివేతలు, అసమానతలకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన మహనీయురాలు ఐలమ్మ ని కొనియాడారు. ఆమె చూపిన ధైర్యం, ఆత్మగౌరవం, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.ఐలమ్మ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తలుపుల విజయబాబు జిల్లా గౌరవాధ్యక్షులు తుపాకుల నాగేశ్వరావు ఎర్రుపాలెం మండల జిల్లా సహాయ సలహాదారు దూదిగం పకీరయ్య ఉపాధ్యక్షులు మల్లారపు గోపాలరావు మరియు రజక సంఘం నాయకులు వేల్పుల గోపాలరావు మల్లారపు చిన్న వీర వెంకయ్య తదితరులు పాల్గొని ఐలమ్మ కి నివాళు లర్పించారు.

## విద్యార్థులకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణకు శ్రీకారం







మధిర: ప్రజా జ్యోతి విద్యార్థులకు ఆధునిక సాంకేతిక, డిజిటల్ నైపుణ్యాలతో పాటు ఉపాధికి అవసరమైన సామర్థ్యాలను అందించేందుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిర మరియు హనీవెల్ సంస్థ మధ్య లెటర్ ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎల్‌వోయు) కుదిరింది. ఈ ఎల్‌వోయు లో భాగంగా హనీవెల్ సంస్థకు చెందిన ఫ్యూచర్ స్కిల్స్ ఎడ్జ్ ప్రోగ్రామ్‌ను సీఎస్‌ఆర్‌బాక్స్ ద్వారా కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించి, ప్రస్తుత ఉద్యోగ విపణిలో అవసరమైన ఆధునిక సాంకేతిక మరియు డిజిటల్ నైపుణ్యాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సైబర్ సెక్యూరిటీ తదితర అంశాలపై శిక్షణ అందించనున్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఎల్‌ఎంఎస్‌లో కోర్సులను పూర్తి చేసే విధానం, మైల్‌స్టోన్స్ తదితర అంశాలను విద్యార్థులకు వివరించారు. రిసోర్స్ పర్సన్‌గా సీనియర్ కోఆర్డినేటర్ వేకనూరి నాగసాయి వ్యవహరించారు. అదేవిధంగా, ఎన్‌టీఎఫ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు సంక్షిప్త అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం. రవీంద్రారెడ్డి సభాధ్యక్షత వహించారు. విద్యార్థులు సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, అవసరమైనప్పుడు తల్లిదండ్రులు, అధ్యాపకులు, స్నేహితులతో తమ సమస్యలను పంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపాల్ జి. అరుణ, ఎన్‌టీఎఫ్ మరియు కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ డా. ఎస్. ఇందిర, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ డా. పి. సుజాత, అధ్యాపకులు పి. లక్ష్మీనారాయణ, డా. వి. నాగరాజు, డా. ఎం.వి.ఎస్. శర్మ, పి. శ్రీనివాస్, షేక్ ఇమ్రాన్, ఎస్. జ్యోతి, టీ. ఆదర్శ్, ఎస్. పృథ్వీరాజ్ తదితరులు, కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## పోషక విలువలు కలిగిన ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం

◆ ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి





చింతకాని సెప్టెంబర్10(ప్రజా జ్యోతి) అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు ,బాలింతలకు అందించే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యవంతులుగా ఉంటారని చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా చింతకాని మండల పరిధిలోని కోమట్ల గూడెం 1,2 అంగన్వాడి కేంద్రంలో టీచర్లు వాణిశ్రీ , మంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ జాతీయ పోషణ మహోత్సవం కార్యక్రమంలో సూపర్వైజర్ సంధ్యారాణి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల సంక్షేమమే లక్ష్యంగా ఐసిడిఎస్ పనిచేస్తుందని , గర్భిణిగా గుర్తించిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల్లో పేరును నమోదు చేసుకుని, అంగన్వాడి కేంద్రాల ద్వారా అందించే పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకొని, టీచర్లు చెప్పిన విధంగా ఎప్పటికప్పుడు వ్యాధి నిరోధక టీకాలను తీసుకోవడం వారిచ్చే సూచనలు సలహాలు పాటించడం ద్వారా రక్తహీనత సమస్యలు రాకుండా ఉంటాయన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇంటి వద్దనే తయారు చేసుకునే విధానాన్ని తెలియజేశారు. అందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ప్రభుత్వ వైద్యులు సోయల్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతులు చాలా బాగా ఉన్నాయని అందువలన ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీలు కావాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని టీచర్లు స్వయంగా తయారు చేసి ,ప్రదర్శించి ఆహారపదార్థాలు తయారు చేసుకునే విధానం గురించి తల్లులకు వివరించారు. అనంతరం సామూహిక అన్నప్రాసన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పరిశుద్ధ రావు, ఏఎన్‌ఎం లక్ష్మి, గ్రామ కార్యదర్శులు కృష్ణారావు, రాధా రాణి వార్డు మెంబర్లు అంజలీదేవి, కుటుంబరావు ఆయా రవి కుమారి , ఆశా కార్యకర్తలు దీనమ్మ ,బేబీ తదితరులు పాల్గొన్నారు.

## శక్తి వద్దు - పాలిటెక్నిక్‌నే కాపాడండి..!

- మణుగూరులో విద్యార్థుల పోస్టుకార్డు నిరసన..
- హైకోర్టు చీఫ్ జస్టిస్ కు పోస్టుకార్డులు రాసిన పాలిటెక్నిక్ విద్యార్థులు..
- ఏఐసీటీఈ-ఎస్బీటీఈటీ కొనసాగించాలని డిమాండ్..
- డిప్లొమా గుర్తింపు కోసం రోడ్డెక్కిన విద్యార్థులు..
- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు..శక్తి పరిధిలోకి తీసుకురావద్దంటూ విద్యార్థుల ర్యాలీ..






భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి/మణుగూరు సెప్టెంబర్ 10,ప్రజాజ్యోతి మణుగూరులోని గవర్నమెంట్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు గురువారం తమ భవిష్యత్తు కోసం వినూత్న నిరసనకు దిగారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను శక్తి పరిధిలోకి తీసుకురావద్దంటూ హైకోర్టు చీఫ్ జస్టిస్ కు పోస్టుకార్డుల ద్వారా తమ గోడును వినిపించారు.ఈ సందర్భంగా విద్యార్థులు "శక్తి వద్దు -- పాలిటెక్నిక్ విద్యను కాపాడండి", అంటు "ఏఐసీటీఈ-- ఎస్బీఈటీటీ వ్యవస్థను కొనసాగించాలి" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ కళాశాల నుండి ర్యాలీ నిర్వహించారు. తమ డిప్లొమా విద్యకు ఉన్న గుర్తింపు, ఉన్నత విద్యకు వెళ్లే అవకాశాలు, స్కాలర్ షిప్ లు, ఫీజు రీయింబర్స్ మెంట్ వంటి అంశాలపై శక్తి ప్రభావం పడుతుందని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం ఉన్న ఏఐసీటీఈ--ఎస్బీఈటీటీ విధానాన్ని యథాతథంగా కొనసాగిస్తూ విద్యార్థుల విద్యా ప్రయోజనాలను, భవిష్యత్తును కాపాడాలని వారు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. తమ సమస్యలను ప్రభుత్వం, సంబంధిత అధికారులు, న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈ పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపట్టినట్లు విద్యార్థులు తెలిపారు.



## వినాయకుడి విగ్రహాల్లో కెమికల్ కల్తీ..

- నిమజ్జనం పేరుతో గోదావరికి విషాభిషేకం చేస్తున్న దందా..!
- కెమికల్ భూతంతో ప్రజల గొంతులో విషం నింపుతున్న రంగుల వినాయక విగ్రహాలు..!
- రంగుల పేరుతో ప్రజలకు మరణశాసనం..
- గోదావరి నీళ్లు తాగితే గుండెపోటు,పక్షవాతం తప్పదా..?
- మట్టి వద్దు... విషమే ముద్దు.! లాభం కోసం మణుగూరును క్యాన్సర్ కూపంగా మారుస్తున్న మాఫియా...
- కలెక్టర్ సార్ గోదావరిని,మనుషులను చంపేస్తున్నారు..!
- నిమజ్జనం పేరుతో గోదావరికి విషాభిషేకం చేస్తున్న దందా..!





భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి/మణుగూరు, సెప్టెంబర్ 10. ప్రజాజ్యోతి మణుగూరు మండలంలో వినాయక విగ్రహాల తయారీ పేరుతో గోదావరి నదిని విషతుల్యం చేస్తున్న తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం స్పష్టంగా బంకమట్టితోనే, ఎలాంటి రసాయనాలు లేకుండా విగ్రహాలు తయారు చేయాలని ఆదేశిస్తున్నా, మణుగూరులోని కొందరు విగ్రహ తయారీదారులు ఆ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. లాభార్జనే ధ్యేయంగా అత్యంత ప్రమాదకరమైన రసాయన రంగులు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ను యథేచ్ఛగా వాడుతూ వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నారని మేధావులు, పర్యావరణ ప్రేమికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గోదావరంతా విషపూరితం..**

పలు రకాల కెమికల్ రంగులతో తయారైన భారీ వినాయక విగ్రహాలను గోదావరి నదిలో నిమజ్జనం చేయడం వల్ల గోదావరి జలాలు తీవ్రంగా కలుషితమవుతున్నాయి. నిమజ్జనం అనంతరం ఆ విగ్రహాలకు పూసిన రంగుల్లోని సీసం, పాదరసం, క్రోమియం, కాడ్మియం వంటి అత్యంత ప్రమాదకరమైన విష రసాయనాలు నీటిలో పూర్తిగా కలిసిపోయి నదిని విషపూరితం గా మారుస్తున్నాయి. నీరు పైకి స్వచ్ఛంగా కనిపిస్తున్నా లోపల మాత్రం విషం నిండిపోతుంది. జలచరాలు మృత్యువాత పడుతున్నా నీటి పరిస్థితి దయనీయంగా మారుతోంది. అదే గోదావరి నీటిని తాగుతూ, అదే నీటిపై ఆధారపడి జీవిస్తున్న మణుగూరు ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని వైద్యులు, మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషపూరిత నీటి వల్ల గుండెపోటు, పక్షవాతం, కిడ్నీ ఫెయిల్యూర్, ఉబ్బసం, చర్మ వ్యాధులు, నరాల బలహీనత, రేచీకటి వంటి దీర్ఘకాలిక రోగాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. లాభం కోసం కొందరు చేస్తున్న ఈ పని ముమ్మాటికీ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని, దీనిని ఏమాత్రం ఉపేక్షించకూడదని ప్రముఖులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ముమ్మాటికీ అధికారుల నిర్లక్షమే..**

"రంగు విగ్రహాలు వద్దు... మట్టి విగ్రహాలే ముద్దు" అని ప్రభుత్వం పేపర్లలో, టీవీల్లో గొప్పగా ప్రచారం చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం అది కేవలం నినాదంగానే మిగిలిపోయిందని స్థానికులు మండిపడుతున్నారు. మణుగూరులో విగ్రహ తయారీ కేంద్రాల వద్దకు వచ్చి తనిఖీ చేసే నాథుడే లేదని, అధికారుల నిర్లక్ష్యమే ఈ దందాకు ఊతమిస్తోందని ఆరోపిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో బహిరంగంగా చెలగాటమాడుతున్న ఈ విగ్రహ తయారీదారులపై సంబంధిత



అధికారులు ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని, ఇంకా ఎంతమంది అనారోగ్యం పాలైతే చర్యలు తీసుకుంటారని ప్రజలు నిలదీస్తున్నారు.

**ప్రతి విగ్రహ తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయాలి..**

ఈ విషపూరిత పరిస్థితిని చూసి ఇక సహించలేని స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు వెంటనే అధికార యంత్రాంగం రంగంలోకి దిగాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. రెవెన్యూ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా మణుగూరు మండలంలోని ప్రతి విగ్రహ తయారీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేయాలని కోరుతున్నారు. ఎక్కడెక్కడ ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ప్రమాదకర రసాయన రంగులు వాడుతున్నారో గుర్తించి ఆ కేంద్రాలను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.కెమికల్ రంగులు వాడుతూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో కేవలం బంకమట్టితో తయారు చేసిన పర్యావరణ హిత విగ్రహాలను మాత్రమే అనుమతించాలని వేడుకుంటున్నారు. అంతేకాకుండా ఇప్పటికే కలుషితమైన గోదావరి నీటి నమూనాలను సేకరించి ల్యాబ్ లో పరీక్షించి, కలుషిత స్థాయి ఎంత ఉందో ప్రజల ముందు బహిర్గతం చేయాలని, గోదావరిని కాపాడటానికి శాశ్వత చర్యలు తీసుకోవాలని ప్రజలు కలెక్టర్ కు విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యార్థుల ధ్రువపత్రాల జాప్యాన్ని వెంటనే పరిష్కరించాలి

◆ బీజేపీ ఎస్టీ మోర్చా, యువమోర్చా నాయకులు భద్రాచలం తాసీల్దార్‌కు వినతి

కొత్తగూడెం కలెక్టరేట్ ,భద్రాచలం /సెప్టెంబర్ 10,(ప్రజా జ్యోతి) ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు, పీజీ ప్రవేశాల ప్రక్రియలు జరుగుతున్న సందర్భంగా విద్యార్థులకు అవసరమైన కుల, సమగ్ర, ఆదాయ, నివాస ధ్రువపత్రాల జారీలో జరుగుతున్న జాప్యాన్ని వెంటనే పరిష్కరించాలని కోరుతూ భద్రాచలం బీజేపీ ఎస్టీ మోర్చా, యువమోర్చా ఆధ్వర్యంలో భద్రాచలం తహసీల్దార్ వై రవికుమార్ కు గురువారం వినతి పత్రం అందజేశారు, ఈ సందర్భంగా బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్ మాట్లాడుతూ, మీ సేవ ద్వారా దరఖాస్తు చేసిన అనంతరం సంబంధిత సిబ్బంది పరిశీలన, ఆర్ఐ ధృవీకరణ, తహసీల్దార్ స్థాయి ఆమోదం వంటి వివిధ దశల్లో సమన్వయం లోపించడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉద్యోగ, విద్య ప్రవేశాల గడువులు సమీపిస్తున్న నేపథ్యంలో పెండింగ్ దరఖాస్తులను ప్రత్యేకంగా సమీక్షించి, అత్యవసర దరఖాస్తులకు ప్రాధాన్యత ఇచ్చి ధ్రువపత్రాలను త్వరితగతిన జారీ చేయాలని కోరారు. అలాగే విద్యార్థులు తమ ధ్రువపత్రాల దరఖాస్తు స్థితిని సులభంగా తెలుసుకునేందుకు తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా, ఉద్యోగం లేదా విద్య ప్రవేశానికి గడువు ఉన్న విద్యార్థులు తమ పెండింగ్ ధ్రువపత్రాల వివరాలను బీజేపీ సహాయ కేంద్రానికి పంపితే, వారి దరఖాస్తు స్థితిని సంబంధిత అధికారుల వద్ద తెలుసుకుని, అవసరమైన మేరకు అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఫాలోఅప్ చేస్తామని కుంజా సంతోష్ తెలిపారు. ఎలాంటి సహాయం కావాలన్నావాట్సాప్ సహాయ కేంద్రం: 9866060034విద్యార్థులు మీ సేవ దరఖాస్తు సంఖ్య, ధ్రువపత్రం పేరు, దరఖాస్తు తేదీ, ఉద్యోగం/ప్రవేశానికి సంబంధించిన గడువు వివరాలను పై నంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా నాయకులు ములిశెట్టి నిఖిల్, అన్నెం సాయి లక్ష్మణ్, కిలారు అంజి, గంగులకుర్తి రామాచారి తదితరులు పాల్గొన్నారు.



## రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుకు రూ.లక్ష లంచం

మొదటిపేజీ తరువాయి..

దిగారు. సచివాలయ ఆవరణలోని దేవాలయం సమీపంలో లంచం తీసుకుంటుండగా ఓ ఉద్యోగిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ లంచం తీసుకోవడంలో మరో ఉద్యోగి హస్తం కూడా ఉన్నట్లు గుర్తించిన ఏసీబీ అధికారులు.. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. వారిద్దరినీ నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి.. విచారిస్తున్నారు. సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.2 లక్షల ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కు కోసం బాధితుడు సంబంధిత ఉద్యోగులను సంప్రదించినట్లు తెలుస్తోంది. ఈ సమయంలో చెక్కును అందించేందుకు రూ.లక్ష లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది. బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో ట్రాప్ నిర్వహించినట్లు సమాచారం. ఇందులో భాగంగా సచివాలయ ఆవరణలోని దేవాలయం వద్ద బాధితుడి నుంచి లంచం తీసుకుంటున్న సమయంలో ఉద్యోగిని అధికారులు పట్టుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో సచివాలయంలోని సీఎంఆర్‌ఎఫ్ విభాగానికి సంబంధించిన సెక్షన్ ఆఫీసర్ వినోద్‌తో పాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్రను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మొదటి విడతగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రాఘవేంద్ర రూ.5 వేల నగదు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత మిగిలిన మొత్తంలో భాగంగా రూ.లక్ష తీసుకునే సమయంలో సీనియర్ అసిస్టెంట్/సెక్షన్ ఆఫీసర్ స్థాయి ఉద్యోగి ఏసీబీ ట్రాప్‌లో చిక్కినట్లు తెలుస్తోంది. ఈ లంచం వ్యవహారంలో ఎవరి ఆదేశాల మేరకు డబ్బులు డిమాండ్ చేశారు.. ఇంకా ఎవరైనా ఉద్యోగులు, అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నారా.. అనే కోణాల్లో ఏసీబీ అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ట్రాప్ తర్వాత ఏసీబీ అధికారులు సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించిన విభాగంలో సోదాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. బాధితుడి దరఖాస్తు, సీఎంఆర్‌ఎఫ్ మంజూరు ప్రక్రియ, చెక్కు విడుదలకు సంబంధించిన ఫైళ్లు, ఉద్యోగుల పాత్రపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్ వెనుక మరెవరైనా రెగ్యులర్ అధికారులు ఉన్నారా అనే అంశంపైనా దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ట్రాప్‌లో పట్టుబడిన ఇద్దరు ఉద్యోగులను నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. లంచం డిమాండ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, డబ్బుల లావాదేవీలు, సీఎంఆర్‌ఎఫ్ ఫైల్ ప్రాసెసింగ్‌లో వారి పాత్ర వంటి అంశాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకమైన కార్యాలయమైన సచివాలయంలోనే సీఎంఆర్‌ఎఫ్‌కు సంబంధించిన వ్యవహారంలో లంచం తీసుకుంటూ ఉద్యోగులు పట్టుబడినట్లు వార్తలు రావడం ఉద్యోగ వర్గాల్లో చర్చకు దారితీసింది. పేదలు, అనారోగ్యంతో బాధపడుతున్నవారికి ఆర్థిక సాయం అందించేందుకు ఉద్దేశించిన ముఖ్యమంత్రి సహాయ నిధికి సంబంధించిన ప్రక్రియలో లంచం డిమాండ్ చేశారన్న ఆరోపణలు రావడం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.

## హైదరాబాద్‌లో బుల్లెట్ ట్రైన్ హబ్

మొదటిపేజీ తరువాయి..

(సమీకృత సమగ్ర రవాణా కేంద్రం) ఏర్పాటు చేయబోతున్నారు. ఈ మెగా మల్టీ మోడల్ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు అధికారికంగా ప్రారంభించారు. ఈ భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు కోసం శంషాబాద్–తుక్కుగూడ ఔటర్ రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డును ఆనుకుని ఉన్న బహదూర్‌గూడ పరిధిలో 796.28 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఈ ప్రక్రియ కోసం ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్ ప్రకారం సేకరిస్తున్న మొత్తం స్థలంలో సర్వే నంబర్లు 28, 62 పరిధిలోని 750 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, మిగిలిన 46.28 ఎకరాలు ప్రైవేటు, పట్టా భూములుగా అధికారులు గుర్తించారు. నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ఈ భూముల్లో ఎలాంటి లావాదేవీలు లేదా ల్యాండ్ డెవలప్‌మెంట్ పనులు చేపట్టరాదని రెవెన్యూ యంత్రాంగం స్పష్టం చేసింది. ఈ ప్రతిపాదనలపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లోగా లిఖితపూర్వకంగా తెలియజేయవచ్చని పేర్కొంది. సీఎం రేవంత్ రెడ్డి సరిగ్గా ఆరు నెలల క్రితం తీసుకున్న నిర్ణయం మేరకు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. విమానాశ్రయ రన్‌వేకు అత్యంత సమీపంలో ఉండటం వల్ల భవిష్యత్తులో విమాన ప్రయాణికులు నేరుగా బుల్లెట్ రైలు సేవలను వినియోగించుకోవడానికి వీలవుతుంది. ఈ బహదూర్‌గూడ హబ్ కేంద్రంగా హైదరాబాద్–ముంబయి, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–చెన్నై (వయా అమరావతి) వంటి మూడు ప్రధాన హైస్పీడ్ బుల్లెట్ రైలు కారిడార్ల కార్యకలాపాలను నిర్వహించనున్నారు. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ నుంచి ముంబయి, బెంగళూరు, చెన్నై నగరాలకు ప్రయాణ సమయం కేవలం 2 గంటలకు తగ్గిపోనుంది.

## త్వరలో ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికలు

మొదటిపేజీ తరువాయి..

రాబోతున్నాయి. వాటిలో 50 పాతబస్తీకి, మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానిస్తాం. 347.47 కోట్ల మంది మహిళలు ఉచిత ప్రయాణం పొందగలిగారు. ఇది ఒక చరిత్ర అని తెలిపారు. ఆర్టీసీ ఆర్థికంగా నిలదొక్కుకున్న తర్వాత కొత్త బస్టాండ్లు నిర్మిస్తాం. వంద మినీ బస్సులు రాబోతున్నాయి. పాతబస్తీకి 50 కేటాయిస్తాం. మరో 50 బస్సులు ఎంఎంటీఎస్, మెట్రోతో అనుసంధానం చేస్తాం. బస్టాండ్ల అభివృద్ధికి ఆర్థికంగా ఎమ్మెల్యేలు సహకరించాలి. 347.47కోట్ల మంది మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. మహిళలు రూ.12,171 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారు. హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లకు ఆర్టీసీ స్థలం అందించాం. కార్మిక సంఘాల ఎన్నికలను గత ప్రభుత్వం రద్దు చేసింది. కార్మిక సంఘాల ఎన్నికలపై సంఘాల నేతలతో చర్చలు జరుగుతున్నాయి. కార్మిక సంఘాల ఎన్నికల తర్వాత ఆర్టీసీ వీలీన ప్రక్రియ ఉంటుంది. ఆర్టీసీ విలీనమైన ఏపీలో అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారని తెలిపారు.

## ఉద్యోగుల పక్షాన ఉంటా..

మొదటిపేజీ తరువాయి..

పీఆర్‌సీ కమిటీ నివేదిక ఆలస్యం కావడంతో ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనను కూడా జేఏసీ నేతలు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఉద్యోగ సంఘాల నాయకులపై పెరుగుతున్న ఒత్తిడి గురించి కూడా వివరించారు.



సమస్యలపై సుదీర్ఘంగా చర్చించిన సీఎం.. తాను ఎప్పుడూ ఉద్యోగుల పక్షానే ఉంటానని హామీ ఇచ్చినట్లు 'తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్' (టీఆర్‌ఈఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు కె. గౌతమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రమణ్ రెడ్డి తెలిపారు. ఆరు డీఏలపై త్వరలోనే ప్రకటన చేస్తామని సీఎం చెప్పినట్లు వారు వెల్లడించారు. పీఆర్‌సీ కమిటీ నివేదిక కూడా వెంటనే తనకు అందేలా అవసరమైన చర్యలు తీసుకుంటానని సీఎం స్పష్టం చేసినట్లు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. సీఎం సానుకూలంగా స్పందించి హామీలు ఇవ్వడంపై టీఆర్‌ఈఎస్‌ఏ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని నేతలు తెలిపారు. సీఎంను కలిసిన వారిలో టీఆర్‌ఈఎస్‌ఏ గౌరవాధ్యక్షుడు వంగా రవీందర్‌రెడ్డి ఉన్నారు.

# నూతన శకంలోకి లైఫ్ సైన్సెస్

మొదటిపేజీ తరువాయి..

హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ రంగం పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా నూతన శకంలోకి అడుగుపెట్టిందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో 2,000కు పైగా కంపెనీలతో సంపూర్ణమైన లైఫ్ సైన్సెస్ ఎకోసిస్టమ్ ఉందని, వ్యాక్సిన్ల తయారీలో హైదరాబాద్ ఇప్పటికే గ్లోబల్ లీడర్‌గా ఎదిగిందని తెలిపారు. అంతేకాకుండా అమెరికా వెలుపల అత్యధిక యూఎస్‌ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన సంస్థలు హైదరాబాద్‌లోనే ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం కేవలం ఔషధ తయారీకే పరిమితం కాకుండా అధునాతన ఆర్ అండ్ డీ), గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాల దిశగా దూసుకుపోతోందని చెప్పారు. గత రెండేళ్ల కాలంలో ఆమ్‌జెన్, ఎలీ లిల్లీ, బ్రిస్టల్ మైయర్స్ స్క్విబ్, సనోఫీ, అలైన్ టెక్నాలజీ, జోయెటిస్ వంటి ప్రపంచ ప్రఖ్యాత దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌లో తమ కేంద్రాలను ఏర్పాటు చేశాయని మంత్రి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 'నెక్స్ట్–జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026–30' ద్వారా డ్రగ్ డిస్కవరీ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, క్లినికల్ రీసెర్చ్ మరియు అత్యాధునిక టెక్నాలజీల అనుసంధానానికి పెద్దపీట వేస్తున్నామని చెప్పారు.

గత ఏడాది ఏర్పాటైన 75కు పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు తోడుగా, త్వరలోనే జీసీసీల సంఖ్యను 100కు చేరుస్తామని, దీనిద్వారా దాదాపు 4 లక్షల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయని వెల్లడించారు. అంతేకాకుండా భారత్ ఫ్యూచర్ సిటీలో 2,100 ఎకరాల లైఫ్ సైన్సెస్ జోన్, ప్రత్యేకంగా 100 ఎకరాల్లో బయోలాజిక్స్ హబ్‌తో పాటు 1బయో మోడల్ మౌలిక వసతులను కల్పిస్తున్నామని స్పష్టం చేశారు.



ఎంఎస్‌డీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అభిషేక్ నారాయణ్ సింగ్ మాట్లాడుతూ.. ప్రపంచ స్థాయి డిజిటల్ సామర్థ్యాలను విస్తరించేందుకు హైదరాబాద్‌లో విస్తారమైన ప్రతిభ, అత్యుత్తమ టెక్నాలజీ ఎకోసిస్టమ్ ఉన్నాయని, అందుకే ఈ నగరాన్ని ఎంచుకున్నామని తెలిపారు. ఈ నూతన కేంద్రం ద్వారా డిజిటల్, డేటా అనలిటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ), ఇంజినీరింగ్ సాంకేతికతలతో ప్రపంచవ్యాప్తంగా మానవ మరియు జంతు ఆరోగ్య రక్షణకు అవసరమైన పరిష్కారాలను అందిస్తామని సంస్థ స్పష్టం చేసింది. జీనోమ్ వ్యాలీతో పాటు ఐఐసీటీ, సీసీఎంబీ, నైపర్ వంటి ప్రముఖ పరిశోధనా సంస్థలు ఉండటం హైదరాబాద్‌కు మరింత బలాన్ని చేకూరుస్తోందని నేతలు వివరించారు.

## 8,283 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

**వానాకాలం ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**

**రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలి**

**సంబంధిత శాఖల అధికారులకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశం**

హైదారాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): 2026–27 వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో ధాన్యం కొనుగోళ్లకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు సజావుగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. 2026–27 వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 57.7 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, సుమారు 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్లు సీఎస్ తెలిపారు. ఇందులో సుమారు 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు వెల్లడించారు. 2026–27 వానాకాల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సీఎస్ సంజయ్ జాజు గురువారం డా. బీ.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. గత వానాకాలం సీజన్‌లో సుమారు 70 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగి, 154.41 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, 71.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సీఎస్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఈసారి కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,283 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీఎస్ వెల్లడించారు. ఐకేపీ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఇతర కొనుగోలు ఏజెన్సీల సమన్వయంతో కేంద్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అక్టోబర్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రావడం ప్రారంభమవుతుందని, నవంబర్‌లో పెద్దఎత్తున ధాన్యం వచ్చే అవకాశం ఉన్నందున ముందుగానే అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా ధాన్యం రవాణా, హమాలీల ఏర్పాటు, గోదాములు, నిల్వ సామర్థ్యం తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎస్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించాలని సీఎస్ సూచించారు. రైతుల ఆధార్ వివరాలను చెల్లింపుల కోసం ఉపయోగించే బ్యాంకు ఖాతాతో అనుసంధానం చేసే ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు, రవాణా, నిల్వ, చెల్లింపుల ప్రక్రియలో ఎక్కడా జాప్యం లేకుండా శాఖల మధ్య సమన్వయం ఉండాలని, రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డీ.ఎస్. చౌహాన్, పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

మొదటిపేజీ తరువాయి..

మంత్రి సీతక్క ప్రవేశపెట్టిన బిల్లుపై చర్చ జరిపి ఆమోదించింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలు తమ సొంత ఆదాయ వనరుల ద్వారా సమకూర్చుకునే నిధులను ప్రభుత్వ ట్రెజరీ ఖాతాలో జమ చేయాల్సి వస్తోంది. ఆ తర్వాత గ్రామ అవసరాలకు ఆ నిధులను వినియోగించుకోవాలంటే ట్రెజరీ ద్వారా నిధులను నిర్దిష్టమైన ప్రక్రియ ద్వారా డ్రా చేసుకోవాల్సి ఉంటుంది. అనుమతులు, అవసరమైన పత్రాల వల్ల కొన్నిసార్లు నిధుల వినియోగంలో ఆలస్యం జరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ఫైనాన్సు కమిషన్ నిధులను బ్యాంకు ఖతాల్లో జమ అయినట్లుగానే జీపీ సొంత ఆదాయం కూడా బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా చట్టాన్ని సవరిస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. గ్రామపంచాయతీల కోసం ప్రతీ నెల ప్రభుత్వం 50 కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని సీతక్క తెలిపారు. ఎన్నికలు జరగకపోవడంతో నిలిచి పోయిన కేంద్ర నిధుల్లో ఇంకా రూ.619 కోట్లు రావాల్సి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వీజీజీ రాంజీ పథకం వల్ల 2 వేల కోట్ల అదనపు భారం పడుతున్నప్పటికీ



ఇంకుడు గుంతలు, పంట కుంటలు, ఊట కుంటలను నిర్మిస్తున్నామని తెలిపారు. హ్యామ్ విధానంలో వేల కిలోమీటర్ల గ్రామీణ రోడ్లను నిర్మిస్తున్నామని సీతక్క తెలిపారు.పంచాయతీ రాజ్ చట్ట సవరణపై మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. రెండేళ్లుగా 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయన్న మంత్రి సీతక్క ఎన్నికల తర్వాత పెండింగ్ నిధులు ఇప్పుడిప్పుడే విడుదల అవుతున్నాయని తెలిపారు. కేంద్రం నుంచి దాదాపు రూ.700 కోట్ల పెండింగ్ నిధులు రావాల్సి ఉందని, స్టాంపుడ్యూటీని 2018లోనే తొలగించటం స్థానిక సంస్థలు కొంత సంక్షోభంలో పడ్డాయని చెప్పారు. గ్రామ పంచాయతీలకు ప్రతినెలా రూ.54 కోట్లు విడుదల చేస్తున్నామన్న మంత్రి సర్పంచ్‌లకు పెండింగ్ ఉన్న నిధుల్లో పంచాయతీరాజ్‌శాఖ నుంచి ఏమీ లేవని స్పష్టం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేల ఫండ్స్ పనులు చేసి పంచాయతీరాజ్‌శాఖను అడుగుతున్నారని తెలిపారు. వివాదాల వల్ల ఎన్నికలు జరగని గ్రామాలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వమే నిధులు ఇస్తోందని సభకు వివరించారు. గ్రామపంచాయతీలకు సహకార బ్యాంకుల్లో నిధులు జమచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. బీజేపీ సభ్యులు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు విజయ రమణరావు, శంకర్ తదితరులు చర్చలో పాల్గొని సూచనలు ఇచ్చారు.

## చైనా షిప్‌యార్డ్‌లో అగ్నిప్రమాదం..

మొదటిపేజీ తరువాయి..

పనులు జరుగుతున్న క్రమంలో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. ప్రమాదం సంభవించిన సమయంలో నౌకలో మొత్తం 42 మంది సిబ్బంది ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, ప్రమాదానికి గల కారణాలపై తక్షణమే దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నౌకలో చిక్కుకున్న వారిని సురక్షితంగా బయటకు తీసుకురావడం, క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని ప్రధాని లీ కియాంగ్ స్పష్టం చేశారు. చైనా స్టేట్ షిప్‌బిల్డింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నడిచే కింగ్‌డావో బీహై షిప్‌యార్డ్, ఆ దేశంలోని అతిపెద్ద నౌకా నిర్మాణ, మరమ్మతు కేంద్రాలలో ఒకటిగా గుర్తింపు పొందింది.



## పేదల ఆత్మగౌరవమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యం

**ఇందిరమ్మ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి స్పష్టీకరణ**

హైదారాబాద్, సెప్టెంబర్ 10(ప్రజాజ్యోతి): పేదల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారు నివసించే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం శాసనసభలో ఎమ్మెల్యేలు మనోహరరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మేడేపల్లి సత్యం, అక్బరుద్దీన్, వెంకట్రామిరెడ్డి తదితర సభ్యుల ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పేదలను వారి జీవనోపాధికి దూరంగా 30--40 కిలోమీటర్ల అవతలికి పంపించే విధానం తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు. ఎకరం రూ.150--200 కోట్లు విలువ చేసే ప్రాంతాల్లో కూడా పేదవాడి ఆత్మగౌరవానికి తగినట్లుగా ఇల్లు కల్పించాలన్న ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటిస్తున్నామని మంత్రి తెలిపారు. డ్రాలో ఎంపికైన ప్రతి లబ్ధిదారుడిని అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా పరిశీలిస్తున్నారని చెప్పారు. ఇతర నియోజకవర్గాలకు చెందిన వారు డ్రాలో ఎంపికైనట్లు తేలితే వారి పేర్లను తప్పనిసరిగా తొలగిస్తామని సభ సాక్షిగా స్పష్టం చేశారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం లేదా కేంద్ర ప్రభుత్వం పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఉచితంగా అందించిన ఉదాహరణ లేదని, తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల కోసం రూ.5 లక్షలు అందిస్తున్నామని మంత్రి చెప్పారు. రూ.5 లక్షలు సరిపోవడం లేదని పలువురు సభ్యులు సూచించారని, ఆ అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని తెలిపారు. మొదటి విడతలో మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.22,500 కోట్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లకు సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. రెండు విడతల్లోనే సుమారు 8 లక్షల ఇళ్లకు రూ.40 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉందన్నారు. భవిష్యత్తులో మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన పేదలకు ఇళ్లు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మొదటి విడతలో ప్రభుత్వ అనుమతులతో ఇళ్లు ప్రారంభించి, నిర్మాణంలో చిన్నచిన్న లోపాల కారణంగా నిలిచిపోయిన సుమారు 3,200 ఇళ్లను రాటిఫై చేసి క్లియర్ చేశామని మంత్రి తెలిపారు. వారందరికీ ఈ వారం చివర్లోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో రాజకీయ వివక్షతో ఇళ్ల కేటాయింపులు జరిగాయని విమర్శించిన మంత్రి.. తమ ప్రభుత్వం మాత్రం అర్హతే ప్రామాణికంగా ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. ప్రతిపక్ష సభ్యులు సూచించిన అర్హులైన పేదల పేర్లను కూడా పరిశీలించి, అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎక్కడైనా అర్హులైన పేదలకు అన్యాయం జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాలు, సేకరించిన భూముల్లో ఇంకా కేటాయింపులు జరగని స్థలాలను గుర్తించి, అర్హులైన పేదలకు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.







Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967